

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 8-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 22

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య ఉ. 8.51 తదుపరి పాడ్యమి; నక్షత్రం: భరణి మ. 1.33 తదుపరి కృత్తిక వర్జ్యం: రా. 12.44 -2.13; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.37; అమృతఘడియలు: ఉ. 9.08-10.36; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.33

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
చెన్నై	11	6	5	0	12	0.700
హైదరాబాద్	11	6	5	0	12	-0.065
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	11	6	5	0	12	-0.371
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
ముంబై	12	4	8	0	8	-0.212
గుజరాత్	11	4	7	0	8	-1.320

ఆఖరి రోజు ఏడు స్వర్ణాలు

అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

అస్తానా (కజకిస్థాన్): ఆసియా అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు 12 స్వర్ణాలతో అదరగొట్టారు. ఆఖరి రోజైన మంగళవారం జరిగిన పోటీల్లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ప్రీతి (54 కిలోలు) సహా ఏడుగురు బాక్సర్లు స్వర్ణాలు సాధించారు. మరో ఐదుగురు బాక్సర్లు రజతాలు దక్కించుకున్నారు. మొత్తంగా 12 స్వర్ణాలు, 14 రజత, 17 కాంస్యాలతో 43 పతకాలు సాధించిన భారత్ రెండో స్థానంతో టోర్నీని ముగించింది. ఆతిథ్య కజకిస్థాన్ 48 మెడల్స్‌తో అగ్రస్థానం సొంతం చేసుకుంది.

వరుణుడు కరుణిస్తాడా!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ప్లేఆఫ్స్ రేసుకు అర్హత సాధించాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌కు ముందు వరుణుడు ప్రతాపంతో ఉప్పల్ స్టేడియం తడిసి ముద్దయింది. మరో నాలుగు రోజులు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించడంతో బుధవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ)తో జరగాల్సిన ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకవేళ మ్యాచ్ మొదలైనా పూర్తి స్థాయిలో జరుగుతుందా అనే అనుమానాలున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి లఖ్‌నవూ జట్టు ప్రాక్టీసు కూడా రద్దయింది. మ్యాచ్ జరిగితే మాత్రం ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్న ఎస్‌ఆర్‌హెచ్, లఖ్‌నవూ జట్ల మధ్య ఆసక్తికర పోరు జరగనుంది. ఇరు జట్లకు మరో మూడు మ్యాచ్‌లే మిగిలున్న నేపథ్యంలో ఇరువురికీ ఈ పోరు కీలకం కానుంది.

నేటి మ్యాచ్ | రాత్రి 7.30 గం. | వేదిక: హైదరాబద్
హైదరాబాద్ X లఖ్‌నవూ

ఢిల్లీ అదుర్స్

ఫ్రేజర్, పోరెల్ మెరుపు ఇన్నింగ్స్

రాజస్థాన్‌పై విజయం● పోరాడిన శాంసన్

20 బంతుల్లోపే ఎక్కువ అర్ధసెంచరీలు (3) చేసిన ఐపీఎల్ బ్యాటర్‌గా ఫ్రేజర్. **1**



ఫ్రేజర్ (20 బంతుల్లో 50)

అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 65)



సంజూ శాంసన్ (46 బంతుల్లో 86)

స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ (సి) ఫెరీరా (బి) అశ్విన్ 50, అభిషేక్ పోరెల్ (సి) సందీప్ (బి) అశ్విన్ 65, హోప్ (రనౌట్) 1, అక్షర్ (సి) పరాగ్ (బి) అశ్విన్ 15, పంత్ (సి) బౌల్ట్ (బి) చాహల్ 15, స్టబ్స్ (ఎల్బీ) సందీప్ 41, గుల్బదిన్ (సి) అశ్విన్ (బి) బౌల్ట్ 19, రసిక్ (రనౌట్) 9, కుల్దీప్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 20 ఓవర్లలో 221/8; వికెట్ల పతనం:** 1-60, 2-68, 3-110, 4-144, 5-150, 6-195, 7-215, 8-221; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-48-1, సందీప్ 4-0-42-1, అవేశ్ 2-0-42-0, అశ్విన్ 4-0-24-3, పరాగ్ 2-0-17-0, చాహల్ 4-0-48-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) అక్షర్ (బి) ఖలీల్ 4, బట్లర్ (బి) అక్షర్ 19, సంజూ శాంసన్ (సి) హోప్ (బి) ముకేశ్ 86, పరాగ్ (బి) రసిక్ 27, శుభమ్ దూబే (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 25, పావెల్ (బి) ముకేశ్ 13, ఫెరీరా (ఎల్బీ) కుల్దీప్ 1, అశ్విన్ (సి) హోప్ (బి) కుల్దీప్ 2, బౌల్ట్ (నాటౌట్) 2, అవేశ్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 201/8; వికెట్ల పతనం:** 1-4, 2-67, 3-103, 4-162, 5-180, 6-181, 7-185, 8-194; **బౌలింగ్:** ఖలీల్ 4-0-47-2, ఇషాంత్ 3-0-34-0, ముకేశ్ 3-0-30-2, అక్షర్ 3-0-25-1, కుల్దీప్ 4-0-25-2, రసిక్ 3-0-36-1.

న్యూఢిల్లీ: అరుణ్‌జైట్లీ మైదానంలో వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ 220కిపైగా స్కోరు నమోదైన వేళ.. ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్‌దే పైచేయి అయ్యింది. ఓపెనర్లు అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 65), ఫ్రేజర్ (20 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 50) మెరుపు అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా.. ఆ తర్వాత బౌలర్లు ప్రతాపం చూపారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 20 పరుగులతో ఢిల్లీ ఘన విజయం సాధించింది. అటు రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 86) పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ గెలుపుతో ఢిల్లీ 12 పాయింట్లతో ఐదో స్థానానికి చేరింది. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 221 పరుగులు చేసింది. చివర్లో స్టబ్స్ (20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 41) చెలరేగాడు. అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసి ఓడింది. శుభమ్ దూబే (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25) పర్వాలేదనిపించాడు. కుల్దీప్, ముకేశ్, ఖలీల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్ నిలిచాడు.

శాంసన్ ఒక్కడే: భారీ ఛేదనలో కెప్టెన్ శాంసన్ ఒంటరి పోరు సాగించాడు. కానీ సరైన సమయంలో అతడి వికెట్ తీసి ఢిల్లీ మ్యాచ్‌ను వశం చేసుకుంది. రెండో బంతికే ఓపెనర్ జైస్వాల్ వికెట్ కోల్పోయినా శాంసన్ దూకుడుగా ఆడాడు. మూడో ఓవర్‌లో 6,4తో బ్యాట్‌కు పనిజెప్పిన అతను.. నాలుగో ఓవర్‌లో 4,4,6.. ఐదో ఓవర్‌లో 6,4,4తో బౌలర్లను ఆడుకున్నాడు. అయితే అక్షర్ ఓవర్‌లో బట్లర్ (19) 4,6 బాదినా అతడికే చిక్కడంతో రెండో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత పరాగ్ (27) ఉన్న కాసేపు వేగం కనబరిచి 11వ ఓవర్‌లో అవుటయ్యాడు. అప్పటికే స్కోరు వంద దాటింది. ఈ దశలో శాంసన్‌కు శుభమ్ జత కలిశాడు. ఓ భారీ సిక్సర్‌తో 26 బంతుల్లోనే శాంసన్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత రసిక్ ఓవర్‌లో వరుసగా 6,4,6 బాదడంతో పరుగులు ధారాళంగా వచ్చాయి. అటు శుభమ్ కూడా ఇషాంత్ ఓవర్‌లో 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే జట్టు ఛేదన వైపు సజావుగా సాగుతున్న వేళ 16వ ఓవర్‌లో శాంసన్ భారీ షాట్‌కు వెళ్లి వివాదాస్పదరీతిలో క్యాచ్ అవుటయ్యాడు. లాంగాన్‌లో బౌండరీ దగ్గర హోప్ ఆ క్యాచ్‌ను అందుకున్నప్పుడు రీప్లేలో అతడి కాళ్లు లైన్‌ను తాకాయా? లేదా? అనే విషయంలో స్పష్టత లేకపోయింది. ఈ విషయమై శాంసన్ అంపైర్లతో మాట్లాడినా, చేసేదేమీ లేక నిరాశగా వెనుదిరిగాడు. దీంతో నాలుగో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం రాజస్థాన్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. వేగంగా ఆడుతున్న శుభమ్ అవుటవడంతో ఆర్ఆర్ ఒత్తిడిలో పడింది. 18వ ఓవర్‌లో కుల్దీప్.. ఫెరీరా (1), అశ్విన్ (2) వికెట్లు తీశాడు. ఆఖరి ఓవర్‌లో 29 రన్స్ కావాల్సి ఉండగా, రెండో బంతికే పావెల్ (13) బౌల్డవడంతో రాజస్థాన్‌కు నిరాశ తప్పలేదు.

టీ20 ఫార్మాట్‌లో 350 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా చాహల్. ఓవరాల్‌గా అతను ఐదో స్థానంలో ఉండగా, రషీద్ (572) టాప్‌లో ఉన్నాడు. **1**

ఫ్రేజర్, స్టబ్స్ దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఆరంభంలో ఓపెనర్ ఫ్రేజర్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. తర్వాత అభిషేక్ పోరెల్.. చివర్లో స్టబ్స్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో జట్టు భారీస్కోరు అందుకుంది. తొలి ఏడు బంతులకు 7 రన్స్ చేసిన ఫ్రేజర్.. మూడో ఓవర్ నుంచి శివాలెత్తాడు. ముందుగా బౌల్ట్ ఓవర్‌లో 6,4,4తో 15 రన్స్ అందించిన ఫ్రేజర్.. నాలుగో ఓవర్‌లో మరింత చెలరేగాడు. అవేశ్ వేసిన ఈ ఓవర్‌లో వరుసగా 4,4,4,6,4,6తో 28 రన్స్ రాబట్టిన అతడు... 19 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఐదో ఓవర్ రెండో బంతికి అశ్విన్ అతడిని అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 26 బంతుల్లో 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వెంటనే హోప్ (1) రనౌటవడంతో పవర్ ప్లేలో ఢిల్లీ 78/2తో నిలిచింది. ఆ తర్వాత మరో ఓపెనర్ అభిషేక్ బ్యాట్ ఝుళిపించడంతో రన్‌రేట్ తగ్గలేదు. అతను 11వ ఓవర్‌లో 6,4తో 28బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అలాగే అక్షర్(15)తో కలిసి మూడో వికెట్‌కు 42 రన్స్ జోడించాడు. ఈ దశలో అశ్విన్ తన వరుస ఓవర్లలో అక్షర్, అభిషేక్ వికెట్లు తీశాడు. ఇక పంత్ (15)ను 14వ ఓవర్‌లో చాహల్ దెబ్బతీశాడు. దీనికి తోడు 13-17 ఓవర్ల మధ్య 26 రన్సే రావడంతో స్కోరు 200 కష్టమే అనిపించింది. కానీ 18వ ఓవర్‌లో స్టబ్స్ 4,4,4,6 బాదడంతో 21 రన్స్ సమకూరాయి. 19వ ఓవర్‌లో నయీబ్ (19) అవుటవడంతో ఆరో వికెట్‌కు 45 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత రసిక్ (9) రెండు ఫోర్లతో స్కోరు 200 దాటింది. ఇక ఆఖరి ఓవర్‌లోనూ స్టబ్స్ చెలరేగి రెండు సిక్సర్లతో 18 రన్స్ రాబట్టినా సందీప్‌కు చిక్కాడు.

విమానం దారి మళ్లింపు..

కేకేఆర్ ఆటగాళ్ల తిప్పలు



న్యూఢిల్లీ: ప్రతికూల వాతావరణం కారణంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఆటగాళ్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కోల్‌కతాలో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో వారు ప్రయాణిస్తున్న చార్టర్డ్ ఫ్లయిట్‌ను రెండుసార్లు దారి మళ్లించాల్సి వచ్చింది. ఆదివారం లఖ్‌నవూలో జరిగిన మ్యాచ్ తర్వాత కేకేఆర్ జట్టు సోమవారం సాయంత్రం కోల్‌కతా బయల్దేరింది. అయితే, ప్రతికూల వాతావరణం వల్ల విమానాన్ని తొలుత గువాహటికి మళ్లించినట్టు కేకేఆర్ ఫ్రాంచైజీ ఎక్స్‌లో తెలిపింది. ఆ తర్వాత క్లియరెన్స్ రావడంతో రాత్రి 9.43 నిమిషాలకు కోల్‌కతా బయల్దేరిన విమానాన్ని భారీ వర్షం కారణంగా వారణాశికి మళ్లించారు. రాత్రికి అక్కడే బస చేసిన శ్రేయాస్ అయ్యర్ సేన.. కాశీ విశ్వనాథుడిని సందర్శించుకొన్న అనంతరం మంగళవారం క్షేమంగా కోల్‌కతా చేరుకొంది.

టీ20 సిరీస్ బంగ్లాదే

చట్టోగ్రామ్: జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌ను ఇంకా రెండు మ్యాచ్‌లుండగానే ఆతిథ్య బంగ్లాదేశ్ దక్కించుకుంది. మంగళవారం జరిగిన మూడో టీ20లో 9 పరుగులతో బంగ్లా నెగ్గింది. మొదట 20 ఓవర్లలో 165/5 స్కోరు చేసింది. తౌహిద్ హృదయ్ (57), జాకెర్ అలీ (44) సత్తా చాటారు. ఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లలో 156/9 స్కోరుకే పరిమితమైంది. ఫజర్ (34 నాటౌట్), మరుమని (31) రాణించారు.

పికిల్‌బాల్‌లో పతకాల పంట

న్యూఢిల్లీ: ఆసియా ఓపెన్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు పతకాల పంట పండించారు. వియత్నాంలో మంగళవారం జరిగిన ఈ పోటీల్లో మూడు స్వర్ణాలు, రెండు కాంస్యాలు దక్కించుకున్నారు.

నన్నెందుకు బ్లాక్ చేశారో..?



వార్నర్

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్ డేవిడ్ వార్నర్. అయితే, ఆ తర్వాత ఫ్రాంచైజీతో అతడి సంబంధాలు బెడిసికొట్టాయి. ఈ క్రమంలో 2021లో సారథ్య బాధ్యతల నుంచి వార్నర్‌ను తప్పించిన ఫ్రాంచైజీ.. క్రమంగా అతడిని జట్టుకు కూడా దూరం చేసింది. ప్రస్తుతం వార్నర్ ఢిల్లీకి ఆడుతున్నాడు. అయితే, సన్‌రైజర్స్ యాజమాన్యం సోషల్ మీడియాలో తనను బ్లాక్ చేయడం తనను ఎంతో బాధించిందని ఓ యూట్యూబ్ చానెల్‌లో అశ్విన్‌తో జరిగిన చిట్‌చాట్‌లో వార్నర్ వాపోయాడు. అలా ఎందుకు చేశారో తనకు అర్థం కాలేదన్నాడు. కానీ, జట్టు అభిమానులు మాత్రం సోషల్ మీడియా ద్వారా తనతో ఇప్పటికీ మాట్లాడుతూనే ఉండడం సంతోషంగా ఉందని వార్నర్ చెప్పాడు.

సెల్ఫీ అడిగితే కొట్టబోయాడు

అభిమానిపై షకీబల్ దురుసు ప్రవర్తన



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబల్ మరోసారి వివాదాస్పద రీతిలో వార్తల్లో నిలిచాడు. సెల్ఫీ కావాలంటూ వచ్చిన ఓ అభిమానిని దాదాపుగా కొట్టినంత పని చేశాడు. ఈ వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది. ఢాకా ప్రీమియర్ లీగ్ మ్యాచ్ సందర్భంగా ఓ అభిమాని షకీబల్ వద్దకు వచ్చి సెల్ఫీ తీసుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో షకీబ్ అతడి మెడను పట్టుకొని పక్కకు నెట్టడమే కాకుండా.. చేయి కూడా ఎత్తాడు. షకీబల్ దురుసు ప్రవర్తనపై అభిమానులు సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు.

బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,307 కోట్లు

ఆదుకున్న అమెరికా, ఐరోపా మార్కెట్లు.. ఒక్కో షేరుపై రూ.40 తుది డివిడెండ్



హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.1307 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.959 కోట్లతో పోలిస్తే లాభం 36 శాతం పెరిగినా డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే మాత్రం 5 శాతం తగ్గింది. అలాగే క్యూ4లో కంపెనీ ఆదాయం కూడా 12 శాతం వృద్ధితో రూ.6,297 కోట్ల నుంచి రూ.7,083 కోట్లకు చేరింది. కాని డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే రెండు శాతం తగ్గింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా లాభం 24 శాతం వృద్ధితో రూ.4,507 కోట్ల నుంచి రూ.5,568 కోట్లకు, ఆదాయం రూ.24,588 కోట్ల నుంచి రూ.27,916 కోట్లకు చేరాయి.

డివిడెండు: 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుపై రూ.40 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని మంగళవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. 'గత ఆర్థిక సంవత్సరం మేమ మంచి పనితీరు కనబరిచాం. మాకు ఇది మర్చిపోలేని చారిత్రక సంవత్సరం ఇది. వచ్చే పదేళ్లలోనూ మేము సరికొత్త ఔషధాల ద్వారా రోగులకు సేవ చేస్తాం' అని కంపెనీ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ విలేకరులతో చెప్పారు.

ఆదుకున్న ఉత్తర అమెరికా : 2023-24 ఆర్థిక సంవత్సరంలో డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ దేశీయ ఆదాయం ఐదు శాతం తగ్గి రూ.4,640 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో ఉత్తర అమెరికా మార్కెట్ ఆదాయం 29 శాతం పెరిగి రూ.12,990 కోట్లకు చేరి కంపెనీని ఆదుకుంది. యూరోపియన్ దేశాల ఆదాయం కూడా ఐదు శాతం పెరిగింది. కొత్త ఔషధాల విడుదలతో వర్ధమాన దేశాల నుంచి లభించే ఆదాయం తొమ్మిది శాతం పెరగడం కంపెనీకి కలిసొచ్చింది. 'గత ఆర్థిక సంవత్సరం మా ఆదాయం, లాభాల పెరుగుదలకు అమెరికా మార్కెట్ బాగా దోహదం చేసింది. లైసెన్సింగ్, సహకారం వంటి చర్యల ద్వారా భవిష్యత్ వృద్ధికీ చర్యలు తీసుకున్నాం' అని ప్రసాద్ చెప్పారు.

కొత్త ఔషధాలు: గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కంపెనీ 21 కొత్త ఔషధాలను మార్కెట్‌లో విడుదల చేసింది. క్యూ4లో ఉత్తర అమెరికా మార్కెట్‌లో ఐదు ఔషధాలు విడుదల చేస్తే అందులో నాలుగు ఔషధాలను అమెరికా మార్కెట్‌లో విడుదల చేసింది. క్యూ4లో అమెరికా ఎఫ్‌డీఏ వద్ద తొమ్మిది అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్లు (ఆండాస్) ఫైల్ చేసింది. దీంతో గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి డాక్టర్ రెడ్డీస్ అమెరికా ఎఫ్‌డీఏ వద్ద 17 ఆండాస్ ఫైల్ చేసినట్టయింది. ఈ ఏడాది మార్చి నాటికి కంపెనీ ఎఫ్‌డీఏ వద్ద ఫైల్ చేసి అనుమతుల కోసం ఎదురు చూస్తున్న జనరిక్ ఔషధాల సంఖ్య 86కి చేరింది. ఇందులో 81 ఆండాస్ కాగా, ఐదు మాత్రం న్యూ డ్రగ్ అప్లికేషన్లు (ఎన్‌డీఏలు).

కొత్త సీఎఫ్‌ఓగా ఎంవీ నరసింహం

ఎంవీ నరసింహంను కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా నియమించేందుకు డాక్టర్ రెడ్డీస్ బోర్డు ఆమోద ముద్ర వేసింది. సీఎఫ్‌ఓగా రిటైర్ అవుతున్న పరాగ్ అగర్వాల్ స్థానంలో నరసింహం ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. తెలుగు వారైన నరసింహం ఇప్పటికే డాక్టర్ రెడ్డీస్ డిప్యూటీ సీఎఫ్‌ఓగా పని చేస్తున్నారు. "క్యూ4లో కంపెనీ ఆదాయ, లాభాల వృద్ధికి వ్యూహాత్మక సహకారాలు కీలకంగా పని చేశాయి. ఈ వృద్ధిరేటు కొనసాగించేందుకు భవిష్యత్‌లోనూ మేము కన్సూమర్ హెల్త్, డిజిటల్ థెరప్యూటిక్స్, సరికొత్త ఔషధాలపై దృష్టి పెడతాం" అని అగర్వాల్ చెప్పారు.

గ్లాండ్ ఫార్మా ఔషధానికి ఎఫ్‌డీఏ ఆమోదం

న్యూఢిల్లీ: అమియోట్రోఫిక్ లాటరల్ స్లెరోసిస్ (కండరాల కదలికలకు సహాయపడే నరాలు క్రమంగా చచ్చుబడిపోవడం) వ్యాధి చికిత్సలో ఉపయోగించే ఎడరవోన్ ఇంజెక్షన్‌కు అమెరికన్ ఎఫ్‌డీఏ అనుమతి లభించినట్టు గ్లాండ్ ఫార్మా ప్రకటించింది. 30ఎంజీ/100 ఎంఎల్, 60ఎంజీ/100 ఎంఎల్ పరిమాణంలో ఈ ఇంజెక్షన్‌ను మార్కెటింగ్ చేయనున్నట్టు పేర్కొంది. వర్తమాన ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఔషధాన్ని తమ మార్కెటింగ్ భాగస్వామి ద్వారా ప్రవేశపెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ ఏడాది జనవరితో ముగిసిన ఏడాది కాలంలో ఈ ఔషధం అమ్మకాలు 1.9 కోట్ల డాలర్ల మేరకున్నాయి.

గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రతిపాదనకు సీసీఐ ఆమోదం

సిక్కిం ఊర్జా (గతంలో తీస్తా ఊర్జా లిమిటెడ్) కంపెనీలో అదనపు వాటాల కొనుగోలుకు గ్రీన్‌కో ఎనర్జీకి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఉత్తర సిక్కింలో 1200 మెగావాట్ల హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు అమలు కోసం ఏర్పడిన ప్రత్యేక సంస్థ సిక్కిం ఊర్జా లిమిటెడ్.

మార్కెట్లో పోర్ష్ పనామెరా కారు



లగ్జరీ కార్ల కంపెనీ పోర్ష్ పనామెరా మూడో తరం కారును మార్కెట్లోకి తెచ్చింది. అత్యాధునిక టెక్నాలజీ, ఆధునిక వసతులతో మరింత డిజిటల్‌గా, మరింత ఆకర్షణీయమైన ఇంటీరియర్లతో ఈ కారును తయారుచేశారు. దీనికి అమర్చిన 2.9 లీటర్ల టర్బో ఇంజన్ 5.1 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. దీని ప్రారంభ ధర రూ.1,69,62,000.

పట్టణాలను మించిన గ్రామీణ వినియోగం

ఐదు త్రైమాసికాల్లో ఇదే తొలిసారి: నీల్సన్‌ఐక్యూ

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికానికి దేశీయ ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమ విక్రయాల పరిమాణంలో 6.5 శాతం వృద్ధి నమోదైందని నీల్సన్‌ఐక్యూ తాజా నివేదిక వెల్లడించింది. విక్రయాల విలువపరంగా వృద్ధి 6.6 శాతంగా ఉంది. అంతేకాదు, గడిచిన ఐదు త్రైమాసికాల్లో తొలిసారిగా గ్రామీణ భారత వినియోగం పట్టణ మార్కెట్‌ను మించిపోయిందని ఆ నివేదికలో తెలిపారు. మార్చి త్రైమాసిక వినియోగ వృద్ధికి ఆహారంతోపాటు ఆహారేతర విభాగాలూ దోహదపడ్డాయని, ఆహారోత్పత్తులతో పోలిస్తే ఆహారేతర విభాగ వినియోగంలో దాదాపు రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొంది. సమీక్షా కాలానికి హోమ్‌కేర్, పర్సనల్ కేర్ విభాగాల పనితీరు ఆహారోత్పత్తుల విభాగాన్ని వించిపోయిందని నీల్సన్‌ఐక్యూ కస్టమర్ సక్సెస్ ఇండియా హెడ్ రూసెవెల్ట్ డిసౌజా తెలిపారు. అంతేకాదు, పట్టణ మార్కెట్, ఆధునిక ఉత్పత్తుల వినియోగం మందగించగా.. గ్రామీణ మార్కెట్, సంప్రదాయ ఉత్పత్తుల వినియోగం పెరిగిందన్నారు.

వినియోగ ట్రెండ్‌లో స్పష్టమైన విభజన: యూబీఎస్ భారత వినియోగ ట్రెండ్‌లో స్పష్టమైన విభజన కన్పిస్తున్నదని స్విస్ బ్రోకరేజ్ కంపెనీ యూబీఎస్ అంటోంది. దేశంలో ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయనడానికి సంకేతమైన 'కే'(ఆంగ్ల అక్షరం) ఆకార వృద్ధి మున్ముందు కొనసాగనుందని తాజా నివేదికలో అభిప్రాయపడింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,380 ▲	66,350 ▲	88,500 ▲
ముంబై	71,670 ▼	65,650 ▼	81,680 ▼

నేటి నుంచి ఆశాపురి గోల్డ్ రైట్స్ ఇష్యూ

బంగారు ఆభరణాల తయారీదారు, హోల్‌సేల్ వ్యాపార సంస్థ ఆశాపురి గోల్డ్ ఆర్నమెంట్ లిమిటెడ్ రూ.48.75 కోట్ల రైట్స్ ఇష్యూ బుధవారం ప్రారంభమై 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూపాయి ముఖ విలువ కలిగిన 8,33,28,666 షేర్లను ఒక్కొక్కటీ రూ.5.85 చొప్పున జారీ చేయనుంది. ఈనెల 3న బీఎస్‌ఈలో కంపెనీ షేరు ముగింపు ధరతో పోలిస్తే 57.45 డిస్కౌంట్‌తో ఈ షేర్లను జారీ చేయనుంది.

గ్రీన్‌సెల్ మొబిలిటీకి రూ.307 కోట్ల నిధులు

ఉత్తరప్రదేశ్‌లోని 8 నగరాలకు ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా ప్రాజెక్ట్ కోసం జపాన్‌కు చెందిన సుమిటొమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) నుంచి రూ.307 కోట్ల హరిత రుణం సమీకరించినట్లు గ్రీన్‌సెల్ మొబిలిటీ మంగళవారం వెల్లడించింది. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్‌లో ఈ-మొబిలిటీ విభాగం ప్రాజెక్టుకు ఎస్ఎంబీసీ ఫైనాన్స్ సమకూర్చడం ఇదే తొలిసారి అని గ్రీన్‌సెల్ తన ప్రకటనలో పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	465
వరంగల్	487	గోదావరి	465
చిత్తూరు	563	విశాఖపట్నం	475
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	148
వరంగల్	140	విజయవాడ	148
కరీంనగర్	140	గుంటూరు	148
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	148
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	140		

రూ.5 లక్షల కోట్లు ఆవిరి

383 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

- 22,300 స్థాయికి జారుకున్న నిఫ్టీ
- స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లలో పోటెత్తిన అమ్మకాలు



ముంబై: మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం నష్టాలు చవిచూశాయి. ఒకదశలో 636.28 పాయింట్లు పతనమై 73,259.26 వద్దకు జారుకున్న సెన్సెక్స్.. చివరికి నష్టాన్ని 383.69 పాయింట్లకు పరిమితం చేసుకుని 73,511.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.20 పాయింట్లు కోల్పోయి 22,302.50 వద్ద స్థిరపడింది. చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపుతున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 నష్టపోగా.. పవర్‌గ్రిడ్ షేరు 3.80 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. అమ్మకాల హోరులో బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.4.96 లక్షల కోట్లు తగ్గి రూ.398.44 లక్షల కోట్లకు పడిపోయింది.

ఇండిజీన్ ఐపీఓకు 7.34 రెట్ల బిడ్లు : హెల్త్‌కేర్ టెక్నాలజీ కంపెనీ ఇండిజీన్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) రెండో రోజు ముగిసేసరికి, ఇష్యూ సైజుకు 7.34 రెట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు లభించాయి. రూ.1,841.75 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వచ్చిన కంపెనీ.. ఇష్యూ ధరల శ్రేణిని రూ.430-452గా నిర్ణయించింది.

- ప్రీమియర్ రోడ్‌లైన్స్ ఐపీఓ ఈనెల 10న ప్రారంభమై 14న ముగియనుంది. ఇష్యూ ధర శ్రేణిని కంపెనీ రూ.63-67గా నిర్ణయించింది. తద్వారా రూ.40 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- ప్లాంట్ బేస్డ్ స్పెషాలిటీ ఉత్పత్తుల తయారీ సంస్థ సంస్థార్ ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ 4 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 80 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.

ఎన్ఎస్ఈ ట్రేడింగ్ సమయం పెంపునకు సెబీ నో

ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్ ట్రేడింగ్ సమయాన్ని పొడిగించాలన్న ఎన్ఎస్ఈ ప్రతిపాదనను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తిరస్కరించింది. స్టాక్ బ్రోకర్ల నుంచి తగినంత ఫీడ్‌బ్యాక్ లభించని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్ ట్రేడింగ్ ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.30 గంటలకు ముగుస్తుంది. ఆ తర్వాత మళ్లీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రేడింగ్‌ను నిర్వహించేందుకు ఎన్ఎస్ఈ సెబీ అనుమతి కోరింది.

18న ప్రత్యేక ట్రేడింగ్: ఎన్ఎస్ఈ

ఈనెల 18వ తేదీన (శనివారం) ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ప్రత్యేక లైవ్ ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఈ ప్రకటించింది. ఆకస్మిక విపత్తులకు సంసిద్ధతను పరీక్షించేందుకు ఈ ట్రేడింగ్‌ను నిర్వహించనుంది. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను రెండు సెగ్మెంట్లుగా విభజించనున్నారు. తొలుత సాధారణ ట్రేడింగ్ ఉదయం 9.15 గంటల నుంచి పదింటి వరకు జరగనుంది. ఆ తర్వాత 11.45 గంటల నుంచి 12.40 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్ నుంచి ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఈ తెలిపింది. ఈ ఏడాదిలో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ తరహా ట్రేడింగ్ నిర్వహించడం ఇది రెండోసారి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



'రైతుభరోసా'కు ఎన్నికల సంఘం బ్రేక్!

కానీ.. అప్పటికే దాదాపుగా పూర్తయిన నగదు బదిలీ

రైతుభరోసా నిధులు అందాల్సింది 2.86%మందికే

వీరంతా ఎక్కువ మొత్తంలో భూమిని కలిగి ఉన్నవారు 9

ఈ రైతులకు 14 నుంచి నగదు బదిలీ చేసే చాన్స్

బుధవారం | 8-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 22 | హైదరాబాద్ సిటీ*

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 8.51 తదుపరి పాడ్యమి; నక్షత్రం: భరణి మ. 1.33 తదుపరి కృత్తిక వర్జ్యం: రా. 12.44 -2.13; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.37; అమృతఘడియలు: ఉ. 9.08-10.36; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.33

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దేశ భద్రతకే ముప్పు తెచ్చారు



ఫోన్ ట్యాపింగ్ డేటాతోపాటు కౌంటర్ ఇంటెలిజెన్స్ సమాచారమూ ధ్వంసం

ఉగ్రవాదులు, మావోయిస్టులకు సంబంధించిన సమాచారం ఇప్పుడు లేదు

దీనిపై విచారణ చేయాల్సిన కేంద్ర హోం శాఖ కూడా పట్టించుకోలేదు

రిటైర్డ్ అధికారులను కేసీఆర్ నియమించారు.. సంబంధం లేదంటే కుదరదు

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం శూన్యం.. ఆ పార్టీకి సీట్లూ రావు

పార్టీ తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని గుర్తించే కేసీఆర్ బస్సు యాత్ర

కేసీఆర్ టికెట్లు ఇచ్చిన తర్వాత.. ఆరుగురు అభ్యర్థులు నన్ను కలిశారు

కేసీఆర్ పదేళ్లలో సాధించని వాటిని నేను వంద రోజుల పాలనలో సాధించా

రాజకీయ పోస్టు పెడితే కేంద్ర హోం శాఖ ఫిర్యాదు చేయడం ఏమిటి!?

ఎవరో పోస్టు పెడితే.. ముఖ్యమంత్రికి నోటీసులు ఇవ్వడం ఏమిటి!?

ఇది తెలంగాణ సార్వభౌమాధికారంపై దాడే.. కేసీఆర్ మాట్లాడరేం!?

ఈసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అనుకోవట్లేదు

ఈ ఫైనల్స్‌లోనూ మేమే విజయం సాధిస్తాం.. చాంపియన్లుగా నిలుస్తాం

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ ఆర్కే నిర్వహించిన బిగ్ డిబేట్‌లో సీఎం రేవంత్



హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మర్నాడు ఎస్ఐబీలోని అధికారులు అక్కడి సర్వర్లు, కంప్యూటర్లు, హార్డ్ డిస్కులను రంపంతో కట్ చేశారు. వాటిలో ఫోన్ ట్యాపింగ్ సమాచారంతోపాటు 40 ఏళ్లుగా కౌంటర్ ఇంటెలిజెన్స్ కోసం సేకరించిన సమాచారం కూడా ఉంది. అంటే, ఉగ్రవాదులు, మావోయిస్టులు, అసాంఘిక శక్తులకు సంబంధించిన సమాచారాన్ని కూడా ధ్వంసం చేసేశారు. ఉగ్రవాదులు, మావోయిస్టుల కదలికలకు సంబంధించిన వివరాలను మూసీలో పడేశారు. ఐఎస్ఐ కార్యకలాపాలు, ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి ఏళ్ల తరబడి రూపొందించిన సమాచారమంతా ఇప్పుడు లేదు. తద్వారా, దేశ భద్రతకే ముప్పు తెచ్చారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇంత తీవ్రమైన అంశంపై విచారణ చేయాల్సిన కేంద్ర హోం శాఖ పట్టించుకోకుండా వదిలేసిందని తప్పుబట్టారు. రాజకీయ ఆరోపణలపై కేసులు కట్టి అరెస్టు చేస్తామంటూ ఢిల్లీ పోలీసులను తెలంగాణకు

మిగతా 11వ పేజీలో...

కేసీఆర్ మీద ప్రజలకు ఇంకా కోపం తగ్గలేదు. ప్రజల్లో కేసీఆర్ పట్ల సానుభూతి కనిపించడం లేదు. ఆయన కూడా తనకు శాస్తి జరిగింది అనుకోవడం లేదు. ఇంకా ఓటమిని ఆమోదించడం లేదు. బీఆర్ఎస్ ఓటమిని ప్రజలు చేసిన తప్పుగా మాట్లాడుతున్నారు. టీవీల్లో కూర్చుని.. తెలంగాణ ప్రజలు తప్పు చేశారని నేరుగా అంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న వాళ్లకు ఉన్న జ్ఞానం తెలంగాణ వాళ్లకు లేదని అంటున్నారు. ఆంధ్రా వాళ్లు మంచోళ్లు.. మాకు ఓటేశారు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఏపీ సీఎం జగన్ రిటర్న్ గిఫ్ట్ కింద తనను గెలిపిస్తాడని భావించారు. ఇప్పటికీ ఆయనకు బుద్ధి రాలేదు. ఈ ఎన్నికల్లో డొక్కలో వేసి గుద్దితే కానీ చక్కగ కాదని ప్రజలు భావిస్తున్నారు.

- సీఎం రేవంత్‌రెడ్డి

అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ జమ చేసిన దానిని అక్కడా ఇక్కడా దాచుకున్నాడు. ఇప్పుడు వాళ్లు పలుకుత లేరు. రేవంత్ ఇవ్వొద్దన్నాడంటూ దుర్మార్గులు నా పేరు చెబుతున్నారు. వాళ్లు ఎవరూ కూడా కేసీఆర్‌కు పైసా వాపస్ ఇచ్చేలా లేరు. రాజుల సొమ్ము రాళ్ల పాలు అయినట్లే. అత్తారింటికి దారేది సినిమాలో బ్రహ్మానందం తరహాలో కేసీఆర్‌దీ అదే పరిస్థితి. చింతమడకలో మిగిలిందే మిగులుతుంది.

గట్టిగా పనిచేయండి.. నిర్లక్ష్యం వద్దు

కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం

తెలంగాణపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి

పనితీరును బట్టే పదవులు దక్కుతాయి 9

ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో మెజారిటీ పెరగాలి

పార్టీ నేతలకు కేసీ వేణుగోపాల్ దిశానిర్దేశం

జూమ్ మీటింగ్‌కు పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా

ఇన్‌చార్జులు, ఎంపీ అభ్యర్థులపై కేసీ ఆగ్రహం

సికింద్రాబాద్‌లో పర్యటించడం లేదంటూ మంత్రి కోమటిరెడ్డిపైనా అసహనం..!

జోరువాన.. జామ్‌జాటం!

హైదరాబాద్‌లో 2 గంటల పాటు కుండపోత

రోడ్లపై మోకాలిలోతు నీళ్లు.. ట్రాఫిక్ జామ్ 12

3-4 గంటలు నరకం చూసిన వాహనదారులు

వణికిన మెట్రో.. అరగంటపాటు నిలిచిన రైళ్లు

విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం

మియాపూర్‌లో 13.3, కూకట్‌పల్లిలో 11.2 సెం.మీ

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం

తడిసిన ధాన్యం.. రాలిన మామిడి.. రైతుకు గుండెకోత

వడదెబ్బకు ఐదుగురు, పిడుగుపాటుకు ఒకరు..

గోడకూలి ఇద్దరు.. విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ప్రచారంపై ఎఫెక్ట్.. కరీంనగర్‌లో రద్దయిన సీఎం సభ

కోదాడలో ఏడే ఏడు నిమిషాల్లో ముగిసిన బీజేపీ సభ

వర్షాలపై సీఎం రేవంత్ సమీక్ష... నేడు, రేపు వర్షాలు





హైదరాబాద్ అమీర్‌పేటలో స్తంభించిన ట్రాఫిక్; చెరువును తలపిస్తున్న రోడ్డు

అసమర్థులు రాజ్యమేలుతున్నారు

దేశం, రాష్ట్రంలో పాలకులకు అభివృద్ధి చేతకావడం లేదు

మోదీ 150 హామీలు ఇచ్చి.. ఏ ఒక్కటీ నెరవేర్చలేదు 9

అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠను మంటగలిపారు

మోదీ గెలిస్తే పెట్రోధరలు రూ.400కు చేరుతాయి

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ రద్దు చేస్తోంది

రేవంత్‌పై ప్రజల్లో వ్యతిరేకత.. అందుకే దేవుళ్లపై ఒట్లు

5 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం లూటీలకు పాల్పడుతోంది

కామారెడ్డి, మెదక్ కార్నర్‌మీటింగ్‌లలో కేసీఆర్





బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ వాసులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

తెలంగాణలో 10 లక్షల కోట్ల అభివృద్ధి

రేవంత్‌కు ఇది గాడిద గుడ్డులా కనిపిస్తోంది

స్థాయిని మరచి, దిగజారి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

ఏమీ దొరక్క.. ఏదో ఒకటి ప్రచారం చేస్తున్నారు 10

భారత కీర్తి ప్రతిష్ఠలను తార స్థాయికి తీసుకెళ్లిన ఘనత మోదీదే

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ప్రచారంలో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆయన భార్య కావ్య

రాజకీయ లబ్ధి కోసం మోదీ విద్వేషాలు: సోనియా

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాజకీయ లబ్ధి కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నారని సోనియాగాంధీ ఆరోపించారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవడమే ప్రధాని మోదీ, బీజేపీ లక్ష్యమని విమర్శించారు. మంగళవారం ఆమె ఓ వీడియో విడుదల చేశారు. మోదీ, బీజేపీ విధానాల వల్ల దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, వెనుకబడినవర్గాలు, మైనారిటీలు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని సోనియా ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు అండగా నిలిచేలా తమ పార్టీ మేనిఫెస్టో రూపొందించామని వివరించారు. అసత్యాలు, విద్వేషాన్ని తిరస్కరించాలని, దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రజలకు సోనియా పిలుపునిచ్చారు.

గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్

» మోదీ సీఎంగా ఉన్నప్పుడే అమలు

» 2022లో ఓ ఇంటర్వ్యూలో ప్రధాని స్వయంగా వెల్లడి

» న్యూస్ వెబ్‌సైట్ 'వైర్' కథనం

న్యూఢిల్లీ, మే 7: కాంగ్రెస్‌గానీ, ఇండియా కూటమిగానీ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను మహిళల మెడలో మంగళసూత్రాలతో సహా లాక్కొని ముస్లింలకు పంచుతారని, బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తగ్గించి వాటిని ముస్లింలకు ఇస్తారని ప్రధాని మోదీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ముస్లింలకు ఎంతమాత్రం రిజర్వేషన్లు ఇవ్వటానికి వీల్లేదని, తాను బతికుండగా ఆ పనికి అవకాశం ఇవ్వబోనని తేల్చి చెబుతున్నారు. అయితే, ప్రధాని మోదీ చెబుతున్న మాటలకు గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన అమలు చేసిన విధానాలకు పొంతన లేకపోవటం విశేషం. మోదీ గుజరాత్ సీఎంగా ఉండగా ఆ రాష్ట్రంలోని ముస్లింలకు బీసీ కోటాలో రిజర్వేషన్ కల్పించారు. దీని గురించి ఆయనే స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు న్యూస్ వెబ్‌సైట్ 'వైర్' ఒక కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం.. 2022 ఫిబ్రవరి 9వ తేదీన ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ.. గుజరాత్‌లోని ముస్లింలలో 70 వర్గాలు బీసీ జాబితాలో ఉన్నాయని, తాను సీఎంగా ఉన్నప్పుడు వారందరూ బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలను పొందారని పేర్కొన్నారు. అటువంటప్పుడు, కాంగ్రెస్‌ను, ఇండియా కూటమిని ఎలా వేలెత్తి చూపుతారన్న ప్రశ్న ముందుకొస్తోంది. అంతేకాదు, బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమిలో ఉన్న పార్టీలు సైతం ముస్లిం రిజర్వేషన్ల పట్ల సానుకూలంగా ఉన్నాయి. కర్ణాటకలో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లను తొలిసారిగా హెచ్‌డీ దేవెగౌడ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్పించామని జేడీఎస్ చెప్పుకుంటోంది. ఆ పార్టీ ఎన్‌డీఏ ప్రధాన పార్టీలో ఒకటి. ఇక కూటమిలో ఇటీవలే చేరిన మరో ప్రధాన పార్టీ తెలుగుదేశం కూడా.. ఏపీలో ముస్లింలకు బీసీ కోటా కింద 4% రిజర్వేషన్‌ను కొనసాగిస్తామని ప్రకటించింది. ఎ

ముస్లింలందరికీ రిజర్వేషన్లు ఉండాలి

» కానీ, మత ప్రాతిపదికన కాదు: లాలూ



పట్నా, మే 7: ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని తాను స్వాగతిస్తానని బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. అయితే, రిజర్వేషన్లు మత ప్రాతిపదికన ఉండకూడదన్నారు. సామాజిక వెనుకబాటు ఆధారంగా ఇవ్వాలన్నారు. అంతకుముందు లాలూ ప్రసాద్ ముస్లిం రిజర్వేషన్లపై పట్నాలో విలేకరులతో మాట్లాడుతూ.. "ముస్లింలకు రిజర్వేషన్లు ఎందుకు ఉండకూడదు? ఉండాలి.. ముస్లిలందరికీ రిజర్వేషన్లు ఉండాలి" అని వ్యాఖ్యానించారు. దీనిపై తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ప్రధాని మోదీ కూడా ఎన్నికల ప్రచారంలో లాలూ వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ కోటాను తగ్గించి, ఆ రిజర్వేషన్లను ముస్లింలకు ఇస్తారని ఆరోపించారు. దీంతో, లాలూ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు.

ఓట్ జిహాదా.. రామరాజ్యమా?



అహ్మదాబాద్‌లో ఓటు వేయడానికి వెళ్తూ చిన్నారిని ఎత్తుకున్న ప్రధాని మోదీ

ఏది కావాలో మీరే నిర్ణయించుకోండి

» దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడానికి 'ఇండియా' నేతల పోటీ

» ఆర్టికల్ 370ని మళ్లీ తేకూడదని, రామమందిరానికి బాబ్రీ తాళం పడకూడదని లోక్‌సభలో 400కు పైగా సీట్లు అడిగాను: మోదీ

ధార్ (మధ్యప్రదేశ్), మే 7: కాంగ్రెస్ పార్టీ 'ఓట్ జిహాద్'ను ప్రోత్సహిస్తూ, బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ముస్లింలను కోరుతోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ధార్, ఖర్గోన్‌లలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలలో మోదీ ప్రసంగించారు. "భారతదేశం ఈ రోజు ఒక కీలక మలుపు ముంగిట నిలిచింది. దేశంలో ఓట్ జిహాద్ కొనసాగాలా లేక, రామ రాజ్యం కొనసాగాలా అనేది మీరే నిర్ణయించుకోవాలి" అని ప్రజలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. పాక్ ఉగ్రవాదులు భారత్‌కు వ్యతిరేకంగా జిహాద్ పేరుతో బెదిరిస్తుంటే, ఇక్కడ కాంగ్రెస్ మాత్రం మోదీకి వ్యతిరేకంగా ఓట్ జిహాద్‌ను ప్రకటించిందని ఆయన ఆరోపించారు. దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడానికి ప్రస్తుతం విపక్ష ఇండియా కూటమి నేతల మధ్య పోటీ నడుస్తోందని, వారు మన విశ్వాసాలను, దేశ ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు.

400 సీట్లు ఎందుకు వాడామంటే...

కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని కాంగ్రెస్ తిరిగి తీసుకురాకుండా ఉండేందుకు, అయోధ్యలో రామమందిరానికి బాబ్రీ తాళం పడకుండా ఉండేందుకు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 400 సీట్లు గెలుచుకోవాలని తాను కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకుకు లబ్ధి చేకూర్చడానికి గాను వారు ఓబీసీ కోటాను దోచుకోకుండా ఉండటానికి 400 స్థానాలు కావాలని అడిగినట్లు తెలిపారు. దేశంలో ఖాళీగా ఉన్న భూములు, దీవులను కాంగ్రెస్ పార్టీ ఇతర దేశాలకు అప్పగించకుండా, తన ఓటు బ్యాంకులోని కులాలను రాత్రికి రాత్రే ఓబీసీలుగా ప్రకటించకుండా ఉండటానికే 400 సీట్లు అడుగుతున్నానని తెలిపారు. "బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు పార్లమెంట్‌లో ఇప్పటికే 400కుపైగా సీట్లు ఉన్నాయని దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి మేం ఈ నంబరును ఉపయోగించాం" అని మోదీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కోటాను పదేళ్ల కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రతి కుట్రను అడ్డుకొనేందుకు తాను 400 సీట్లు అడుగుతున్నానని మోదీ స్పష్టం చేశారు.

వాళ్ల నోటికి తాళం

దళితులు, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు ఇవ్వాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. ఈ అంశంపై ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ ఇటీవల చేసిన ప్రకటన ఇండియా కూటమి ఉద్దేశాలను ధ్రువీకరించిందని చెప్పారు. "ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తున్న రిజర్వేషన్లను ఎప్పటికీ లాక్కోబోమని, ప్రస్తుతం ఉన్న ఓబీసీ కోటా నుంచి దోపిడీకి పాల్పడి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించబోమని లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరాను. కానీ వారు స్పందించకుండా, తమ నోటికి తాళం వేసుకొని మౌనంగా కూర్చున్నారు" అని మోదీ ఎద్దేవా చేశారు.

అంబేడ్కర్‌కు వెన్నుపోటు పొడిచారు

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ చిన్నచూపు చూస్తోందని, రాజ్యాంగం రూపకల్పనలో ఆయన పాత్ర చాలా తక్కువని, రాజ్యాంగ నిర్మాణంలో పండిట్ నెహ్రూ అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించారని ప్రచారం చేయడం ప్రారంభించిందని మోదీ ఆరోపించారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందన్నారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పరివారం తీవ్రంగా ద్వేషిస్తోందన్నది వాస్తవమని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి వారిని రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంచడమే మత రిజర్వేషన్లను వ్యతిరేకించిన అంబేడ్కర్‌కు అతిపెద్ద నివాళిగా అభివర్ణించారు.

ముస్లింలకు నేను వ్యతిరేకం కాదు

» టైమ్స్‌నౌ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మే 7: తాను ఇస్లాంకు, ముస్లింలకు వ్యతిరేకం కాదని ప్రధాని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హిందువుల ఆస్తులను ముస్లింలకు పంచుతుందంటూ తాను చేసిన వ్యాఖ్యను సమర్థించుకుంటూ.. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఆ విషయం ఉందన్నారు (తమ ఎన్నికల ప్రణాళికలో ఇటువంటి అంశం లేనేలేదని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది). అయితే, ముస్లింలు తెలివైన వారని, కాంగ్రెస్ అబద్ధాలను వారు నమ్మటం లేదని, ఇదే ఇప్పుడు కాంగ్రెస్‌కు సమస్యగా మారిందన్నారు. టైమ్స్‌నౌ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ముస్లిం సమాజం ఆలోచించాలి. దేశం ప్రగతి పథంలో ఉంది. మీ వద్ద ఏమైనా పొరపాట్లు, పరిమితులు ఉన్నాయని భావిస్తే దానికి కారణాలేవిటో గుర్తించాలి' అని మోదీ పేర్కొన్నారు. ముస్లింలు తమ భవిష్యత్తు గురించి, తమ పిల్లల గురించి ఆలోచించుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన మూడో దశ

» 93 లోక్‌సభ స్థానాలకు పోలింగ్

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ మూడో దశ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 93 పార్లమెంటు స్థానాలలో మూడో దశ పోలింగ్ జరిగింది. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఈసీ వెల్లడించింది. రాత్రి ఎనిమిది గంటల వరకు 61.45శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు జరిగిన మూడు దశల ఎన్నికలతో 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 283 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు పూర్తయినట్లు ప్రకటించింది. మూడో దశలో గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అసోం, పశ్చిమబెంగాల్, బిహార్, దాద్రానగర్ హవేలీ, డామన్ దయ్యూ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్‌లోని స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇదే దశలో జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్- రాజౌరీ స్థానానికి పోలింగ్ జరగాల్సి ఉండగా ఈసీ ఆరో దశకు రీషెడ్యూల్ చేసింది. సూరత్ స్థానం ఏకగ్రీవం కావడంతో అక్కడ పోలింగ్ జరగలేదు. మూడో దశలో 1331 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో నిలిచారు. 23 దేశాలకు చెందిన 75 మంది ప్రతినిధులు ఆరు రాష్ట్రాలలోని వివిధ పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. మొత్తం ఏడు దశల్లో 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తదుపరి నాలుగో దశలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని లోక్‌సభ సీట్లు సహా 96 స్థానాలకు 13న పోలింగ్ జరగనుంది. ఏపీ అసెంబ్లీకీ ఈ దశలోనే పోలింగ్ జరగనుంది.

పోలింగ్ శాతాల్లో తేడాలపై డౌట్

» ఇండియా కూటమి నేతలకు ఖర్గే లేఖ

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ మొదటి, రెండో దశ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ శాతాల్లో భారీ వ్యత్యాసాలు ఉండడం ఆ సంస్థ నిష్పక్షపాతతపై అనుమానాలను కలిగిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత భారీ స్థాయిలో పోలింగ్ శాతాల్లో తేడాలు ఉండడం ఇదివరకెన్నడూ చూడలేదని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, భారత రాజ్యాంగం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులుగా ఇండియా కూటమిలోని పార్టీల నాయకులు పోలింగ్ శాతంలో భారీ తేడాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని కోరారు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత గతంలో ఎన్నడూ లేనంతగా క్షీణించిందని పేర్కొంటూ కూటమి పార్టీల నాయకులకు మంగళవారం లేఖ రాశారు.

ప్రజ్వల్‌పై బ్లూకార్నర్ నోటీసు



బెంగళూరు, మే 7(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసింది. 196 దేశాలతో పాటు, ఇంటర్‌పోల్‌కు సమాచారాన్ని ఇచ్చినట్లు తెలిపింది. ప్రజ్వల్ ఏ దేశంలోనైనా, విమానాశ్రయాలు, ఓడరేవుల్లో కనిపించినా సమాచారం ఇవ్వాలని ఇంటర్‌పోల్‌ను కోరామని పేర్కొంది. కాగా, ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యం బాధితురాలి కిడ్నాప్ కేసులో అరెస్టయిన జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణ బెయిల్ పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా పడింది. మరోవైపు ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యం వీడియోలను 2,500 పెన్‌డ్రైవ్‌లలో ఉంచి ఎన్నికల ముందు పంపిణీ చేశారని కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి ఆరోపించారు. మంగళవారం బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ పెన్‌డ్రైవ్‌లను పోలీసు అధికారులే పంపిణీ చేశారని, వారిని బెదిరించి అలా పంపిణీ చేయించారని విమర్శించారు. ఈ కుట్ర వెనుక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఉన్నారని ఆక్షేపించారు. కాగా, ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంపై మోదీ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రజ్వల్ లాంటి వ్యక్తులపై సానుభూతి ఉండదని, ఇలాంటి చర్యలకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఇది శాంతిభద్రతల అంశం అయినందున రాష్ట్రప్రభుత్వమే చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

మైనారిటీలో హరియాణా బీజేపీ ప్రభుత్వం!

ఛండీగఢ్, మే 7: లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హరియాణాలో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకోవడంతో నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం మైనారిటీలో పడింది. ఎమ్మెల్యేలు సోంబీర్ సంగ్వాన్, రణధీర్ గొల్లెన్, ధరంపాల్ గొండెర్‌లు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. "ప్రభుత్వానికి మా మద్దతును ఉపసంహరించుకుంటున్నాం. కాంగ్రెస్‌కు మా మద్దతును తెలుపుతున్నాం. రైతుల సమస్యతో పాటు, ఇతర కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ప్రకటించారు. స్వతంత్ర ఎమ్మెల్యేలు తమ మద్దతు ఉపసంహరించుకోవడంతో నాయబ్‌సింగ్ ప్రభుత్వం మైనారిటీలో పడిందని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని ఉదయ్ భాన్ డిమాండ్ చేశారు. త్వరల్లోనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు.

పది లోక్‌సభ స్థానాల్లో మజ్లిస్ పోటీ

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పది స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు మంగళవారం పార్టీ అధికార ప్రతినిధి ఓ ప్రకటన విడుదల చేశారు. బిహార్‌లో ఐదు, మహారాష్ట్రలో నాలుగు, తెలంగాణలోని హైదరాబాద్‌తో కలిపి మొత్తం పది లోకసభ స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దింపినట్లు పేర్కొన్నారు. దేశంలో మతతత్వ బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు మజ్లిస్ అత్యధిక స్థానాల్లో పోటీ చేయాలని ఆశించినప్పటికీ కొన్ని రాజకీయ పరిస్థితుల కారణంగా పరిమిత స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో సిటింగ్ సీటు ఔరంగాబాద్ నుంచి ఇంతియాజ్ జలీల్, పూణె నుంచి అనిస్ సుంద్కే, ఉస్మానాబాద్ నుంచి సిద్దిఖీ ఇబ్రహీం, ముంబై సెంట్రల్ నుంచి రంజన్ చౌదరి పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక బిహార్‌లో కిషన్‌గంజ్ నుంచి అక్తరుల్ ఇమాన్, హైదరాబాద్ నుంచి మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తున్నారు. అంతే కాకుండా మరో ఐదు లోకసభ స్థానాల నుంచి మజ్లిస్ అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలిపారు.

అల్లుణ్ని తొలగించిన మాయావతి

లఖ్‌నవూ, మే 7: తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి తొలగిస్తున్నట్లు బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత్రి మాయావతి ప్రకటించారు. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్న ఆమె... పార్టీ ప్రయోజనాల దృష్ట్యానే ఈ నిర్ణయాన్ని తీసుకున్నానని, ఆకాశ్‌కు పరిపక్వత వచ్చేంత వరకు వేటు తప్పదని పేర్కొన్నారు. అయితే తన తమ్ముడు ఆనంద్ కుమార్ మాత్రం యథావిధిగా కొనసాగనున్నట్లు తెలిపారు. సరిగ్గా మూడో దశ పోలింగ్ ముగిసిన రోజునే మాజీ ముఖ్యమంత్రి మాయావతి ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకొంది. కాగా, గతంలో... అల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ఆమె తన రాజకీయ వారసుడిగా ప్రకటించడం గమనార్హం.

త్వరలో కేజ్రీవాల్‌కు బెయిల్?



న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చే విషయాన్ని సుప్రీంకోర్టు సానుకూలంగా పరిశీలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే ఆయన ముఖ్యమంత్రిగా ఎలాంటి అధికార విధులూ నిర్వహించరాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. గురువారం (ఈ నెల 9న) కానీ వచ్చే వారం కానీ కేజ్రీవాల్ బెయిల్‌పై మలి విచారణ జరుపుతామని తెలిపింది. మరోవైపు, ఆయన కస్టడీని సీబీఐ, ఈడీ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ నెల 20 వరకు పొడిగించారు. తన బెయిల్ దరఖాస్తును హైకోర్టు తిరస్కరించడంతో కేజ్రీవాల్ సుప్రీంకోర్టు తలుపు తట్టిన విషయం తెలిసిందే. బెయిల్ ఇచ్చినంత మాత్రాన కేసు దర్యాప్తులో ప్రభావం ఉండదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రిపబ్లిక్ టీవీ ఎడిటర్ అర్ణాబ్ గోస్వామికి కూడా ఇలాంటి ఊరట కల్పించామని జస్టిస్ దత్తా చెప్పారు. తాము రాజకీయ నాయకులకు ఎలాంటి మినహాయింపు ఇవ్వడం లేదని, ప్రతి వ్యక్తికీ ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల వల్ల ఆ ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయా లేదా పరిశీలిస్తున్నామని తెలిపింది. తన అరెస్టుకు ఆధారాలు లేవని కేజ్రీవాల్ అంటున్నారని గుర్తుచేసింది. అందుకు తగ్గ సమాచారం తమకు ఇవ్వలేదని, కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా వచ్చిన ప్రకటనలన్నీ తమకు సమర్పించాలని ఈడీని కోరింది. తాము ఇచ్చేది మధ్యంతర బెయిల్ మాత్రమే కనుక ఒకవేళ ఆయన అరెస్టు తప్పని తర్వాత తేలితే సవరించుకుంటామని తెలిపింది.

అంతకాలం ఎందుకు పట్టింది?

'మీరు రూ.100 కోట్ల మేరకు నేరం జరిగిందని తొలుత చెప్పారు. అది రెండు, మూడేళ్లలో రూ.1,100 కోట్లు ఎలా అయింద'ని సుప్రీంకోర్టు ఈడీని ప్రశ్నించింది. 2020 మే 9న తొలి అరెస్టు జరిగినప్పుడు కేజ్రీవాల్ అరెస్టు చేసేందుకు ఇంతకాలం ఎలా పట్టిందని అడిగింది. సెక్షన్ 19 ప్రకారం అరెస్టు చేసేందుకు తగిన ఆధారాలు ఉన్నాయా లేదా అని కూడా తాము చూడాల్సి ఉందని తెలిపింది. కేజ్రీవాల్ గురించి మీరు మొదట ఎప్పుడు తెలుసుకున్నారని కోర్టు అడిగే సరికి 2023 ఫిబ్రవరి 23న కవిత ఆడిటర్ బుచ్చిబాబు ప్రకటనలో కేజ్రీవాల్ పేరు బయటకొచ్చిందని, ఆయన రూ.100 కోట్లు డిమాండ్ చేశారనడానికి ఆధారాలు ఉన్నాయని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. గోవా ఎన్నికల సందర్భంగా కేజ్రీవాల్ బస చేసిన సెవెన్ స్టార్ హోటల్ గ్రాండ్ హయత్ బిల్లును చారియట్ ఎంటర్‌ప్రైజెస్ చెల్లించిందన్నారు. దర్యాప్తు ప్రారంభంలో కేజ్రీవాల్ పాత్ర కనపడలేదని, ఆ తర్వాత బయటపడిందని చెప్పారు.

రాజకీయ నేత అయితే..

కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడం సరైంది కాదని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. రాజకీయ నాయకుడికీ, సామాన్యుడికీ వ్యత్యాసం ఉండరాదన్నారు. దాదాపు ఏడాదిన్నరగా ఈడీ దర్యాప్తు జరిపిన తర్వాతే కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని చెప్పారు. ఆయన రాజకీయ నేత అని, ఎన్నికల పేరుతో విడుదల చేయడం తప్పుడు సంకేతాలు పంపుతుందన్నారు. కేజ్రీవాల్ నేరాలు చేసే వ్యక్తి కాదని, ఆయన విదేశాలకు పారిపోయే అవకాశాలు లేవని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు.

ఇంత మోసం జరిగితే వ్యవస్థలపై నమ్మకం ఉండదు

» పశ్చిమ బెంగాల్‌లో టీచరు పోస్టుల భర్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య



న్యూఢిల్లీ, మే 7: ఉపాధ్యాయుల భర్తీ కుంభకోణంపై సుప్రీంకోర్టు మంగళవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించింది. ఇలాంటి మోసాలు జరిగితే ప్రజలు వ్యవస్థలపై విశ్వాసాన్ని కోల్పోతారని వ్యాఖ్యానించింది. స్కూల్ సర్వీస్ కమిషన్ నియమించిన సుమారు 25వేల టీచరు పోస్టులను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు తీర్పుపై దాఖలైన అప్పీలును సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం చేపట్టింది. జస్టిస్ చంద్రచూడ్ విచారణ ప్రారంభిస్తూ.. తొలి ప్రశ్న కింద 'ఎంపిక ప్రక్రియను సవాలు చేస్తూ కోర్టులో వ్యాజ్యం వేసిన సమయంలోనే అదనంగా సూపర్‌న్యూమరరీ పోస్టులను సృష్టించి, వెయిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులతో ఎందుకు భర్తీ చేశార'ని ప్రశ్నించారు. ఓఎంఆర్ షీట్లు, జవాబు పత్రాల స్కాన్డ్ కాపీలు ఉన్నాయా? ధ్వంసం చేశారా? అని అడిగారు. వాటిని ధ్వంసం చేసినట్టు బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది నీరజ్ సమాధానం ఇచ్చారు. వీటిని భద్రపరచడం ఎస్ఎస్‌సీ బాధ్యత కదా? ఎందుకు పాటించలేదని సీజేఐ మళ్లీ ప్రశ్నించారు. వాటి కాపీలు పేపర్లు దిద్దిన అవుట్ సోర్సింగ్ సంస్థ వద్ద ఉన్నాయని న్యాయవాది జవాబిచ్చారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ.. "ఓఎంఆర్ షీట్ల స్కానింగ్ కోసం వారిని కిరాయికి తీసుకున్నారు. ఇంతకన్నా భద్రత ఉల్లంఘన ఇంకేమైనా ఉంటుందా" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, ఉద్యోగాల భర్తీని రద్దు చేసే అధికారం హైకోర్టుకు లేదని నీరజ్ వాదించారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ.. "ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన మోసం. ఇలా మోసాలు జరిగితే వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు" అని అన్నారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ తదుపరి విచారణను జులై నెలకు వాయిదా వేశారు.

తప్పుడు ప్రకటనలకు సెలబ్రిటీలూ బాధ్యులే

న్యూఢిల్లీ, మే7: తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయమై సుప్రీంకోర్టు కఠిన వైఖరి తీసుకొంది. ప్రజలకు నష్టం జరగకుండా తొలుత ఈ ప్రకటనల్లో పాల్గొనే ప్రముఖులే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని మంగళవారం స్పష్టం చేసింది. సంబంధిత వస్తువు/సేవపై పూర్తి అవగాహన ఉందని, అందుకే దాన్ని సిఫార్సు చేస్తున్నామంటూ స్వీయ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. పతంజలి సంస్థ తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇచ్చిందంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ సూచనలు చేసింది. ఒకవేళ ఆ వస్తువు/సేవ మోసపూరితమని తేలితే సంబంధిత సంస్థతో పాటు, ప్రకటనలో పాల్గొన్న ప్రముఖులు కూడా బాధ్యులవుతారని హెచ్చరించింది. ఈ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించింది.

ఇజ్రాయెల్‌కు భారత్ ఆయుధాలు!

న్యూఢిల్లీ, మే 7: పాలస్తీనియులపై ఊచకోతకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు, స్వదేశీయులపై దమనకాండను అమలు చేస్తున్న మయన్మార్‌లోని సైనిక (జుంటా) ప్రభుత్వానికి భారత్ ఆయుధాలను సరఫరా చేస్తోందని న్యూస్ వెబ్‌సైట్ 'వైర్' వెల్లడించింది. రక్షణశాఖ ఆధ్వర్యంలో పనిచేసే మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్(ఎంఐఎల్) ఇజ్రాయెల్‌కు కొన్నాళ్లుగా ఆయుధాలు సరఫరా చేస్తోందని, తాజాగా ఈ ఏడాది జనవరిలోనూ పంపించిందని తెలిపింది. హైదరాబాద్‌లోని అదానీ-ఎల్బిట్ అనే ప్రైవేటు జాయింట్ వెంచర్ కంపెనీ కూడా ఇజ్రాయెల్‌కు డ్రోన్ల వంటి గగనతల ఆయుధ వ్యవస్థలను సరఫరా చేస్తోందని వైర్ ఇటీవల తెలియజేసింది. కాగా, మయన్మార్‌లోని సైనిక సర్కారుకు కూడా భారత్ ఆయుధాలను పంపుతోందని ఐరాస గతేడాది మే నెలలో వెలువరించిన ఓ నివేదికలో తెలిపిందని వైర్ కథనం పేర్కొంది. జుంటా సర్కారుకు భారత్ ఇప్పటి వరకు రూ.422 కోట్ల ఆయుధాలను విక్రయించినట్లు ఐరాస తెలిపింది.

లోకం తీరు



రూ.666 కోట్ల విలువైన ఆభరణాల కంటైనర్ బోల్తా

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): కేరళ నుంచి తమిళనాడులోని సేలంకు రూ.666 కోట్ల విలువైన 810 కిలోల బంగారు ఆభరణాలతో బయలుదేరిన కంటైనర్ ఈరోడ్డు జిల్లా చిత్తోడ్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో కంటైనర్ డ్రైవర్‌తో పాటు సెక్యూరిటీ గార్డు గాయపడ్డారు. ఓ ఆభరణాల సంస్థకు చెందిన బంగారు నగలను లోడ్ చేసుకున్న కంటైనర్ సోమవారం రాత్రి కేరళ సరిహద్దుల నుంచి సేలంకు బయల్దేరింది. చిత్తోడ్ సమత్తువపురం వద్ద ఓ మలుపు తిరిగే ప్రయత్నంలో బోల్తాపడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని ఆభరణాలు మరో కంటైనర్‌లో తరలించారు.

రష్యా అధ్యక్షుడిగా పుతిన్ ఐదోసారి ప్రమాణం

» కార్యక్రమాన్ని బహిష్కరించిన పశ్చిమ దేశాలు.. ఉక్రెయిన్‌పై యుద్ధమే కారణం



మాస్కో, మే 7: రష్యా అధ్యక్షుడిగా పుతిన్ ఐదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మరో ఆరేళ్లు రష్యా అధ్యక్షుడిగా ఆయన కొనసాగనున్నారు. మార్చిలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ గెలుపొందారు. దీంతో మంగళవారం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఆయన వయసు 71 సంవత్సరాలు. రష్యా అధ్యక్షుడిగా గానీ, ప్రధానమంత్రిగాగానీ 1999వ సంవత్సరం నుంచి పుతిన్ అధికారంలో కొనసాగుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి పాల్పడుతున్న కారణంగా పుతిన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అమెరికా, బ్రిటన్ సహా అనేక పశ్చిమదేశాలు బహిష్కరించాయి. 'పుతిన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మా ప్రతినిధిని ఎవరినీ పంపడం లేదు. రష్యాలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని మేం భావించడం లేదు' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ సోమవారమే స్పష్టం చేశారు. కెనడా, ఐరోపా సమాఖ్యలోని అత్యధిక దేశాలు కూడా పుతిన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించాలని నిర్ణయించాయి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిగ్ డిబేట్ వీడియోల కోసం క్లిక్ చేయండి **Click here**

ఆంధ్రజ్యోతి

కూపన్ నింపండి లక్షలు గెలవండి

ఎవరు గెలిచినా మీదే గెలుపు

రాష్ట్ర స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి / కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి...
మీ అంచనాలను ఈ క్రింది గడిలో తెలియజేయగలరు.

మొత్తం సీట్లు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.

పూర్తి వివరాల కోసం ఈ QR కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్నికలు - 2024



లోక్‌సభ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి **Click here**

ఎన్నికలు - 2024



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు

అసెంబ్లీ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి **Click here**

మేడిగడ్డను పరిశీలించిన జస్టిస్ పీసీ ఘోష్

» బ్యారేజీ నాణ్యతపై క్షుణ్ణంగా అధ్యయనం

భూపాలపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ మంగళవారం సందర్శించారు. దీనిపై ఇప్పటికే హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమైన పీసీ ఘోష్.. మంగళవారం ఆ శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి మధ్యాహ్నం 1.40 గంటలకు బ్యారేజీకి చేరుకున్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య.. బ్యారేజీలో దెబ్బతిన్న 7వ బ్లాకులోని 19, 20, 21 పియర్లను పైభాగం నుంచి ఐదు నిమిషాల పాటు పరిశీలించారు. అక్కడ నుంచి దిగువ భాగానికి వెళ్లి పగుళ్లు, కుంగిన పియర్లను పరిశీలించారు. పియర్ల కుంగుబాటుకు దారితీసిన పరిస్థితులపై ప్రాథమిక సమాచారాన్ని క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణ, ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే.. బ్యారేజీ పియర్లు మొదట ఎప్పుడు దెబ్బతిన్నాయి? ఎప్పుడు గుర్తించారు? అనే విషయాలపై ఆరా తీశారు. బ్యారేజీ పియర్ల నిర్మాణానికి ఎంత సమయం తీసుకున్నారు? నిర్దేశిత సాంకేతిక విధానాలను పాటించారా.. లేదా? నిర్మాణ సమయంలో తీసుకున్న జాగ్రత్తలేంటి? తదితర వివరాలపై కూడా ఆయన ఆరా తీసినట్టు తెలిసింది.


కుంగిపోయిన పియర్‌ను పరిశీలిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

నివేదిక అందాకే పూర్తి స్థాయి విచారణ: ఘోష్

కాళేశ్వరం ప్రాజక్టు వైఫల్యంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చే నివేదిక అధ్యయనం తర్వాత పూర్తిస్థాయి విచారణ ప్రారంభిస్తామని జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన అనంతరం ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు వైఫల్యానికి దారితీసిన పరిస్థితులు ఏమిటని విలేకరులు ప్రశ్నించగా.. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై అధ్యయనం చేశాక సాంకేతిక బృంద సభ్యుల సహకారంతో పూర్తిస్థాయి విచారణకు శ్రీకారం చుడతామన్నారు.

పునరుద్ధరించాల్సింది మీరే..!

బ్యారేజీ పరిశీలన అనంతరం జస్టిస్ పీసీ ఘోష్.. దాన్ని నిర్మించిన ఎల్ అండ్‌టీ ప్రతినిధులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. "మేడిగడ్డ నిర్మాణం మీ కంపెనీ బేబీ లాంటిది. దెబ్బతిన్న పియర్లను సరిచేసి బ్యారేజీని పునరుద్ధరించాల్సిన బాధ్యత మీపైనే ఉంది" అని పేర్కొన్నట్టు తెలిసింది. అలాగే.. బ్యారేజీ వైఫల్యానికి దారితీసిన పరిస్థితులపై త్వరలోనే విచారణ ప్రారంభిస్తామని చెప్పినట్లు సమాచారం. ఈ పర్యటనలో ఆయన వెంట ఈఎన్‌సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్ రెడ్డి, భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే, ఈఈ తిరుపతిరావు, డీఈ సురేశ్ ఉన్నారు.

అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ అధికారుల పోస్టుల పెంపు

» అదనంగా మరో నాలుగు పోస్టులు

హైదరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, టెక్నికల్ అధికారులు, జూనియర్ టెక్నికల్ అధికారుల భర్తీ కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉన్న ఖాళీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, పురపాలకశాఖ, గిరిజన సంక్షేమశాఖ, రోడ్లు భవనాలశాఖ, నీటిపారుదలశాఖలలో 833 పోస్టుల భర్తీకి 2022లో 16/2022 నోటిఫికేషన్ జారీ చేయగా... వాటిని 837కి పెంచారు. ఉద్యోగాల భర్తీలో మహిళలకు సమాంతరంగా రిజర్వేషన్లు అమలు చేయాలని, గత ఫిబ్రవరి 10న మహిళా శిశు సంక్షేమశాఖ, 13న సాధారణ పరిపాలనశాఖ(జీఏడీ) జీవోలు ఇవ్వడంతో ఆ ఉత్తర్వులకు అనుగుణంగా నాలుగు పోస్టులను పెంచారు. పెరిగిన పోస్టుల వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పెట్టామని, కేవలం ఖాళీల్లోనే మార్పులు చోటు చేసుకున్నాయని, ఇతర షరతులు, నిబంధనలు గత నోటిఫికేషన్ ప్రకారం యథాతథంగానే అమలవుతాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ గురుకులాల్లో డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులు

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): టీటీడబ్ల్యుఆర్‌ఈఐ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో మహిళలకు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సిరిసిల్లలో మొదటి సంవత్సరం బీఏ హానర్స్, ఫ్యాషన్ డిజైన్, బీఏ హానర్స్ ఇంటీరియర్ డిజైన్, బీఏ ఫొటోగ్రఫీ, డిజిటల్ ఇమేజింగ్ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. విద్యార్థులు ఈ నెల పదో తేదీ నుంచి దరఖాస్తులను నేరుగా సిరిసిల్లలోని కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 30వ తేదీ వరకు తుది గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. అదే క్రమంలో అశోక్‌నగర్‌లోని ఆర్మ్డ్ ఫోర్సెస్ అకాడమీలో బీఎస్సీ ఎంపీసీ, బీఏ(హెచ్‌ఈపీ) డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఆసక్తి గల పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు.

ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి గానూ నిర్వహించే తెలంగాణ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువును పొడిగించారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 ఆలస్య రుసుముతో ఈ నెల 13వ తేదీ వరకు అవకాశం ఉంటుందని, పరీక్షా కేంద్రం ఎంచుకునేందుకు అభ్యర్థులు సాధ్యమైనంత త్వరగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ కోరారు.

హిడ్మా, చొక్కారావుపై అనుబంధ చార్జ్‌షీట్

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో మావోయిస్టులకు ఆయుధాలను సరఫరా చేస్తున్న కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మంగళవారం అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. నాంపల్లిలోని ఎన్ఐఏ కేసుల ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన అనుబంధ చార్జ్‌షీట్‌లో పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్‌కు చెందిన మాడ్వీ హిడ్మా, బడే చొక్కారావు అలియాస్ దామోదర్ పేర్లను చేర్చారు. గత ఏడాది ఆగస్టులో చర్ల అడవుల్లో భారీగా మావోయిస్టుల డంప్, డ్రోన్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, లైట్ మెషీన్‌గన్(ఎల్ఎంజీ) సీజ్ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో గత ఏడాది డిసెంబరు 1న ఎన్ఐఏ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. మావోయిస్టులు ఆయుధాలను కొనుగోలు చేసేందుకు ఆర్థికసాయం అందించినట్లుగా భావిస్తున్న ఎనిమిది మందిపై అప్పట్లో అభియోగాలు మోపింది. తాజాగా ఈ కేసులో హిడ్మా, చొక్కారావు పాత్ర ఉన్నట్లు గుర్తించింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు టెర్రరిస్టుల హతం

కుల్గాం, మే 7: జమ్మూకశ్మీర్ కుల్గాం జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌లో లష్కర్ గ్రూపుకు సంబంధించిన 'ది రెసిస్టెంట్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' సంస్థకు చెందిన కీలక ఉగ్రవాది బసిత్‌దార్ మృతిచెందాడు. కుల్గాం రెడ్వానీ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికల గురించి సమాచారం అందడంతో భద్రతా బలగాలు సోమవారం అక్కడ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. మంగళవారం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్ చివరకు ఎన్‌కౌంటర్‌కు దారి తీసింది. పలువురు పోలీసుల్ని చంపిన నేరాల్లో నిందితుడిగా ఉన్న బసిత్‌దార్‌పై 18 కేసులున్నాయి. అతనిపై 10 లక్షల రివార్డు కూడా ఉంది. కాగా, పలు అంశాల ఆధారంగా టెర్రరిస్టులను ఎ, ఎ ప్లస్, బీ, సీ కేటగిరిలుగా జమ్మూకశ్మీర్ పోలీసులు విభజించారు. ఆ ప్రకారం బసిత్‌దార్ 'ఎ' కేటగిరికి చెందినవాడు.

కాంగ్రెస్‌కు జమీయత్ ఉలేమా మద్దతు

హైదరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జమీయత్ ఉలేమా పార్టీ మద్దతు ఇచ్చింది. గాంధీభవన్‌లో మంగళవారం ఆ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీముద్దీన్ మీడియాతో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని మార్చేసి రిజర్వేషన్లను ఎత్తేస్తుందని పేర్కొన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో 57 ఎస్సీ ఉపకులాల ఫెడరేషన్ కాంగ్రెస్‌కే మద్దతును ఇస్తోందని ఫెడరేషన్ అధ్యక్షుడు పిల్లుట్ల పశుపతి పేర్కొన్నారు.

వానాకాలంలోపు మరమ్మతు డౌటే!

మేడిగడ్డ బ్యారేజీకి తాత్కాలిక మరమ్మతులు అత్యవసరమన్న జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ

» భవిష్యత్తులో బ్యారేజీ దెబ్బతినదనే గ్యారెంటీ లేదు
» వానాకాలంలోపు రిపేర్లు చేయాలి
» మధ్యంతర నివేదికలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలు



హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు అత్యవసరమని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) పేర్కొంది. బ్యారేజీ మరింత దెబ్బతినకుండా ఉండేందుకు వానాకాలంలోపు మరమ్మతులు చేయాలని సూచించింది. భవిష్యత్తులో బ్యారేజీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలను కొట్టిపారేయలేమని తెలిపింది. ప్రస్తుతం బ్యారేజీకి చేసే మరమ్మతులు యథాతథ స్థితిని కొనసాగించడానికి మాత్రమే ఉపకరిస్తాయంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ), గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) టెస్టులతో పాటు బ్యారేజీ స్థితిగతులు, నిర్మాణ ఏజెన్సీలు, అధికారుల నివేదికలు, డిజైన్లు, డ్రాయింగ్‌లు పరిశీలించి, నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులందరినీ సంప్రదించిన తర్వాత ఎన్‌డీఎస్‌ఏ.. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి మధ్యంతర నివేదిక ఇచ్చింది. వానాకాలంలోపు బ్యారేజీల వైఫల్యంపై జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ (జీపీఐ), జియో టెక్నికల్ పరీక్షల అనంతరం.. డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేసి, మరమ్మతులకు ఉపక్రమించాలని నిర్దేశించింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ మధ్యంతర నివేదికను పంపించారు. అందులోని వివరాలిలా ఉన్నాయి. 2019 జూన్‌లో మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభించగా తొలి వరదల అనంతరం 2019 నవంబరులో గేట్లు మూసివేశారు. బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు (సీసీ బ్లాకులు), అప్రాన్ దెబ్బతిన్నట్లు గుర్తించారు. కానీ, మరమ్మతులు చేయకుండా బ్యారేజీని వినియోగించడంతో 2023 అక్టోబరు 21న పిల్లర్లు కుంగిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్ నంబరు 16 నుంచి 21 దాకా వివిధ స్థాయిల్లో కుంగిపోయి, దెబ్బతిన్నాయి. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ అప్రాన్లు దెబ్బతిన్నాయి. సీసీ బ్లాకులు చెల్లాచెదురయ్యాయి. అన్నారం బ్యారేజీతో పాటు గేట్ల వద్ద ఇసుక మేటలు వేస్తుండడంతో నీటిపారుదల శాఖ నిరంతరం దాన్ని తొలగించి, వరద సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. వానాకాలంలోపు బ్యారేజీలకు తగిన పరీక్షలు చేసి, మరమ్మతులు చేయాల్సిన బాధ్యత డ్యామ్ సేఫ్టీ చట్టం-2023 ప్రకారం డ్యామ్ ఓనర్ (రామగుండం చీఫ్ ఇంజనీర్)దే అని నివేదిక పేర్కొంది. ఈ సందర్భంగా బ్యారేజీల పునరుద్ధరణకు పలు సూచనలు చేసింది.

- మేడిగడ్డ బ్యారేజీ మరింత దెబ్బతినకుండా మరమ్మతులు చేయాలి. అయితే, భవిష్యత్తులో బ్యారేజీ దెబ్బతినదనే గ్యారెంటీ లేదు.
- పగుళ్లను నిరంతరం పరిశీలించాలి. బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో సీసీ బ్లాకులు ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్నాయి.
- పిల్లర్లు 16 నుంచి 22 దాకా పగుళ్లు వచ్చాయి. ఆ పిల్లర్లు మరింత దెబ్బతినకుండా ఇనుప పట్టీలు వేయాలి.
- రాఫ్ట్(పునాది)పై భారం పడకుండా చూసుకోవాలి.
- బ్లాకు-7 కుంగుబాటును నిరంతరం పరిశీలించడానికి వీలుగా టోటల్ స్టేషన్‌ను వినియోగించాలి. బ్లాక్-7 రాఫ్ట్ కింద ఇసుక జారింది. దీనికోసం ఇసుక నింపిన బస్తాలతో పాటు సిమెంట్ బస్తాలను వరుస క్రమంలో పెట్టాలి.
- బ్యారేజీ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైల్స్‌ను పరిశీలించాలి. ప్లింత్ స్లాబుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోయిందా? లేదా? చూడాలి.
- జీపీఐ చేసి, సీకెంట్ పైల్స్ దెబ్బతిన్న చోట షీట్ పైల్స్‌ను దించాలి. సీకెంట్ పైల్స్ ఎండ్ సిల్ మధ్య గ్రౌటింగ్ చేయాలి.
- సీకెంట్ పైల్స్ వైఫల్యంతో రాఫ్ట్ కింద భారీ బొరియలు(రంధ్రాలు) పడినట్లు తెలుస్తోంది. వీటిని మూయడానికి రాఫ్ట్‌కు 5-7 సెంటీమీటర్లతో రంధ్రాలు వేయాలి. రెండు మీటర్ల కన్నా ఎక్కువ రంధ్రాలు వేయరాదు. సిమెంట్, ఇసుక, వాటర్‌తో గ్రౌటింగ్ చేయాలి.
- వర్షాకాలంలో ఏడో బ్లాకు గేట్లన్నీ ఎత్తి ఉంచాలి. గేట్లతో పాటు అన్ని కాంపోనెంట్లను పరిశీలించాలి. ఏడో బ్లాకులోని 15-22గేట్లు ఓపెన్ కావడం లేదు. దీనికోసం క్రేన్లను ఏడో బ్లాకుపై కాకుండా వేరే చోట పెట్టి, గేట్లను ఎత్తాలి.
- పిల్లర్ నంబర్ 20-21 మధ్య ఉన్న గేట్లను తొలగించాలి.
- బ్యారేజీ డౌన్‌స్ట్రీమ్/అప్‌స్ట్రీమ్‌లోని సీకెంట్ పైల్స్‌ను శ్లాబును కలిపే సీసీ బ్లాకులు, ప్లింత్ స్లాబులు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి కట్టాలి. ఈ క్రమంలో వాటి కింద ఉన్న ఇసుకను సరిచేయాలి.
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే తరహా సమస్యలు ఉండడంతో వాటికి ఒకే తరహా మరమ్మతులు చేయాలి.
- అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైల్స్‌ను పరిశీలించాలి.
- నాలుగు వరుసలు ఉన్న బ్లాకులను తొలగించి, వాటి కింద ఉన్న ఇన్వర్టెడ్ ఫిల్టర్ల స్థానంలో జియో టెక్స్‌టైల్ ఫిల్టర్లు పెట్టాలి. ఈ క్రమంలో రాళ్లు లేకుండా చేసుకోవాలి. నాలుగు వరుసల్లోని సీసీ బ్లాకులను ఇనుప కడ్డీలతో అనుసంధానం చేసి, వరదను దిగువకు వదిలిపెట్టినప్పుడు అవి కొట్టుకుపోకుండా చూసుకోవాలి.

డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేయండి

బ్యారేజీల మరమ్మతుల కోసం జియో ఫిజికల్, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసి, మరమ్మతుల కోసం తగిన డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేయాలని ఎన్‌డీఎస్‌ఏ గుర్తు చేసింది. నాలుగు వారాల్లో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో.. ఎన్‌డీఎస్‌ఏ పరీక్షలు చేయడానికే దాదాపు నెలరోజులకు పైగా పడుతుంది. ఇక డిజైన్లు/డ్రాయింగ్‌లకు కనీసం 15 రోజుల సమయం కావాల్సిందే. అంటే వానాకాలంలోపు మరమ్మతులకు అవకాశం లేనట్లే.

ప్రారంభమైన ఎప్‌సెట్ పరీక్షలు

» నిమిషం నిబంధన.. వానతో విద్యార్థుల ఇక్కట్లు
» మొదటి రోజు పరీక్షకు 91శాతం హాజరు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, మే 7: నిమిషం లేటు నిబంధన.. ఎడతెరిపి లేని వానతో టీఎస్ ఎప్‌సెట్‌కు తొలిరోజు హాజరైన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు తొలిరోజు 91శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 135 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగినట్లు పేర్కొన్నారు. 67,005మందికి గానూ, 60,859మంది హాజరైనట్లు వెల్లడించారు. అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో 96.84శాతం మంది అభ్యర్థులు హాజరుకాగా, అత్యల్పంగా తిరుపతి సెంటర్‌లో 68.96శాతం హాజరైనట్లు తెలిపారు. పలు పరీక్ష కేంద్రాల్లో నిమిషం ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతివ్వలేదు. మల్లాపూర్ అయాన్ డిజిటల్ కేంద్రానికి 15 మంది విద్యార్థులు నిమిషం ఆలస్యంగా రావడంతో సిబ్బంది అనుమతించలేదు. సాయంత్రం 4.30గంటల నుంచే ఈదురుగాలులు వీయడంతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పరీక్షాకేంద్రాల్లో ఇంటర్నెట్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినట్లు సమాచారం. కాగా గండిపేట ఎంజీఐటీ కేంద్రంలో పరీక్ష 30 నిమిషాల పాటు ఆలస్యంగా ప్రారంభమైంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని పరీక్షాకేంద్రాల్లో 8 నిమిషాల ముందే కంప్యూటర్‌లో క్వశ్చన్‌పేపర్ ప్రత్యక్షమైనట్లు విద్యార్థులు తెలిపారు.


ఎల్బీనగర్‌లో ఆలస్యంగా వచ్చినందుకు పరీక్షకు అనుమతించకపోవడంతో విలపిస్తున్న విద్యార్థి

తిమ్మాపూర్‌లో రెండు గంటల ఆలస్యం

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో టీఎస్ ఎప్‌సెట్ సెకండ్ సెషన్ పరీక్ష సాయంత్రం 6 గంటల వరకు జరగాల్సిన పరీక్ష రాత్రి 7.50 వరకు కొనసాగింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష కేంద్రం ఎదుట రాజీవ్ రహదారిపై ధర్నాకు దిగారు. విద్యార్థులు పరీక్ష రాసి బయటకు వచ్చిన తరువాత వారు ఆందోళన విరమించారు. మధ్యాహ్నం తిమ్మాపూర్ మండల కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో పరీక్ష కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచి అంతరాయం ఏర్పడింది. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండ్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సమయం ఇచ్చి పరీక్ష పూర్తి చేశామన్నారు.

రాష్ట్ర జీఎస్‌డీపీకి తగ్గట్లుగా వేతనాలు ఉండాలి

» వేతన సవరణ కమిషన్‌కు యూటీఎఫ్ వినతి

హైదరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సామాజిక పరిస్థితులు, ప్రజల జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు గౌరవప్రదంగా జీవించటానికి అవసరమైన రీతిలో వేతనాలు నిర్ణయించాలని టీఎస్‌యూటీఎఫ్ కోరింది. ఈ మేరకు మంగళవారం వేతన సవరణ కమిషన్(పీఆర్‌సీ) చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి, వినతిపత్రాన్ని అందించడమే కాకుండా సమస్యను నివేదించింది. గత పీఆర్‌సీ నివేదిక 30 నెలలు ఆలస్యంగా ఇవ్వడం వలన ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని, ఈ పీఆర్‌సీలో అటువంటి నష్టం జరగకుండా సకాలంలో నివేదికను ప్రభుత్వానికి అందజేసి, 01.07.2023 నుంచి ఆర్థిక ప్రయోజనం వర్తింప చేసేలా నివేదిక ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. జంగయ్య, చావరవిలు కోరారు. కనీసం వేతనం రూ.30,000లుగా, గరిష్ఠ వేతనం రూ.2,48,150లుగా ఉండేలా ఉండాలని, మాస్టర్ స్కేలును కొనసాగించాలని, ఫిట్‌మెంట్ 30శాతం తగ్గకుండా చూడాలని, ప్రస్తుత మూల వేతనానికి 01.07.2023 నాటికి రావాల్సిన డీఏ (33.67 శాతం)తోపాటు ఫిట్‌మెంట్‌ను కలిపి మాస్టర్ స్కేల్‌లో తదుపరి స్టేజిలో వేతనం నిర్ణయించాలని కోరారు.

కవిత కస్టడీ పొడిగింపు

ఈడీ కేసులో ఈ నెల 14 వరకు, సీబీఐ కేసులో 20 వరకు.. ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. తనను కోర్టులో ప్రత్యక్షంగా హాజరుపరచాలంటూ ఆమె చేసిన వినతిని న్యాయస్థానం అంగీకరించింది. జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో మంగళవారం మధ్యాహ్నం 2.20 నిమిషాలకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు ఆమెను తీసుకువచ్చారు. తొలుత ఈడీ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ కే మట్ట వాదనలు వినిపిస్తూ దర్యాప్తు కీలక దశలో ఉన్నందున కవిత కస్టడీని పొడిగించాలని కోరారు. వారం రోజుల్లో ఆమెపై చార్జిషీటు దాఖలు చేస్తామని చెప్పారు. ఈడీ వాదనలతో ఏకీభవించిన ప్రత్యేక జడ్జి కావేరి భవేజా ఈడీ కేసులో కవిత కస్టడీని ఈ నెల 14 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపారు. సీబీఐ కేసులో మధ్యాహ్నం మరోసారి కవితను కోర్టు ముందు హాజరు పరిచారు. సీబీఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పంకజ్ గుప్తా వాదనలు వినిపించారు.మరికొన్ని రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరగా ఈ నెల 20 వరకు పొడిగించారు. కాగా, కవిత తరఫున న్యాయవాదులు నితేశ్ రాణా, మోహిత్ రావు కోర్టుకు మూడు విజ్ఞప్తులు చేశారు. కవితను కలిసేందుకు నుంచి కుటుంబసభ్యులు వచ్చారని, వారు మాట్లాడేందుకు 15 నిమిషాల సమయం ఇవ్వాలని కోరారు. జైలులో ఆమెకు మరో 10 పుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తన భర్త తెచ్చిన ఆహారం తినేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. జైలులో కవితకు హోం ఫుడ్ అందించేందుకు మార్చి 26 ఆదేశాల్లో కోర్టు అనుమతించిందని, అయితే దాన్ని 10 నుంచి 15 మంది జైలు సిబ్బంది చెక్ చేస్తుండడంతో కలుషితం అవుతోందని తెలిపారు. అందువల్ల హోం ఫుడ్ ఇవ్వడం ఆపేశామని చెప్పారు. అలా కాకుండా జైలు డాక్టర్ చెక్ చేసి ఆమెకు ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దానికోసం మరో పిటిషన్ దాఖలు చేయాలని జడ్జి సూచించారు. కోర్టు లాకప్‌లో కవితను కుటుంబసభ్యులు కలిసేందుకు అనుమతి ఇవ్వడంతో ముగ్గురు కుటుంబ సభ్యులు 15 నిమిషాల పాటు మాట్లాడారు. జైలులో మరో 10 పుస్తకాలు చదివేందుకు కూడా అంగీకారం తెలిపారు.

కోర్టు ప్రాంగణంలో నినాదాలు

కవిత కోర్టు ప్రాంగణంలోకి వచ్చేముందు జై తెలంగాణ, జై భారత్ అంటూ నినాదాలు చేశారు. బయటికి వెళ్లే క్రమంలో మీడియాతో మాట్లాడారు. ప్రజ్వల్ రేవణ్ణ లాంటి వారిని దేశం దాటించి, బాధితులను అరెస్టు చేస్తారని ఆరోపించారు. కవిత బెయిల్ పిటిషన్లపై కోర్టు తీర్పు రిజర్వ్ చేయడంతో బుధవారం ఆమె హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది.


కోర్టుకు హాజరవుతున్న కవిత



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కేజ్రీవాల్ కొత్తకేసు

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ అధినాయకుడు అరవింద్ కేజ్రీవాల్ నిర్బంధపర్వం కొత్తమలుపులు తిరుగుతోందే తప్ప, ముగింపునకు రావడం లేదు. ఎన్నికల ప్రచారం కోసం తాత్కాలిక బెయిల్ ఇచ్చే విషయం పరిశీలిస్తామని ఒక సానుకూల సంకేతం ఇచ్చిన సుప్రీంకోర్టు, మంగళవారం నాడు, ఏ నిర్ణయం ప్రకటించకుండానే విచారణను వాయిదా వేసింది. వచ్చే గురువారమో లేక వచ్చేవారమో తిరిగి విచారిస్తామని చెప్పింది. ఈ లోగా, అరవింద్ కేజ్రీవాల్ మీద మరో అభియోగంపై విచారించడానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించారు. శిక్ష అనుభవిస్తున్న సిక్కు మిలిటెంటును విడుదల చేయించడానికి ఖలిస్తాన్ అనుకూల బృందాల నుంచి హవాలా మార్గంలో ఆప్ పార్టీ నాయకుడు నిధులు తీసుకున్నారన్నది అభియోగం.

మద్యం కుంభకోణాన్నే బూటకంగా చెబుతూ, తనది రాజకీయ నిర్బంధమేనని వాదిస్తున్న కేజ్రీవాల్, నిర్బంధంలో ఉంటూ కూడా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇదొక విచిత్రమైన, ప్రత్యేకమైన సన్నివేశం. మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రీ జైలు నుంచి పరిపాలన సాగించలేదు. ఇది 'ఆప్' పార్టీకి అప్రదిష్ఠాత్మకమో, రాజకీయ కక్ష సాధిస్తున్నారన్న ఆరోపణ దృష్ట్యా కేంద్ర అధికారపార్టీకి అవమానకరమో బోధపడడం లేదు. మద్యం కుంభకోణంలో అరెస్టయిన తక్కిన నిందితుల కంటె, కేజ్రీవాలే కేంద్ర పెద్దలకు ముఖ్యమని, రాజకీయ స్పర్థతో మొదలుకుని వ్యక్తిగత వైరం దాకా అన్నీ ఈ కేసులో ఇమిడి ఉన్నాయని పరిశీలకులు చెబుతారు.

అరవింద్ కేజ్రీవాల్, అన్నా హజారే మొదలైనవారు పది, పన్నెండు సంవత్సరాల కిందట నిర్వహించిన అవినీతి వ్యతిరేక ఉద్యమం కేంద్రంలో ప్రభుత్వం మారడానికి, 'ఆప్' పార్టీ అవతరణకూ కూడా ఉమ్మడి నేపథ్యం. కాంగ్రెస్ ప్రతిష్ఠను తీవ్రంగా మలినపరచిన ఆ నాటి ఉద్యమం, కేజ్రీవాల్‌కు మచ్చలేని నూతన తరం నాయకుడిగా గుర్తింపు ఇచ్చింది. ఆయన ఆచరణ రాజకీయరూపం తీసుకుని, దేశరాజధానిలో గట్టి బలాన్ని సమకూర్చుకుంది. దేశమంతా జైత్రయాత్ర చేస్తున్న బీజేపీకి ఢిల్లీలో మాత్రం ఆదరణ దక్కడం లేదు. పోనీ, ఢిల్లీకి పరిమితమై ఉంటేనైనా ఊరుకునేవారేమో కానీ, 'ఆప్' పంజాబ్‌కు, గోవాకు, గుజరాత్‌కు కూడా విస్తరిస్తూ వచ్చింది. కాంగ్రెస్ వంటి భ్రష్ట ప్రత్యామ్నాయం మీద సాధ్యపడుతున్న అవలీల ఆధిక్యం, వేగంగా ఎదుగుతున్న 'ఆప్' మీద సాధ్యపడదని, అది గట్టి జాతీయ ప్రత్యామ్నాయం కాగలదని బీజేపీలో బెరుకు మొదలైనట్టుంది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, జాతీయస్థాయిలో ఏర్పడిన ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో 'ఆప్' భాగస్వామి కావడం మరో ఎత్తు. అవినీతి రాహిత్యానికి పర్యాయపదంగా జనంలో 'ఆప్'కు ఉండిన ప్రసిద్ధిని దెబ్బ తీయడమే లక్ష్యంగా మద్యం కుంభకోణం దర్యాప్తు సాగిందని, గుజరాత్, గోవా, ఢిల్లీ, పంజాబ్‌లలో ప్రచారం నుంచి దూరం చేయడానికే అరెస్టు జరిగిందని 'ఆప్' ప్రతినిధులు చేసే ఆరోపణలు ఆలోచించదగ్గవే. కుంభకోణంలో అవినీతి ఎంత ఉన్నదో కానీ, ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ ప్రయోజనాల పాత్ర చిన్నదేమీ కాదు. ఎక్కడ సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తుందో అన్న భయమే, ఇప్పుడు మరో కొత్త కేసును వెలికితీయడానికి కారణమని వాదిస్తున్నవారున్నారు. కొత్త కేసులో కనిపిస్తున్న కేంద్రం పట్టింపు చూసి, సుప్రీంకోర్టే మంగళవారం బెయిల్ ఇవ్వడానికి జంకిందేమోనని అనుమానిస్తున్నవారూ ఉన్నారు. పరిణామాల మధ్య సంబంధాలను ఎవరికి తోచినరీతిలో వారు వ్యాఖ్యానించకుండా ఆపలేము.

1990ల మొదట్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మణీందర్ సింగ్ బిట్టా లక్ష్యంగా చేసుకుని, ఢిల్లీలో ఒక బాంబు పేలుడు జరిగింది. బిట్టా తప్పించుకున్నారు కానీ, పేలుడులో 9 మంది మరణించారు. లూథియానాలో ఒక ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ దేవిందర్‌పాల్ భుల్లార్‌ను ఆ పేలుడులో దోషిగా 2001లో టాడా కోర్టు నిర్ధారించింది. మొదట మరణశిక్ష పడినా, తరువాత అది యావజ్జీవ శిక్షగా మారింది. పాతికేళ్లకు పైగా నిర్బంధంలో ఉన్న భుల్లార్‌ను విడుదల చేయాలని అకాలీదళ్ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. దేశవిదేశాల్లోని ఖలిస్థాన్ వాదులు, సిక్కు హక్కుల సంఘాలవారు కూడా భుల్లార్ విడుదల కోరుతున్నారు. 'సిక్స్ ఫర్ జస్టిస్' అనే ప్రవాస సిక్కు సంస్థ కూడా ఆ సంఘాలలో ఒకటి. దానిని భారత్ నిషేధించింది కూడా. భారత్ భద్రతాసంస్థలు హత్యచేయడానికి ప్రయత్నించాయని ఈ మధ్య అమెరికా ప్రభుత్వం చెబుతున్న గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దానికి నాయకుడు. భుల్లార్ విడుదల కోసం తాను కేజ్రీవాల్‌కు డబ్బు ఇచ్చానని ఆ పన్నూన్ ఒక వీడియోలో చెప్పాడని, దాని ఆధారంగా ఇప్పుడు విచారణ చేయాలని ఎన్ఐఎ కోరుతోంది. నిజానికి, ఈ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ కలసి భుల్లార్ విడుదలకు ఆటంకాలు కల్పిస్తున్నారని అకాలీదళ్ ఈ మధ్యన కూడా ఆరోపించింది. నిషిద్ధ సంస్థగా ప్రకటించిన ఎస్ఎఫ్‌జె ప్రతినిధి చేసిన ఆరోపణకు విలువ ఎట్లా ఇస్తారని, అది తప్ప మరో ఆధారమెక్కడుందని ఆప్ వాదిస్తోంది.

మంగళవారం నాటి గుజరాత్ పోలింగ్‌కు ముందటి ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొనలేకపోయారు. గురువారమో, ఆ తరువాతో బయటకు వచ్చి ఢిల్లీ ప్రచారానికి అందుకోగలుగుతారా అన్నది పెద్ద ప్రశ్న.

ప్రభుత్వం బలపడకూడదు, ప్రైవేటు బలహీనపడకూడదు అనే సిద్ధాంతం ఇంకా ఎంత కాలం? కార్పొరేట్ యజమానులకు రాయితీలు కల్పించిన సొమ్ముతో నిరుద్యోగ నిర్మూలనకు పటిష్ఠ వ్యూహ రచన చేయలేరా? అతి సంపన్నులపై సంపద పన్ను విధించాలని నిపుణుల నుంచి వస్తున్న విజ్ఞతాయుతమైన సూచన పాలకులకు వినిపించదా?

నిరుద్యోగం ఓ నిప్పుల కొలిమి...!

ఇండియాలో ఉద్యోగం తెల్ల రాళ్ళ రాశిలోని బియ్యపు గింజ వంటిది. నీడపట్టు పనులు బహుతక్కువ. మామూలుగానే నిరుద్యోగం భారీ ఎత్తున తాండవిస్తుంటుంది. అందుచేత జనసామాన్యం ఉద్యోగాల కోసం కలగనరు. కాయకష్టం చేసి కడుపు నింపుకునేవారే ఎక్కువ. దేశ కార్మిక శక్తిలో 90 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఆధునిక సాంకేతికత ప్రజల నిత్య జీవితాల్లో ఉనికిని పెంచుకున్న కొద్దీ సంప్రదాయ వృత్తులు నాశనమైపోవడం తెలిసిందే. వ్యవసాయం గిట్టుబాటుకాక దాని అనుబంధ వృత్తులు కూడా చతికిలబడి పల్లెల నుంచి పట్టణాలకు నగరాలకు వలసలు ముమ్మరించి చాలా కాలమయింది.

పదేళ్ల పాలనలో పాతిక కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని, తమను మళ్ళీ గెలిపిస్తే వచ్చే ఐదేళ్ల నాటికి దేశాన్ని ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా చేస్తామని బీజేపీ ఘనంగా చెప్పుకొంటున్నది. ప్రధాని మోదీ అంచనా వేస్తున్నట్టు 2029 నాటికి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా అవతరించినప్పటికీ పేద దేశంగానే కొనసాగుతుందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఈ మధ్యనే తెలియజేశారు. తలసరి ఆదాయంలో మనం ప్రపంచంలో 139వ స్థానంలో ఉన్నామని, అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే సమాఖ్య వ్యవస్థ వర్ధిల్లి, రాష్ట్రాలు బలంగా ఉండాలని, చట్టబద్ధ పాలన నెలకొనాలని, స్వతంత్ర వ్యవస్థలుండాలని సుబ్బారావు గుర్తుచేస్తున్నారు.

లోక్‌నీతి సిఎస్‌డిఎస్ ప్రస్తుత (2024) లోక్‌సభ ఎన్నికల కోసం జరిపిన విస్తృత సర్వేలో 62శాతం మంది ఉద్యోగాలు దొరకడం లేదని వాపోయారు. సర్వే చేసినవారిలో ఎక్కువగా ముస్లింలు (67శాతం) ఉద్యోగావకాశం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. వారి మాదిరిగానే హిందువులలోని ఎస్సీలు, బీసీలు (63 శాతం) ఎస్టీలు (57శాతం) నిరుద్యోగంలో మగ్గుతున్నారని సర్వే వివరించింది. అగ్రవర్ణాల్లో 57 శాతం మంది ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉన్నట్టు చెప్పారు. అదే సమయంలో వారిలోని 12 శాతం మంది సులభంగానే దొరుకుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలకు ఉద్యోగం మరింత కష్టంగా ఉంటోంది. ఏటా కోటి ఏభై లక్షల మంది ఉద్యోగార్థులు అదనంగా వచ్చి చేరుతున్న దేశంలో నిరుద్యోగాన్ని అంతమొందించడం ఆషామాషీ చర్యలతో సాధ్యమయ్యేది కాదు. పేద, మధ్యతరగతి యువతకు నాణ్యమైన విద్య నేర్పించి ఆధునిక ఉపాధి వ్యాపకాలకు అవసరమయిన ప్రత్యేక నిపుణతలు చేకూర్చవలసి ఉంది. అందుకే విద్య, వైద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ వ్యయం బాగా పెరగాలని ఆర్థికవేత్తలు పదేపదే చెబుతున్నారు. ప్రైవేటు స్పర్థతో పులకించిపోతున్న పాలకులకు ఇది రుచించడం లేదు.

నిరుద్యోగం పెరుగుదల రేటు 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 2017–18లో 6.1శాతానికి ఎగబాకింది. కోవిడ్ ముమ్మరించిన 2020 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 20.8 శాతానికి చేరుకొని విలయ నాట్యమాడింది. ఆ కాలంలో పట్టణాల నుంచి పల్లెలకు ఎదురు వలసలు విజృంభించాయి. ఆ విపత్కాలంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం విశేషంగా తోడ్పడింది. ఎంతగా అంటే



2019లో ఈ పథకం ద్వారా 260 కోట్ల వ్యక్తి దినాల ఉపాధి పని కల్పించగా 2021లో అది 390 కోట్ల వ్యక్తి దినాలకు పెరిగింది. భూమిలేని నిరుపేద గ్రామీణ వ్యవసాయ కార్మికులకు పని హక్కును కల్పించడానికి యూపీఏ ప్రభుత్వం ఆవిష్కరించిన ఈ పథకాన్ని బలహీనపరచేందుకు కేంద్రంలోని అధికారపక్షం శతవిధాలా ప్రయత్నించింది. ఈ పథకానికి ఆధార్ అనుసంధానమనే గుదిబండను వేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీనికి బడ్జెట్లో కేటాయింపుల కోత వంటి చర్యలకూ ప్రభుత్వం పాల్పడింది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పెద్ద నోట్ల రద్దు పథకం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) నిరుద్యోగాన్ని, నిర్వ్యాపారాన్ని పెంచాయి. కింది స్థాయి కార్మికుల పనులను హరించివేశాయి. అనాలోచితంగా ప్రకటించిన ఆకస్మిక లాక్‌డౌన్ అసంఘటిత రంగ కార్మిక లోకాన్ని కష్టాల కొలిమిలో తోసివేసింది. నిరుద్యోగాన్ని తగ్గించడానికి శాస్త్రీయమైన దారులు అనుసరించని మోదీ ప్రభుత్వం దానిని అంచనా వేయడానికి అంతవరకు గల పద్ధతులను కూడా రద్దు చేసింది. ప్రభుత్వం చేపట్టే వార్షిక ఉద్యోగ నిరుద్యోగ సర్వేకి 2017లో స్వస్తి చెప్పింది. కార్మిక విభాగం (లేబర్ బ్యూరో) మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే వ్యాపార సంస్థల సర్వేని కూడా మాన్పించింది. ఆచరణలో నిరుద్యోగం లోతులు తెలుసుకోడానికి ఏర్పాటు చేసిన శాస్త్రీయ పద్ధతులకు నిలువ నీడ లేకుండా చేస్తూ నిరుద్యోగానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో లేవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిస్సహాయత ప్రకటించడం విడ్డూరంగా లేదా?

ఉద్యోగాలు ఎప్పటికీ దొరక్కపోవడంతో విసిగిపోయిన కోట్లాది నిరుద్యోగులు దుర్భరమైన ఆర్థిక బాధలను తట్టుకోడానికి స్వయం ఉపాధులను ఆశ్రయిస్తున్నారని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా–2023 నివేదిక నిగ్గుదేల్చింది. కార్మికులకు విశేషంగా పనులు కల్పించగల తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' పథకాలను ప్రారంభించింది. ఇవి వచ్చిన తర్వాత 2016–2021 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు సగానికి పడిపోయాయి. కోవిడ్‌కి ముందే దేశ తయారీ రంగం కునకడం మొదలు పెట్టింది. ఉద్యోగం ముఖం చాటు చేసినప్పుడు మెజారిటీ కార్మికులు నిర్మాణ రంగాన్ని ఆశ్రయిస్తారు. కోట్లాదిమంది దీనిపైనే ఆధారపడి బతుకుతున్నారు. దేశంలో ఆర్థిక వ్యత్యాసాలు బ్రిటిష్ పాలనలో కంటే గత పదేళ్లలోనే ఎక్కువని ప్రపంచ అసమానతల లాబ్ తరఫున ఇటీవల అధ్యయనం జరిపిన నలుగురు ప్రఖ్యాత ఆర్థికవేత్తలు నిర్ధారించారు. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనేది ఇండియాలో రుజువు కావడం లేదని, ఉన్నత చదువులు చదివే కొద్దీ కొలువు దూరమవుతున్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువతేనని వీరిలో 65 శాతం మంది చదువుకున్నవారేనని ఈ నివేదిక వెల్లడించింది. నిరుద్యోగుల్లో విద్యావంతులు 2000లో 18 శాతం కాగా 2022లో 35 శాతానికి పెరిగారు.

కేంద్ర ప్రభుత్వంలో ఉన్నాయని భావిస్తున్న 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ప్రధానికి చేతులు ఎందుకు రావడం లేదు? కంటి తుడుపుగా 60, 70 వేల నియామక పత్రాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం బలపడకూడదు, ప్రైవేటు బలహీనపడకూడదు అనే సిద్ధాంతంతో ఎంతకాలం ఇలా ఈ దేశాన్ని ఏడిపిస్తారు? కార్పొరేట్ యజమానులకు ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల మేరకు రాయితీలు కల్పించినట్టు ప్రతిపక్షం లెక్క చెబుతున్నది. ఆ సొమ్ముతో నిరుద్యోగ నిర్మూలనకు, గరిష్ఠ స్థాయిలో యువశక్తి సద్వినియోగానికి పటిష్ఠ వ్యూహ రచన చేయలేరా? 2014–15కు 2022–23కు మధ్య దేశంలోని పైస్థాయిలో ఒక్క శాతం మంది ఆదాయ వాటా ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత అత్యధికమని తేలింది. ఈ నేపథ్యంలో అతి సంపన్నులపై సంపద పన్ను విధించాలని నిపుణుల నుంచి వస్తున్న విజ్ఞతాయుతమైన సూచన పాలకులకు వినిపించదా?

■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

చంద్రబాబు ముద్ర అద్వితీయం!



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'మీకు కొద్ది సేపటిలో ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి నుంచి ఫోన్ వస్తుంది. ఆయన ప్రతిపాదనను మీరు అంగీకరించండి. వద్దు అనకండి.' అని 2002 జూన్‌లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అబ్దుల్ కలామ్‌కు ఫోన్ చేశారు. చంద్రబాబు చెప్పినట్లుగానే వాజపేయి నుంచి ఫోన్ రానే వచ్చింది. ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో కలామ్‌ను రాష్ట్రపతిగా నియమించాలన్న ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం లభించినట్లు వాజపేయి ఆయనకు చెప్పారు. అన్ని పార్టీలు తన పేరును అంగీకరిస్తే బాధ్యతలు స్వీకరించడానికి తనకు అభ్యంతరం లేదని కలామ్ ఆయనకు తెలిపారు. వాజపేయి, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీతో కూడా మాట్లాడి అందుకు అంగీకరించేలా చేశారు. ఈ విషయాన్ని అబ్దుల్ కలామ్ స్వయంగా 'టర్నింగ్ పాయింట్స్– : ఎ జర్నీ త్రూ ఛాలెంజెస్' పేరిట తాను రాసిన పుస్తకంలో గుర్తుచేసుకున్నారు. కలామ్‌ను రాష్ట్రపతిగా ప్రకటిస్తూ ఎన్డీఏ ఏర్పాటు చేసిన సంయుక్త విలేఖరుల సమావేశంలో ఎన్డీఏ కన్వీనర్ జార్జి ఫెర్నాండెజ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రమోద్ మహాజన్, చంద్రబాబునాయుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి ఉన్నారు. ఆ విలేఖరుల సమావేశం నాకింకా గుర్తుంది.

దేశ రాజకీయాల్లో చంద్రబాబు నిర్వహించిన పాత్ర గురించి అవహేళనగా మాట్లాడేవారికి ఈ ఒక్క ఉదాహరణను జవాబుగా పరిగణించవచ్చు. అదే విధంగా యునైటెడ్ ఫ్రంట్ హయాంలో దేవెగౌడ, ఐకే గుజ్రాల్‌లను ప్రధాన మంత్రులుగా నియమించడంలోను, అప్పటి విధాన నిర్ణయాల్లోనూ చంద్రబాబు కీలక పాత్ర పోషించడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఏపీ భవన్‌లోనే చంద్రబాబు ఛాంబర్‌లో ఆ రోజుల్లో సమావేశాలు జరిగేవి. ఐకె గుజ్రాల్ పేరును సీనియర్ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ సూచించడంతో ఆయన పేరుపై కూడా చర్చలు జరిగాయి. తన పేరు కూడా ప్రతిపాదనల్లో రావడంతో గుజ్రాల్ చర్చల నుంచి వైదొలిగారు. చంద్రబాబు ఏపీ భవన్ స్వర్ణముఖి విభాగంలో ఒక సూట్ తెరిపించి అందులో పడుకోవల్సిందిగా గుజ్రాల్‌ను పంపారు. తెల్లవారు జామున 3 గంటలకు యుఎఫ్ నేతలు గుజ్రాల్‌ను లేపి 'మిమ్మల్నే ప్రధానమంత్రిగా ఎంచుకున్నాం' అని చెప్పారు. ఆ తర్వాత చంద్రబాబుతో ఆయన మంత్రివర్గ ఏర్పాటు, ఇతర విషయాల గురించి చర్చించి ఆరింటికి ఇంటికి వెళ్లారు. 'ఏమి ఇంత ఆలస్యంగా వచ్చారు?' అని గుజ్రాల్ భార్య ఆయనను నిలదీసింది. 'అలా నిలదీస్తావేం. నీవు ఈ దేశ ప్రధానమంత్రితో మాట్లాడుతున్నావు తెలుసా?' అని గుజ్రాల్ చమత్కరించారు అని ప్రముఖ జర్నలిస్టు వీర్ సంఘ్వీ తన పుస్తకం 'మాండేట్– విల్ ఆఫ్ ది పీపుల్' అన్న పుస్తకంలో వివరించారు. గుజ్రాల్ ప్రభుత్వం పడిపోయిన తర్వాత వాజపేయి ప్రభుత్వం ఏర్పడడానికి కూడా చంద్రబాబు ఇచ్చిన కీలక మద్దతే కారణమని వీర్ సంఘ్వీ ఇదే పుస్తకంలో తెలిపారు.

యునైటెడ్ ఫ్రంట్ హయాంలో కనీస ఉమ్మడి కార్యక్రమంపై చంద్రబాబు సమక్షంలో గంటల తరబడి చర్చలు జరిగేవి. జైపాల్ రెడ్డి, సూర్జిత్, బర్దన్, ఫరూక్ అబ్దుల్లా వంటి నేతలతో ఆయన తరుచూ చర్చలు జరిపేవారు పెట్రోలు, డీజిల్ ధరలను ఒక్క రూపాయి పెంచాలన్నా యునైటెడ్ ఫ్రంట్ అగ్రనేతలు సుదీర్ఘ సమావేశాలు నిర్వహించేవారు. వాజపేయి కూడా అనేక సందర్భాల్లో చంద్రబాబు సలహా లేకుండా నిర్ణయాలు తీసుకునేవారు కాదు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, పథకాలు రాబట్టేందుకు చంద్రబాబు తరుచూ ఢిల్లీ వచ్చేవారు. అయోధ్య అంశంపై కూడా వాజపేయి చంద్రబాబును 2003 ఫిబ్రవరి 16న పిలిచి చర్చలు జరిపారు. 'మీరు సుప్రీంకోర్టు తీర్పుకే వదిలి వేయడం మంచిదని చంద్రబాబు వాజపేయికి సలహా ఇచ్చారు. చివరకు అయోధ్య అంశం సుప్రీంకోర్టు వల్లే పరిష్కృతమయింది.

చంద్రబాబు రెండు కారణాల వల్ల జాతీయ రాజకీయాల్లో బలమైన ముద్ర వేశారు. మొదటిది సంకీర్ణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం కాగా రెండవది ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేసి, టెక్నాలజీని పరిపాలనలో సమర్థంగా ఉపయోగించడం. దీనివల్ల లభించే ఫలితాలను ఆయన చెప్పుకుంటే అతిశయోక్తులు మాట్లాడుతున్నారని విమర్శించేవారున్నారు కాని గురుచరణ్ సింగ్, చిదంబరం, శ్యామ్ పిట్రోడా, నందన్ నీలేకని, మార్క్‌టుల్లీ లాంటి ఆర్థిక వేత్తలు, సాంకేతిక నిపుణులు, జర్నలిస్టులు, యుకె, అమెరికా యూనివర్సిటీల్లో పలువురు పరిశోధకులు తాము రాసిన పుస్తకాల్లో చంద్రబాబును ప్రశంసించారు. కార్నెగీ మెలాన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ అయిన దబ్బాల రాజగోపాల్‌రాజ్ రెడ్డి ద్వారా హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్‌ను నెలకొల్పేందుకు చంద్రబాబు ప్రభుత్వం అప్పుడు అన్ని విధాలా సహాయసహకారాలు అందించింది. అబ్దుల్ కలామ్ మిత్రుడైన ప్రొ. రాజీవ్ సంఘాల్‌కు ఈ సంస్థ బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా 'హైదరాబాద్: ద ఫ్యూచర్ నాలెడ్జి హబ్ ఆఫ్ ద వరల్డ్' అన్న పేరుతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ బోర్డు సభ్యులను ఆకట్టుకున్నారు. అమెరికా అధ్యక్షుడు క్లింటన్ కూడా 'మై లైఫ్' అన్న తన పుస్తకంలో చంద్రబాబు తనను హైటెక్ సిటీకి ఆహ్వానించి అబ్బురపరిచిన విషయాన్ని రికార్డు చేశారు. బిల్‌గేట్స్‌ను కూడా ఆయన మెప్పించారు. చంద్రబాబు ఎంత వేగంగా నిర్ణయాలు తీసుకుంటారో ఒకప్పటి దక్కన్ ఎయిర్‌వేస్ అధినేత గోపీనాథ్ 'సింప్లీ ఫ్లై' అన్న పుస్తకంలో రాశారు. చంద్రబాబు హయాంలో ప్రోత్సాహం పొందిన పది, పదిహేను మంది పారిశ్రామికవేత్తలు ఇప్పుడు దేశ వ్యాప్తంగానే కాదు, అంతర్జాతీయ స్థాయిలోనూ విస్తరించారు.

చంద్రబాబు ఆర్థిక విధానాలను, శాంతి భద్రతలను కాపాడేందుకు తీసుకున్న చర్యలను అనేక మంది విమర్శిస్తారు కాని ఆర్థిక సంస్కరణలు అమలైన తర్వాత ఈ చర్యలు పరస్పరం దోహదం కల్పించేవిగా మారాయి. చంద్రబాబు ఆర్థిక విధానాలను వ్యతిరేకించిన వామపక్షాలు కూడా సంస్కరణలను అడ్డుకోవడం కష్టమని గ్రహించి తెలుగు దేశంతో రాజకీయంగా చేతులు కలిపాయి.

చంద్రబాబు మాదిరి ఏడు పదుల వయస్సు దాటిన, ముఖ్యమంత్రి పదవులు నిర్వహించిన అనేకమంది సీనియర్లు పలువురు ఇంకా క్రియాశీలకంగా ఉన్నారు కాని వారిలో చంద్రబాబు లాగా జాతీయ, ప్రాంతీయ రాజకీయాల్లో తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నవారు తక్కువే. చంద్రబాబుతో



'మీరు మళ్లీ జాతీయ రాజకీయాల్లో ఏమైనా పాత్ర పోషించే అవకాశాలున్నాయా' అని చంద్రబాబును ప్రశ్నిస్తే ఆయన నవ్వి, 'ఈ ఎన్నికల్లో గెలిచిన తర్వాత జాతీయ రాజకీయాల గురించి పట్టించుకునే సమయం ఎక్కడుంటుంది? జగన్ పాలన నుంచి ఏపీని విముక్తి చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతంగా పునర్నిర్మించి అభివృద్ధి చేయడంపైనే ఇక నా పూర్తి దృష్టి కేంద్రీకరిస్తాను' అని జవాబు చెప్పారు.

పాటు శరద్ పవార్, కమల్‌నాథ్, దిగ్విజయ్‌సింగ్, నవీన్ పట్నాయక్, నరేంద్రమోదీ, కె.చంద్రశేఖర్‌రావు తదితరుల పాత్ర ఈ ఎన్నికల తర్వాత ఎంతమేరకు ఉంటుందో మరో నాలుగు వారాల్లో తేలనుంది.

వీరిలో శరద్ పవార్ వయస్సు ఎనిమిది పదులు దాటినప్పటికీ ఆయనకూ, చంద్రబాబునాయుడుకూ సమీప పోలికలున్నాయి. ఇద్దరికీ 1978వ సంవత్సరం వారి రాజకీయ భవిష్యత్‌కు సంబంధించి అతి కీలకమైన కాలం. 1978లో శరద్ పవార్ తన రాజకీయ గురువు వసంత్ దాదా పాటిల్‌పై తిరుగుబాటుచేసి ఒక కూటమి నేర్పాటు చేసి, అతి పిన్న వయస్సులో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన శరద్ పవార్‌కూ, ఇదే 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబునాయుడుకూ గాడ్ ఫాదర్స్ లేరు. రాజకీయాల్లో వారు తమ భవిష్యత్‌ను తాము నిర్మించుకున్నారు.

చంద్రబాబు కంటే నవీన్ పట్నాయక్ నాలుగేళ్లు పెద్ద అయినప్పటికీ 1997లో తండ్రి బిజూ పట్నాయక్ చనిపోయేంత వరకూ ఆయనకు రాజకీయాలతోను, ఒడిషా రాష్ట్రంతోనూ సంబంధాలు లేవు. ఈ రకంగా ఆయన చంద్రబాబుతో పోలిస్తే రాజకీయాల్లో దాదాపు రెండు దశాబ్దాల జూనియర్. దిగ్విజయ్ సింగ్ వారసత్వ రాజకీయాల్లోంచి వచ్చారు. మధ్యప్రదేశ్‌లో ఒక వ్యాపార కుటుంబానికి చెందిన కమల్‌నాథ్ సంజయ్ గాంధీ డూన్ స్కూల్‌లో తన క్లాస్‌మేట్ కావడంతో 1970లోనే యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర వహించారు. కేసీఆర్ ఎంపీగా ఉన్నా, కేంద్రమంత్రిగా ఉన్నా, యూపీఏలో భాగస్వామిగా ఉన్నా ఒక్క తెలంగాణ తప్ప మరేదీ పట్టనట్లు వ్యవహరించారు. ఇక చంద్రబాబు కంటే నాలుగేళ్లు చిన్న అయిన నరేంద్రమోదీ 1971లో ఆర్ఎస్ఎస్‌లో చేరినప్పటికీ 1985 నుంచే భారతీయ జనతా పార్టీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించారు. 1970లో యువజన కాంగ్రెస్‌లో చంద్రబాబు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నప్పుడు భారతీయ జనతా పార్టీయే ఆవిర్భవించలేదు. చంద్రబాబు ఎమ్మెల్యే అయ్యేనాటికి మోదీ ఆర్ఎస్ఎస్‌లో విభాగ్ ప్రచారక్ మాత్రమే. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఆ తర్వాత ఆరేళ్లకు గాని 2001లో మోదీని ముఖ్యమంత్రి పదవి వరించలేదు. ముఖ్యమంత్రి పదవి విషయంలో పోలిస్తే శరద్ పవార్ తర్వాత చంద్రబాబే సీనియర్. ఏడుపదులు దాటిన నేతల్లో నవీన్ పట్నాయక్, చంద్రబాబు నాయుడు మాత్రమే ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి రేసులో ఉన్నారు. వీరందరిలో ఒక ప్రాంతీయ పార్టీని నాలుగు దశాబ్దాలనుంచి బలోపేతం చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, ఇప్పుడు విభజిత ఏపీలోనూ ఆ పార్టీని ఒక బలమైన శక్తిగా నిలిపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. అంతేకాదు, అనేకమంది నేతలతో పోలిస్తే అత్యంత ప్రజాస్వామికవాదిగా చంద్రబాబు పేరు తెచ్చుకున్నారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి ఢిల్లీ వచ్చి ప్రధాన మంత్రులను కలిసిన తర్వాత విలేఖరులతో మాట్లాడకుండా ఏనాడూ తిరిగి వెళ్లలేదు. జగన్ మాదిరి ఒక పాత ప్రెస్ రిలీజ్‌ను వాట్సాప్‌లో పంపించే వికృత సంస్కృతిని వారు పాటించేవారు కాదు. చంద్రబాబు ఢిల్లీ వస్తే ఇప్పటికీ జాతీయ జర్నలిస్టులు ఆయనతో గంటలతరబడి చర్చిస్తారు. చంద్రబాబు మోదీని కలిసేందుకు వచ్చాడని తెలిసినప్పటికీ ఆయనను కలుసుకునేందుకు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా వంటి నేతలు రావడాన్ని నేను గమనించాను.

'మీరు మళ్లీ జాతీయ రాజకీయాల్లో ఏమైనా పాత్ర పోషించే అవకాశాలున్నాయా' అని నేను ఇటీవల ప్రశ్నిస్తే ఆయన నవ్వి, 'ఈ ఎన్నికల్లో గెలిచిన తర్వాత జాతీయ రాజకీయాల గురించి పట్టించుకునే సమయం ఎక్కడుంటుంది? జగన్ పాలన నుంచి ఏపీని విముక్తి చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతంగా పునర్నిర్మించి అభివృద్ధి చేయడంపైనే ఇక నా పూర్తి దృష్టి కేంద్రీకరిస్తాను' అని జవాబు చెప్పారు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

రాజ్యాంగబద్ధ పాలనకై పోరాడిన పార్టీపైనా దుష్ప్రచారం!?

ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భారత్ ఉజ్వలశక్తిగా దూసుకెళుతున్న ప్రస్తుత తరుణంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో ఏ రంగాన్ని చూసినా వృద్ధి రేటు నమోదు చేసుకుంటున్న పరిస్థితుల్లో ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీయే మళ్లీ అధికారం చేపడితే అడ్రస్ గల్లంతవుతుందనే భయంతో కాంగ్రెస్ సహా ఇండీ కూటమిలోని పలు పార్టీలు కుట్రపన్ని కుహనా నినాదాన్ని ఎత్తుకున్నాయి. అదేమిటంటే మళ్లీ అధికారంలోకి వస్తే నేటి రాజ్యాంగాన్ని, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందనే దుష్ప్రచారం. చరిత్ర పుటల్లోకి వెళితే ఇదెంత అవాస్తవమో స్పష్టమవుతుంది.

ముందుగా రాజ్యాంగం రద్దు అనే అంశానికి వద్దాం. అసలు ఇది సాధ్యమేనా? గత బీజేపీ ప్రభుత్వాలు గాని, సంఘ్ పరివార్ గాని ఏనాడైనా కనీసం ఈ దిశగా వ్యాఖ్యలైనా చేశాయా? అన్నిటికంటే హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే దేశంలో 1975–77 మధ్య కాలంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ విలువలను పూర్తిగా తుంగలో తొక్కి, పత్రికా స్వేచ్ఛను హరించి, విపక్ష నేతల్ని ఎడాపెడా అరెస్టులు చేయించి జైళ్లను నింపేసిన ఘనత నాటి ప్రధాని ఇందిరాగాంధీ సర్కారుదేనని యావత్ ప్రపంచానికి తెలుసు. నాడు ఎమర్జెన్సీని తొలగించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు రాజ్యాంగబద్ధ పాలన కోసం 80 వేలకు పైగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు జైళ్లకు వెళ్లారు. ఇప్పుడు ఇందిర వారసులైన కాంగ్రెస్ అగ్రనేతలు, వీరితో భాగస్వామ్యంలో ఉన్న ఇండీ కూటమి నేతలు రాజ్యాంగం రద్దు గురించి మాట్లాడటం అంటే దయ్యాలు వేదాల్ని వల్లించడమే.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్‌లో పరిపాలనకు ఆత్మ రాజ్యాంగమే. రాష్ట్రపతులు, ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రి మండళ్లు, గవర్నర్లు, న్యాయమూర్తులు, ఎన్నికల ప్రక్రియ, సైనిక దళాలు సహా చట్టబద్ధమైన పలు సంస్థల ఏర్పాటు అంతటికీ రాజ్యాంగమే ఆధారం. ఈ రాజ్యాంగమే ఊపిరిగా బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు, నేతల ఎన్నిక జరిగింది. ఈ రాజ్యాంగం ప్రాతిపదికనే గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కారు, గత రెండు విడతలుగా నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడి రాజ్యాంగబద్ధంగా సర్కారును నడుపుతూ ప్రజాదరణ పొందాయి. ఇంత అవకాశాన్నిచ్చిన రాజ్యాంగాన్ని బీజేపీ రద్దు చెయ్యాలనుకుంటోందనే ప్రచారం ఎంతవరకూ నిజమో ఈ గాలిమాటలకి ఊపిరి పోసిన ఇండీ నేతలే చెప్పాలి. దేశంలో రాష్ట్రపతుల్ని, న్యాయమూర్తులను, ప్రభుత్వాలను అభిశంసించాలంటేనే ఎన్నో కోణాలను దృష్టిలో పెట్టుకుని పలు సంక్లిష్టమైన ప్రక్రియలను రాజ్యాంగం నిర్దేశించడంతో పాటు ప్రభుత్వాలు తప్పుదోవ పట్టకుండా గవర్నర్లు, రాష్ట్రపతులను రాజ్యాంగ రక్షకులుగా మన ప్రజాస్వామ్యం ఉంచింది. ఇంత పటిష్ఠమైన రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వాలు, అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఎప్పుడూ గౌరవిస్తూనే ఉండగా 'రాజ్యాంగం రద్దు' అనే మాట బీజేపీకి అన్వయించడం పూర్తి దురుద్దేశపూరితం తప్ప మరొకటి కాదు.

ఒకవైపు రాజ్యాంగం రద్దు అంటూనే, రాజ్యాంగాన్ని బీజేపీ మార్చేయబోతోందనే అనే మరో మాటను కూడా విపక్షాలు ప్రయోగిస్తున్నాయి. అసలు రాజ్యాంగాన్ని 100 సార్లకు పైగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దే! ఎంతమాత్రమూ మార్పులకు వీల్లేని రాజ్యాంగ పీఠికను ఎమర్జెన్సీలో మార్చింది కాంగ్రెస్ సర్కారు కాదా? కాంగ్రెస్ పాలనలో జరిగిన రాజ్యాంగ మార్పులను ఏమంటారు? ఇది రాజ్యాంగాన్ని మార్చడం కాదా? రాజ్యాంగంలో సవరణలు, చట్టాల రూపకల్పన, మార్పుచేర్పులకు సంబంధించి రాజ్యాంగమే నిర్దిష్ట విధి విధానాలతో అవకాశమిచ్చినప్పుడు రాజ్యాంగంలో మార్పులు చెయ్యడం మహా నేరమన్నట్టు విపక్షాలు ప్రచారం చెయ్యడం సబబేనా? అదే వారి మాట అయితే రాజ్యాంగ మార్పుల విషయంలో మొదటి దోషిగా కాంగ్రెస్‌నే నిలబెట్టాలి.

ఒకవైపు రాజ్యాంగం రద్దు అంటూనే, రాజ్యాంగాన్ని బీజేపీ మార్చేయబోతోందనే అనే మరో మాటను కూడా విపక్షాలు ప్రయోగిస్తున్నాయి. అసలు రాజ్యాంగాన్ని 100 సార్లకు పైగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దే! ఎంతమాత్రమూ మార్పులకు వీల్లేని రాజ్యాంగ పీఠికను ఎమర్జెన్సీలో మార్చింది కాంగ్రెస్ సర్కారు కాదా?



ఇక ఎస్సీ–ఎస్టీ రిజర్వేషన్ల రద్దు అంశానికి వస్తే– బీజేపీపైన, ఆర్ఎస్ఎస్ పైనా ఒక అబద్ధాన్ని పదే పదే ప్రచారం చేసి అదే నిజమని అనిపించేందుకు విపక్షాలు చేస్తున్న విశ్వప్రయత్నం ఇది. కోల్పోతున్న తమ ప్రాభవాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతిపక్షాలు చేస్తున్న ఈ దింపుడుకళ్ళెం ప్రయత్నం వారికి నిరాశనే మిగల్చుతుందనేది ఇప్పటికే రుజువైన సత్యం. రిజర్వేషన్లకి సంబంధించి 'కొన్ని శతాబ్దాలుగా ఎస్సీలపై చూపిన అస్పృశ్యత నిర్మూలనకు ఉద్దేశించిన ఈ రిజర్వేషన్లు అస్పృశ్యత, అసమానతలు ఉన్నంతవరకు కొనసాగాలి. మేము అభివృద్ధి చెందాం, మాకు ఇక రిజర్వేషన్లు అవసరం లేదని ఎస్సీ, ఎస్టీలు ప్రకటించేంత వరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కొనసాగాలి' అన్నది ఆర్ఎస్ఎస్ నిశ్చితాభిప్రాయం. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ విషయాన్ని పలుమార్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి 2015 నుంచి 2024 ఏప్రిల్ వరకూ వివిధ సందర్భాల్లో రిజర్వేషన్లకు మద్దతుగా ఆర్ఎస్ఎస్ పెద్దలు చేసిన వ్యాఖ్యల వీడియోలు కూడా బయటకొచ్చాయి. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, సంఘ్ పరివార్ చిత్తశుద్ధికి ఇంకేం రుజువు కావాలి? కానీ, రిజర్వేషన్లపై అంతకుముందెప్పుడో ఆర్ఎస్ఎస్ నేతల నుంచి భిన్నమైన వ్యాఖ్యలు వినిపించాయని రాహుల్‌గాంధీ కుమిలిపోతున్నారు. ఆయనకు వినిపించిన ఆ వ్యాఖ్యలు ప్రజలకు వినిపించలేదంటే ఎవరిది లోపమో ఆయనే చెప్పాలి.

ఎస్సీ ఎస్టీల విషయంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎప్పుడూ ఉన్నతమైన దృష్టితోనే వ్యవహరించాయి అని చెప్పడానికి ఆర్ఎస్ఎస్ శాఖలను సందర్శించి, బడుగువర్గాలకు అక్కడ దక్కిన ఆదరణ చూచి ప్రశంసలు కురిపించిన మహాత్మా గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల వ్యాఖ్యలే చాలు. మే 12, 1939న పూణే నగరంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల శిబిరానికి డాక్టర్ అంబేడ్కర్ విచ్చేసిన ఉదంతం, అక్కడ ఆచరణలో ఉన్న కులనిర్మూలన తీరును అంబేడ్కర్ మెచ్చిన వైనాన్ని ఆయన అనుయాయి బాలా సాహెబ్ సాలుంకే (1957–62 లోక్‌సభ సభ్యులు) తన ఆత్మకథలో తెలిపారు, 1957 ఏప్రిల్ 1, 1957న పూణేలో జరిగిన ఉగాది వేడుకల్లో బహిరంగంగానూ చెప్పారు. ఇక గాంధీజీ 28 సెప్టెంబర్ 1947లో వార్ధాలో ఆర్ఎస్ఎస్ శాఖకు విచ్చేసి తాను కోరుకున్న కులరహిత సమాజం ఆర్ఎస్ఎస్ శాఖల్లో కనిపించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలపై కువిమర్శలే ఊపిరిగా బతుకీడుస్తున్న విపక్ష నేతలకు కళ్లెదుట ఈ సాక్ష్యాలు కనిపిస్తున్నా గుడ్డితనాన్ని నటిస్తూ అందరూ తమలాగే ఉండాలని కోరుకుంటున్నారు.

డాక్టర్ అంబేడ్కర్ జీవించి ఉండగా వారి సిద్ధాంతాలను కమ్యూనిస్టులు వెక్కిరిస్తూనే ఉన్నారు. ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవకుండా నాటి కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంది. బీజేపీని విమర్శించేందుకు పదేపదే డాక్టర్ అంబేడ్కర్‌ని అడ్డుపెట్టుకునే వామపక్ష మేధావులు గుర్తించాల్సిన సత్యం మరొకటుంది. డాక్టర్ అంబేడ్కర్ పలు సందర్భాల్లో కమ్యూనిస్టుల తీరును తూర్పారబట్టారు. తెలుగు రాష్ట్రాలలో నక్సల్ ఉద్యమానికి మూలపురుషుడైన నల్ల సూరీడు సత్యమూర్తి ఏమన్నారు? నక్సల్ ఉద్యమంలో కూడా క్రింది స్థాయిలో పోరాటం చేస్తున్నవారు, చనిపోతున్నవారు ఎస్సీ ఎస్టీ వర్గాల వారేనని, పై నాయకత్వం మాత్రం అగ్రవర్ణాల వారిదని చెప్పలేదా? నిమ్న, పేద వర్గాల ప్రజల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే కమ్యూనిస్టు పార్టీల పోలిట్ బ్యూరోలో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉన్నారని ఆనాడే ప్రశ్నించారు. అంబేడ్కర్ భావజాలానికి వ్యతిరేకంగా, భారతదేశం ఒకటి కాదని, ఆర్యులు బయట వారనీ... వీరు ఈ దేశంలోని మూలవాసులపై దాడులు చేశారని అసత్య ప్రచారం ఇప్పటికీ చేస్తున్నది కమ్యూనిస్టులు కాదా? జవాబులివ్వలేని ఎన్నో ప్రశ్నలను దాచుకున్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నేతలా బీజేపీనీ, ఆర్ఎస్ఎస్‌నీ విమర్శించేది?

● ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి
ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్

మళ్లీ మణుగూరు ప్యాసింజర్ నడపాలి

తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో మణుగూరు నుంచి కాజీపేటకు నడిచే మణుగూరు ప్యాసింజర్ రైలు గ్రామీణ, పట్టణ ప్రయాణికులకు అనుకూలంగా ఉండేది. కరోనా వైరస్ ప్రారంభం కాకముందు నడిచిన ఈ రైలును తిరిగి ప్రయాణికుల సౌకర్యార్థం పునః ప్రారంభించాలని రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రైలు మణుగూరు, కొత్తగూడెం, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ, వరంగల్, కాజీపేట స్టేషన్ల నుంచి ప్రయాణించే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లతో సమానంగా ప్యాసింజర్ రైళ్లకు కూడా ప్రయాణ చార్జీలను పెంచారు. మణుగూరు ప్యాసింజర్ రైలు ప్రయాణ చార్జీలను కూడా గతంలో ఉన్నట్లుగానే తగ్గించాలి.

– ఈదునూరి వెంకటేశ్వర్లు
నెక్కొండ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ,
ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్విని లే ఔట్,
హుడా హైట్స్,
రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.9 కనిష్ఠం 29.3



నగరం.. సగం అంధకారం

- వర్షానికి విద్యుత్‌ వ్యవస్థ అతలాకుతలం
- పలు ప్రాంతాల్లో 7 గంటలు నిలిచిన సరఫరా

హైదరాబాద్‌ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి సగం నగరం అంధకారంగా మారింది. పలు ప్రాంతాల్లో 7 నుంచి 8 గంటలు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. ఫోన్లు స్విచాఫ్‌ కావడంతో పాటు ఇంటర్‌నెట్‌ వ్యవస్థ పని చేయకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో సంబంధాలు తెగిపోయాయి. సాయంత్రం 5 గంటలకు నిలిచిన విద్యుత్‌సరఫరా రాత్రి 11 అయినా పునరుద్ధరించ లేదు.

ఈ ప్రాంతాల్లో చీకట్లు

కూకట్‌పల్లి బాలాజీనగర్‌, కేపీహెచ్‌బీ కాలనీ, కుత్బుల్లాపూర్‌, మియాపూర్‌, శేరిలింగంపల్లి, ఎల్లారెడ్డి, యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్‌, ఎస్‌ఆర్‌నగర్‌ బీకేగూడ, కొత్తపేట, న్యూ నాగోల్‌, బంజారాహిల్స్‌, అత్తాపూర్‌ ప్రాంతాల్లో గంటల కొద్దీ విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. ఆ ప్రాంతాలు చీకట్లో మగ్గాయి. సరూర్‌నగర్‌, హబ్సిగూడ ప్రాంతాల్లో ఈదురుగాలులకు విద్యుత్‌తీగలపై బ్యానర్లు

మిగతా 8వ పేజీలో..


అమీర్‌పేట ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

సాయంత్రం 5.30 గంటలకు మొదలైన వర్షం.. నిమిషాల వ్యవధిలోనే తీవ్రరూపం దాల్చింది. రాత్రి 7.30 గంటల వరకు దంచికొట్టింది. మధ్యలో 8 గంటల సమయంలో అరగంట విరామం ఇచ్చింది. తర్వాత 8.40 నుంచి 9.10 గంటల వరకు మళ్లీ కుండపోతగా కురిసింది.




వారాసిగూడలో కూలిన చెట్టు


కూకట్‌పల్లి రహదారిపై వరద

వణికించిన వాన

రెండు గంటల పాటు కుండపోత

- ఉరుములు, మెరుపులతో బీభత్సం
- పిడుగులకు భయపడిన తల్లిదండ్రులు, చిన్నారులు
- బయటకు వెళ్లిన వారికి ఫోన్ల ద్వారా క్షేమ సమాచారం
- ఇళ్ల ఎదుట నిలిచిన నీరు.. రోడ్లపై పోటెత్తిన వరద
- కాలనీల్లో విరిగిన విద్యుత్‌ స్తంభాలు, భారీ వృక్షాలు
- రహదారులపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌ జాం
- ఇళ్లకు చేరేందుకు ఉద్యోగుల అవస్థలు

మహానగరాన్ని వాన వణికించింది. రెండు గంటల పాటు దంచికొట్టింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వరుణుడు బీభత్సం సృష్టించాడు. నగరవాసులు తడిసిముద్దయ్యారు. రహదారులపై వరద పోటెత్తింది. పలు ప్రాంతాల్లో వాహనాలు కిలోమీటర్‌ మేర బారులుదీరాయి. పలుకాలనీల్లో విద్యుత్‌ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గంటల తరబడి అంధకారం నెలకొంది.

నగరంలోని జేబీఎస్‌ ప్రాంతానికి చెందిన రాఘవేందర్‌మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. రోజూ సాయంత్రం 4.30 గంటలకు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి 5.10కి ఆఫీసుకు చేరుకుంటాడు. రోజూ మాదిరిగానే మంగళవారం సాయంత్రం బయలుదేరిన రాఘవేందర్‌కు మార్గమధ్యలో వర్షం ఎదురైంది. నిమిషాల వ్యవధిలో వర్షం తీవ్రత ఎక్కువ కావడంతో కాసేపు రోడ్డుపక్కన ఆగాడు. ఆఫీసు సమయం దాటుతుందనే భయంతో ఎలాగోలా బయలు దేరిన ఆయనకు రోడ్డుపై అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. బేగంపేట, పంజాగుట్టలో రోడ్లపై మోకాలిలోతుతో వరద వెళ్లడంతో ఇబ్బందిపడ్డారు. 5.10 గంటలకు ఆఫీసుకు వెళ్లాల్సిన ఆయన రాత్రి 7.30 గంటలకు చేరుకున్నాడు. 16 కిలోమీటర్ల ప్రయాణానికి 3 గంటల సమయం పట్టిందని సహచర ఉద్యోగులతో వాపోయాడు.

మియాపూర్‌కు చెందిన శ్రీనివాసరావు పని నిమిత్తం కారులో జూబ్లీహిల్స్‌కు వస్తున్నాడు. సాయంత్రం 5 గంటలకు ఇంటినుంచి బయలుదేరిన ఆయన వర్షం కారణంగా తీవ్ర ఇబ్బంది పడ్డారు. మియాపూర్‌ నుంచి జేఎన్‌టీయూ వచ్చేసరికి వర్షం ఎక్కువైంది. ఇంటికి రావాలని కుటుంబసభ్యుల ఒత్తిడి చేయడంతో జేఎన్‌టీయూ నుంచి వెనుదిరిగారు. అక్కడి నుంచి కూడా ఇంటికి చేరేందుకు గంట సమయం పట్టిందని ఆయన తెలిపారు.

నగరంలో కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించిపోయిందని చెప్పేందుకు ఇవి కొన్ని ఉదాహరణలు

మరిన్ని వివరాలు 6వ పేజీలో..

ఐటీకారిడార్‌ మాదాపూర్‌లోని మెట్రోమాల్‌ నుంచి పోలీస్‌స్టేషన్‌ వరకు సుమారు 1.5 కిలోమీటర్ల దూరం దాటడానికి మంగళవారం సాయంత్రం తర్వాత కురిసిన వర్షం, భారీ ట్రాఫిక్‌ వల్ల 35నిమిషాలు పట్టింది. మాదాపూర్‌లోని రహదారులు రెండు వైపులా ట్రాఫిక్‌ స్తంభించింది. రాత్రి 11 వరకు ట్రాఫిక్‌ కొనసాగింది.


ఎర్రగడ్డలో ట్రాఫిక్‌ జామ్‌

వర్షం కారణంగా బహదూర్‌పురాలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు.

యాప్స్‌ డౌన్‌

భారీ వర్షానికి ఫుడ్‌, ట్రావెలింగ్‌.. అన్ని యాప్‌లూ మంగళవారం సాయంత్రం నుంచి మూగబోయాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో యాప్‌లన్నీ సేవలను తాత్కాలికంగా నిలిపివేయడంతో కొందరు ఇబ్బందులు పడ్డారు. అర్థాకలితో కొంతమంది నిద్రపోయారు. కరెంట్‌ లేకపోవడంతో సెల్‌ఫోన్లు స్విచాఫ్‌ అయి కొందరు అవస్థలు పడ్డారు. వర్షానికి గిగ్‌వర్కర్లు డెలివరీ చేయడానికి ఇష్టపడకపోవడంతో పాటు, డ్రైవర్లు సవారీ నిరాకరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో యాప్‌లు తమ సేవలను నిలిపివేశాయి.

వర్షాలతో అలర్ట్‌

వర్షాల నేపథ్యంలో మున్సిపల్‌ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ దానకిశోర్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌లో పరిస్థితిని ఆరా తీశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌, ఈవీడీఎం డైరెక్టర్‌, వాటర్‌బోర్డు ఎండీలను అప్రమత్తం చేశారు. హైదరాబాద్‌ మహానగరంలో లోతట్టు ప్రాంతాల్లో అత్యవసర సేవలను అందించాలని దానకిశోర్‌ ఆదేశాలిచ్చారు. నగరంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. దీనికోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్‌ టీమ్‌ లు (ఈఆర్టీ), ఎస్పీటి వాహనాలు సైతం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

040 - 21111111 వరద సమస్యలు తలెత్తితే ఫోన్‌ చేయాల్సిన జీహెచ్‌ఎంసీ కాల్‌ సెంటర్‌ నంబర్‌





9266 మంది మాత్రమే..

- ఓటు వేసేందుకు ఆసక్తి చూపని ఉద్యోగులు

హైదరాబాద్‌ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): వారంతా ఉద్యోగులు.. అధికారులు.. అయినా ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌ జిల్లాలో ఉంటూ ఎన్నికల విధులు నిర్వర్తించే 34,238 మంది ఉద్యోగులు, అధికారులు పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో హైదరాబాద్‌, సికింద్రాబాద్‌ పార్లమెంట్‌, కంటోన్మెంట్‌ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన వారు 16,776 మంది ఉన్నట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌ రోస్‌ తెలిపారు. ఈ నెల 3వ తేదీన పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ మొదలైంది. హైదరాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని ఓటర్ల కోసం గన్‌ఫౌండ్రి ఆల్‌ సెయింట్స్‌ హైస్కూల్‌, సికింద్రాబాద్‌ లోక్‌సభ ఓటర్ల కోసం పికెట్‌లోని కేంద్రీయ విద్యాలయ, కంటోన్మెంట్‌ అసెంబ్లీ ఓటర్ల కోసం కంటోన్మెంట్‌ సీఈఓ కార్యాలయంలో ఫెసిలిటేషన్‌ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు కేవలం 9,266 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. నిర్దిష్ట షెడ్యూల్‌ ప్రకారం పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌కు నేడు ఆఖరు. ఇప్పటి వరకు 55 శాతం మంది మాత్రమే ఓటు వేశారు. పూర్తిస్థాయిలో పోస్టల్‌ బ్యాలెట్‌ వినియోగించుకోని నేపథ్యంలో 9, 10 తేదీల్లోనూ ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు రోనాల్డ్‌ రోస్‌ తెలిపారు.

హోం ఓటింగ్‌ నేడు కూడా..

85 యేళ్లు దాటిన వయోధికులు, దివ్యాంగులకు హోం ఓటింగ్‌కు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. మూడు నియోజకవర్గాల పరిధిలో హోం ఓటింగ్‌కు 571 మంది దరఖాస్తులను ఆమోదించారు. వీరిలో 533 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 38 మంది ఇళ్లకు నేడు వెళ్లి ఓటు వేయించనున్నట్టు పేర్కొన్నారు.

దేశభక్తి ఉంటే ఓటు వేయండి

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- 82 శాతం స్లిప్పుల పంపిణీ
- మొబైల్‌ యాప్‌తో ఓటర్ల క్యూ తెలుసుకోవచ్చు
- పోలింగ్‌ కేంద్రాల రూట్‌ మ్యాప్‌ కూడా..
- ప్రతి పోలింగ్‌ కేంద్రంలో మహిళా సిబ్బంది
- 11న ప్రచార గడువు 6 గంటల వరకు : రోనాల్డ్‌రోస్‌

సాక్షం యాప్‌లో నమోదుతో ఉచిత ప్రయాణం

హైదరాబాద్‌ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశంపై ప్రేమ, దేశభక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ రోనాల్డ్‌రోస్‌ తెలిపారు. మే 13వ తేదీన జరగనున్న పార్లమెంట్‌ ఎన్నికల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో 45.91 లక్షల మంది ఓటర్లున్నారని, 3,986 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి

మిగతా 6వ పేజీలో..



స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న అనుదీప్‌, రోనాల్డ్‌రోస్‌, శ్రీనివాసరెడ్డి

383 సమస్యాత్మక ప్రాంతాలు

లా అండర్‌ ఆర్డర్‌ నిబంధనల ప్రకారం హైదరాబాద్‌ జిల్లాలో 383 సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలు ఉన్నాయని నగర పోలీస్‌ కమిషనర్‌ కే శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 1046 క్రిటికల్‌ కేంద్రాలను గుర్తించినా.. 383 చోట్లనే అదనపు భద్రతా ఏర్పాట్లు అవసరమన్నారు. జీహెచ్‌ఎంసీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొదటిసారి జోన్ల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కర్నాటక నుంచీ హోంగార్డులు ఎన్నికల బందోబస్తుకు వస్తారన్నారు. ఎన్నికల కోడ్‌ ఉల్లంఘనకు సంబంధించి 47 కేసులు నమోదయ్యాయని వివరించారు. విధులకు రాని ముగ్గురు ఉద్యోగుల పైనా ఉల్లంఘన కేసులు నమోలు చేసినట్టు రోనాల్డ్‌రోస్‌ తెలిపారు. ఇప్పటి వరకు రూ.21.85 కోట్ల నగదు, రూ.1.27 కోట్ల విలువైన మద్యం, రూ.2.96 కోట్ల విలువైన గంజాయి, రూ.12.30 కోట్ల విలువైన బంగారం, వెండి, ప్లాటినం, పంపిణీ కోసం తీసుకెళ్తోన్న రూ.1.50 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే **8**

వీవీ ప్యాట్‌లలో సాఫ్ట్‌ వేర్‌

సార్‌ రావాలి.. కారు గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారు..

మల్కాజిగిరి చక్రబంధాన్ని తొలగించి అభివృద్ధికి బాటలు వేస్తా

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి రాగిడి



ఉప్పల్‌, మే7(ఆంధ్రజ్యోతి): 'కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌ నగరాన్ని బీఆర్‌ఎస్‌ సర్కారు అభివృద్ధిలో ప్రపంచస్థాయిలో నిలిపింది. అందుకే పార్లమెంట్‌ ఎన్నికల్లో ప్రజలు కారు పార్టీని గెలిపించాలని నిర్ణయించుకున్నారు' అని మల్కాజిగిరి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. 'సార్‌ కావాలి.. కారు గెలవాలి' అనే నినాదంతో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని

మిగతా 6వ పేజీలో..

ఓటును అమ్ముకొనేవారు ఆలోచించాలి



నేరేడ్‌మెట్‌, మే 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన ఓటర్లలో కొందరు ప్రలోభాలకు లొంగుతున్నారు. ఈ నెల 13న జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఓటును అమ్ముకొనేవారు ఒకసారి ఆలోచించాలని మేధావులు సూచిస్తున్నారు. మన భవిష్యత్‌కు బాటలు వేసే ఆదర్శ ప్రభుత్వాన్ని ఎన్నుకొనేందుకు ఉపయోగించాల్సిన ఓటును అమ్ముకొని దుర్వినియోగం చేస్తే ఐదేళ్ల కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

ఏడాదికి 365 రోజుల చొప్పున ఐదేళ్లకు 1,825 రోజులు. ఐదేళ్ల విలువ గల ఓటుకు తీసుకునే మొత్తం రోజువారీగా లెక్కిస్తే..

- 500 తీసుకుంటే రోజుకు 0.27 పైసలు
- 1,000 తీసుకుంటే రోజుకు 0.56 పైసలు
- 1,500 తీసుకుంటే రోజుకు 0.82 పైసలు
- 2,000 తీసుకుంటే రోజుకు 1.10 పైసలు
- 2,500 తీసుకుంటే రోజుకు 1.37 పైసలు
- 3,000 తీసుకుంటే రోజుకు 1.65 పైసలు
- 4,000 తీసుకుంటే రోజుకు 2.20 పైసలు
- 5,000 తీసుకుంటే రోజుకు 2.24 పైసలు


అంటే గరిష్ఠంగా రోజుకు రూ. 2.24 పైసలకు అమ్ముడుపోతున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఇంజనీరింగ్‌, అగ్రికల్చర్‌ అండ్‌ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికై ప్రభుత్వం నిర్వహిస్తోన్న టీఎస్‌ ఈఏపీ సెట్‌ మంగళవారం ప్రారంభమైంది. నిమిషం లేటుగా వచ్చినా అధికారులు లోనికి అనుమతించలేదు. దీంతో కేంద్రాలకు కొందరు అభ్యర్థులు ఉరుకులు, పరుగులు పెట్టారు.


హయత్‌నగర్‌లో పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు ఉరుకులు, పరుగులు పెడుతూ..


బాచుపల్లిలోని వీఎన్‌ఆర్‌ విజ్ఞానజ్యోతి కళాశాల వద్ద అభ్యర్థులు





సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌బేడి

మహిళలు రాణించాలి : కిరణ్‌బేడీ

రవీంద్రభారతి, మే 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు విద్యతో పాటు ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాల్సిన అవసరముందని మాజీ లెఫ్టినెంట్‌ గవర్నర్‌ డాక్టర్‌ కిరణ్‌ బేడీ అన్నారు. నగరంలోని వోక్సెన్‌ యూనివర్సిటీలో ది ఫ్యూచర్‌ యూ టాక్స్‌ సంచిక ఆవిష్కరణ సభ మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కిరణ్‌బేడీ సంచికను ఆవిష్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉమెన్‌ ఇన్‌ లీడర్‌షిప్‌ బ్రేకింగ్‌ బారియర్స్‌ అండ్‌ గ్లాస్‌ సీలింగ్స్‌ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన విజయాలు, పోలీసు వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల గురించి వివరించారు. సామాజిక నిబంధనలను, సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పిల్లల దశ నుంచే విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వోక్సెన్‌ వర్సిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ డా.రౌల్‌.వి రోడ్రిగ్జ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.









వణికించిన వాన

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): నెలన్నర రోజులుగా నగరం నిప్పుల కొలిమిలా భగభగ మండింది. వరుణుడు మంగళవారం మోస్తరు వర్షంతో ఎండల నుంచి సేదతీరుస్తాడనుకుంటే ఉగ్ర రూపం దాల్చి భయపెట్టాడు. వర్షాకాలం మాదిరిగా దంచికొట్టడంతో నగరంలోని ప్రధాన రహదారుల్లో వరద పోటెత్తింది. 2 గంటల పాటు కుంభవృష్టి వర్షించగా, ఆ తర్వాత కూడా నాలుగు గంటల పాటు కురుస్తూనే ఉంది. మధ్యలో ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలు రావడంతో నగరవాసులు వణికిపోయారు. ఓ వైపు ఇళ్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అక్కడి ప్రజలు, మరో వైపు రోడ్లపై ట్రాఫిక్ పెద్దఎత్తున నిలిపోవడంతో వాహనదారులు నరకయాతన పడ్డారు.

ఆఫీసుల నుంచి ఇంటికి వచ్చేటప్పుడు..

మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ, వడగాలులు కొనసాగాయి. సాయంత్రం 4 తర్వాత వాతారణంలో మార్పులు రావడంతోపాటు చల్లదనం ఏర్పడి వర్షపు సూచనలు కనిపించాయి. కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు వర్షం రాకముందే ఇంటికి చేరుకోవాలని భావించారు. పనులపై బయటకు వెళ్లిన వారు సైతం ఇంటిబాటపట్టారు. సాయంత్రం 5.30 గంటలకు మొదలైన వర్షం.. నిమిషాల వ్యవధిలోనే తీవ్ర రూపం దాల్చింది. దీంతో సాయంత్రం ఆఫీసుల నుంచి ఇళ్లకు బయలుదేరిన వందలాది మంది ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కుకుపోయారు.

భారీ వర్షం వస్తోంది జాగ్రత్త.. అంటూ కాల్స్

సాయంత్రం సమయంలో ఇంటి నుంచి ఆఫీసులకు బయలుదేరిన, అప్పటికే రోడ్లపైకి వెళ్లిన, ఆఫీసుల నుంచి వస్తున్న తల్లిదండ్రులకు పిల్లలు ఫోన్ కాల్స్ చేశారు. 'భారీ వర్షం వస్తోంది.. జాగ్రత్తగా వెళ్లండి.. రోడ్లపై వరద ఉంటే పక్కకు ఆగండి' అంటూ కాల్/వీడియో కాల్స్ ద్వారా చెప్పారు. పిడుగులు, ఉరుముల శబ్దానికి చిన్నపిల్లలు భయపడుతూ ఏడ్చారు. ఆఫీసుల నుంచి ఇంటికి త్వరగా రావాలని కోరారు.

అలస్యంగా డీఆర్ఎఫ్ సిబ్బంది

నగరంలో వర్షం పడితే చాలు వెంటనే వాలిపోయే జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం పలు ప్రాంతాల్లో ఆలస్యంగా వచ్చినట్లు స్థానికులు తెలిపారు. బేగంపేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి, చెట్లు విరిగి ఇబ్బందులు పడ్డామని చెప్పుకొచ్చారు.


అమీర్‌పేటలో రోడ్లపైకి చేరిన వర్షపునీటిలో వాహనదారుల అవస్థలు

ఇదిలా ఉండగా, వర్షంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో చాలా మంది మెట్రో రైళ్లను ఆశ్రయించారు. మియాపూర్, జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ, రాయదుర్గం, పెద్దమ్మగుడి, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, అమీర్‌పేట్, బేగంపేట్, పరేడ్‌గ్రౌండ్స్, సికింద్రాబాద్, ప్యారడైజ్, ఉప్పల్, తార్నాక, నాగోలు, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, ఎల్‌బీనగర్.. ఇలా ఏ స్టేషన్‌లో చూసినా ప్రయాణికుల రద్దీ కనిపించింది.

పలు ప్రాంతాల్లో పరిస్థితి ఇలా..

- బేగంపేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, రాజ్‌భవన్, రాణిగంజ్, మాసబ్ ట్యాంక్, లక్డీకపూల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, తదితర ప్రాంతాల్లో మోకాలిలోతు వరకు వర్షం నీరు నిలిచింది. ఆయా ప్రాంతాల్లో రోడ్లపై గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది.
- గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం మార్గంలో సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ భారీగా నిలిచింది. ఈ మార్గంలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటల సమయం పట్టింది.
- మియాపూర్-జేఎన్‌టీయూ మార్గంలో రాత్రి 10గంటల వరకు ట్రాఫిక్ స్తంభించింది. 5 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నర పట్టినట్లు వాహనదారులు తెలిపారు.
- సికింద్రాబాద్ నుంచి ట్యాంక్‌బండ్, మెహిదీపట్నం నుంచి లక్డీకపూల్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ బంజారాహిల్స్, మాదాపూర్ మార్గాల్లో రాత్రి 7 నుంచి 11గంటల వరకు వాహనదారులు నరకయాతన అనుభవించారు.
- ఉప్పల్ నుంచి నాగోలు మీదుగా ఎల్‌బీనగర్, మలక్‌పేట్ నుంచి కోఠికి వెళ్లేదారులన్నీ స్తంభించిపోయాయి.
- సచివాలయం ఎదురుగా ఖైరతాబాద్ ముద్రణాలయం వద్ద నీరు నిలవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.
- షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి చింతల్‌వరకు ట్రాఫిక్ జామ్ అయింది.
- భారీ వర్షానికి అమీన్‌పూర్ చెరువు సముద్రాన్ని తలపించింది.

సార్ రావాలి.. కారు గెలవాలని
ప్రజలు కోరుకుంటున్నారు..

(5వ పేజీ తరువాయి)

వివరించారు. రాగిడి లక్ష్మారెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకంగా మాట్లాడారు.

ప్రచారం ఎలా జరుగుతోంది..?

ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు.

మీ గెలుపునకు కలిసొచ్చే అంశాలు ఏమిటి..?

స్థానికుడిగా జనంలో కలిసిపోవడం. ఇప్పటికే స్థానికేతరులైన రేవంత్‌రెడ్డికి అప్పట్లో అవకాశం ఇచ్చి మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరోజు తమ సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రచారంలో వాపోతున్నారు. వందరోజుల కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి, బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకమే నా విజయానికి తొలిమెట్టు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపించబోతుంది.

పార్లమెంట్ పరిధిలో జనం ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటి పరిష్కారానికి మీ చర్యలు..

ప్రధానంగా మల్కాజిగిరి ప్రాంతం రైల్వేట్రాక్‌లకు మధ్యలో ఉండటంతో ఇక్కడి ప్రజలు చక్రబంధంలో ఇరుక్కున్నారు. గేటు పడితే గంటలపాటు ట్రాఫిక్‌లోనే అవస్థలు పడుతున్నారు. వాటి సమస్యకు ఆర్వోబీలు తీసుకొచ్చి పరిష్కరిస్తాం. కంటోన్మెంట్ ప్రాంతవాసులు రోడ్ల విస్తరణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం అలసత్వంతో ఏళ్లుగా ఉప్పల్ కారిడార్ పనులు నత్తనడకన సాగుతున్నాయి.


బీఆర్ఎస్ నుంచి ఇతరపార్టీల్లో చేరికలతో నష్టం లేదా..?

ప్రజల సొమ్ము దోచుకున్న అవినీతిపరులు బీజేపీ గూటికి వెళ్తే వారికి క్లీన్‌చిట్ ప్రకటిస్తుంది. వాషింగ్ పౌడర్ నిర్మా మాదిరిగా వారిని ఆదరిస్తుంది. ఎవరు ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించబోతున్నారు.

మీకు పోటీ ఎవరని భావిస్తున్నారు..?

బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ నాకు పోటీ కాదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బలంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు సీరియస్‌గా నా గెలుపు కోసం పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఒక దిష్టి బొమ్మ అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కానీ, రాష్ట్రానికి సీఎం రేవంతే పెద్ద దిష్టిబొమ్మగా మారారు. కరోనా సమయంలో కూడా ఆయన మల్కాజిగిరి ప్రజల బాగోగులపై ఆరా తీసిన దాఖలాలు లేవు.





దేశభక్తి ఉంటే ఓటు వేయండి

(5వ పేజీ తరువాయి)

బూత్‌లో వెబ్ కాస్టింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఈవీఎంలు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉందన్నారు. 1,250 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను సూక్ష్మ పరిశీలకులుగా నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఈ సందర్భంగా ప్రౌడ్ టు బి ఏ ఓటర్ స్టిక్కర్‌ను ఆవిష్కరించారు.

82 శాతం స్లిప్పుల పంపిణీ

ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ 82 శాతం పూర్తయ్యిందని రోనాల్డ్ రోస్ తెలిపారు. స్లిప్పులతో పాటు ఓటర్ గైడ్ ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్ ఇస్తున్నామని, ఇంటింటికి స్టిక్కర్ అంటిస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ రోజు బూత్ వద్ద ఓటర్ల క్యూ ఉందా అన్నది తెల్సుకునేందుకు క్యూ మేనేజ్‌మెంట్ యాప్ వినియోగించుకోవచ్చన్నారు. క్యూ యాప్‌లో పోలింగ్ కేంద్రం రూట్ మ్యాప్ కూడా చూసుకోవచ్చని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి ఎండ తీవ్రత వల్ల ఇబ్బందులు తలెత్తితే జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నుంచి సిబ్బంది వెళ్లి చికిత్స అందిస్తారని తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

దివ్యాంగుల కోసం ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్టు రోనాల్డ్‌రోస్ తెలిపారు. సాక్షం మొబైల్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకుంటే పోలింగ్ రోజు ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి తిరిగి ఇంటి వద్దకు తీసుకువస్తామన్నారు. ఇప్పటి వరకు 500 మందికిపైగా పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి 12, 13 తేదీల్లో ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తున్నామని, నిర్ణీత ప్రాంతాల నుంచి డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాల వద్దకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మహిళా సిబ్బంది ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని, వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

ఓటర్ల లెక్క..	
హైదరాబాద్	22,17,094
సికింద్రాబాద్	21,20,401
కంటోన్మెంట్	2,53,706
మొత్తం	45,91,201

పోటీ చేస్తోన్న అభ్యర్థులు	
హైదరాబాద్	30
సికింద్రాబాద్	45
కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక	15

48 గంటల ముందుగా..

పోలింగ్ గడువుకు 48 గంటల ముందు ప్రచారం ముగించాల్సి ఉంటుందని, ఈ లెక్కన 11వ తేదీన సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం చేసుకోవచ్చని రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఎండల తీవ్రత నేపథ్యంలో 13వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌కు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. ఈ నేపథ్యంలోనే 11వ తేదీన 6 గంటలకు ప్రచార గడువు ముగుస్తుందన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేంద్ర మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయితో కలిసి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ సురేంద్ర, జస్టిస్ శేషసాయి

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: పద్మారావు


బన్సీలాల్‌పేట్‌లో ఓటర్లకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు, ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు పార్లమెంట్ ఎన్నికలో తనను గెలపిస్తారని హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి. పద్మారావు అన్నారు. సనత్‌నగర్ అసెంబ్లీ పరిధిలోని బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, జీవై.కంపౌండ్, బోయగూడ తదితర ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన మంగళవా ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ విధానాలను తిరస్కరిస్తున్న ప్రజలు ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని పద్మారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి ప్రజలకు చేసింది శూన్యమన్నారు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి

బౌద్ధనగర్/చిలకలగూడ: పద్మారావుకు మద్దతుగా ఆయన తనయుడు తీగుళ్ల కిరణ్‌కుమార్ గౌడ్ బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజతో కలిసి మంగళవారం బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత డివిజన్ పరిధిలోని ఆయిల్ డిపో, రైల్వే క్వార్టర్స్ తదితదిర ప్రాంతాలలో డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆర్.కృష్ణ, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి పద్మారావును గెలిపించాలని కోరారు.

బతుకమ్మకుంటలో ఎమ్మెల్యే కాలేరు ప్రచారం

రాంనగర్: సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలో మంగళవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి పద్మారావును గెలపించాలని ఎమ్మెల్యే కాలేరు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలంతా బీఆర్ఎస్ వైపే : జైసింహ

ముషీరాబాద్: సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావును భారీమెజార్టీతో గెలిపించాలని ఆపార్టీ గ్రేటర్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహ కోరారు. ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో పద్మారావుకు మద్దతుగా రూపొందించిన ఉర్దూ కరపత్రాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం ఖాయం: జ్ఞానేశ్వర్

రాజేంద్రనగర్, మే7(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి విజయం ఖాయమైపోయిందని, మెజారిటీ కోసమే పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఉప్పర్‌పల్లిలోని సామ ఇంద్రపాల్‌రెడ్డి నివాసంలో మైలార్‌దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, నాయకులందరూ సమష్టిగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌ను గెలిపించడానికి కృషి చేయాలని జ్ఞానేశ్వర్ సూచించారు. సమావేశంలో మైలార్‌దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెల్‌పల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు. గగన్‌పహడ్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బూత్‌స్థాయి నాయకుల సమావేశంలో ఆ డివిజన్ కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బూత్‌స్థాయి నాయకులు కష్టపడి పనిచేయాలని, ఆరు గ్యారెంటీలను ప్రజలలోకి తీసుకువెళ్లి ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసేలా చూడాలని అన్నారు. ప్రతి రోజు తమకు అప్పగించిన బూత్‌లోని ప్రతి ఓటరును కలవాలని సూచించారు.


ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ డెయిరీ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటే: సబితారెడ్డి


పరిగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి పక్కన చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

పరిగి,మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం పరిగిలోని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఆ పార్టీ నేత గట్టు రాచందర్‌రావులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ అభ్యర్థుల గెలుపుపై ఉన్న శ్రద్ధ ఆ పార్టీ అభ్యర్థులపై లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలో బీజేపీ ఐదు స్థానాలలో గెలవడానికి కేసీఆర్ లోపాయియారి ఒప్పందం కుదుర్చుకున్నారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను సబిత ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీని కౌగిలించుకున్న రేవంత్‌రెడ్డి బాడాబాయి(మోదీ), చోటాబాయి(రేవంత్‌రెడ్డి) ఇద్దరు ఒక్కటేనని విమర్శించారు. రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని అందరూ అంటుంటే కనీసం ఆయన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీనిని బట్టి ఆయన పరోక్షంగా బీజేపీకి సహకరించినట్లే కదా.? అని అన్నారు. చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని సీఎం సన్నిహితులే పరోక్షంగా సహకరిస్తున్నారని, ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియకుండానే జరుగుతుందా..? అని ప్రశ్నించారు. పదేళ్ళుగా రాష్ట్రాన్ని పటించుకోని బీజేపీకి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదనప్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపంచాలని కోరారు. శాసనమండలి మాజీ ఛైర్మెన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ, కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేశారని, చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న బీసీల ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. చేవెళ్ళ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గట్టు రాంచందర్ రావు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

షాబాద్: తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం షాబాద్‌లో రోడ్‌షోలో ఆయన మాజీ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయినప్పటి నుంచి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

రాజేంద్రనగర్, మే7(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని మంగళవారం అత్తాపూర్ హుడాకాలనీ, పాండురంగానగర్ బస్తీలలో అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరాంరెడ్డి, రాజేంద్రనగర్ బస్తీలో బీఆర్ఎస్ మహిళా విభాగం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షురాలు ఎం. యాదమ్మ యాదవ్ ఆధ్వర్యంలో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటికి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని వారు కోరారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ప్రచారంలో శివకుమార్, సంతోష్, నగేశ్, గురుముఖ్ సింగ్, జైహింద్‌రెడ్డి, నర్సింహ్మా, మహేశ్ ముదిరాజ్, బంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాదీ ఏ ముస్తఫా బస్తీలో...

పహాడిషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చేసిన అభివృద్ధిని చేసిన ప్రజలు బీఆర్ఎస్ పార్టీకే ఓట్లు వేస్తారని జల్‌పల్లి మున్సిపాలిటీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ అఫ్జల్ అన్నారు. మంగళవారం వాదీ ఏ ముస్తఫా బస్తీలో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. మునీర్ మసీద్, జోహరా మసీద్, మదీనా ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటేసి కాసానిని గెలపించాలని విజ్ఞప్తి చేశారు.

బేగంబజార్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్ యాదవ్ ప్రచారం

అఫ్జల్‌గంజ్, మే 7 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గం, బేగంబజార్ డివిజన్‌లో మంగళవారం హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిద్ధంబర్ బజార్, మహేశ్వరి భవన్, బేగంబజార్ ఛత్రి, దేవీనగర్ బస్తీల్లో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ పార్టీకే ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యలే తన సమస్యలుగా భావించి అన్నివిధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

సీబీఐ అధికారులమంటూ రూ. 91.64 లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు 'మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు హవాలా డబ్బు వెళ్లింది' అని బెదిరించి నగరవాసి నుంచి రూ. 91.64 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన 74ఏళ్ల వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఫెడెక్స్ కొరియర్ సర్వీస్‌లో మీ పేరున బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు పంపిన పార్సిల్ అడ్రస్ సరిగాలేని కారణంగా తిరిగి వచ్చిందని చెప్పారు. అందులో పాస్‌పోర్టులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు, 140 గ్రాముల ఎండీఎంఏతో పాటు, 4 కిలోల దుస్తులు ఉన్నాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్‌కు అనుసంధానమైన ఖాతాల నుంచి విదేశాలకు 66.88 మిలియన్ల డాలర్ల హవాలా డబ్బు వెళ్లిందని, ఇందులో కొంత మొత్తం బ్యాంకాక్ పోలీసులు సీజ్ చేశారు.

మీపై కేసు నమోదైందని, ఏక్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశముంది' అని బెదిరించాడు. 'మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఏ మార్గాల్లో వచ్చిందో పరిశీలించి దానికి సంబంధించి సీబీఐ అధికారులు సర్టిఫికెట్ ఇస్తారు' అని చెప్పాడు. అందుకోసం 'మీ దగ్గర ఉన్న డబ్బును సీబీఐ ఖాతాకు బదిలీ చేయాలి' అని సూచించాడు. నమ్మకం కలిగించేందుకు సీబీఐ లెటర్‌హెడ్‌ను చూపించాడు. దాంతో తన ఖాతాలో ఉన్న రూ. 91.64 లక్షలు సైబర్ నేరగాడు సూచించిన ఖాతాలోకి పంపాడు. తర్వాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

చేవెళ్ల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా .. అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి


మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): 'చేవెళ్ల పార్లమెంట్ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాను.. గతంలో ఎంపీగా పనిచేసిన తాను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా, మరోసారి అవకాశం ఇవ్వండి' అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో బాగంగా ఆయన చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌తో కలిసి మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసమే పార్టీ మారానని, ప్రజలు ఆదరించి తనను మళ్లీ ఎంపీగా గెలిపిస్తే చేవెళ్ల ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని... బీజేపీ మత రాజకీయాలకు చేస్తోందని ఆరోపించారు.

చిలుకూరులో రంజిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు

మంగళవారం చిలుకూరు బాలాజీ దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని రంజిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని సుందరేశ్వరుని ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారం, కోరిన కోర్కెలుతీర్చే కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి దివ్యమైన ఆశీస్సులతో తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మలి మాణెయ్య, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, సీనియర్ నాయకులు కంజర్ల భాస్కర్, మర్రి రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మోత్కుపల్లి భాస్కర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ మండల మాజీ అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, పెద్దమంగళారం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎర్రవల్లి మల్లారెడ్డి, గ్రామ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు బొక్క దాన్‌రెడ్డి, పాటి మాధవరెడ్డి, బోలించెరువు మాధవరెడ్డి, మందడి బుచ్చిరెడ్డి, చాకలి రాజు తదితరులు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు


మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే7(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోల్డెన్‌హైట్స్ కాలనీ, హపీహోమ్స్ కాలనీలో క్రైస్తవులు, ముస్లిం మైనారిటీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలోని అన్ని వర్గాలను, అన్ని మతాలను సమానంగా ఆదరించేది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. హిందు, ముస్లింలు, క్రైస్తవుల సమాజానికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్ పలుగుచెరువు మహేశ్, నాయకులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, అనుముల జాన్‌పాల్, గంగని అరుణ్‌కుమార్, డాక్టర్ జి.విజయ భూషణం, పి.స్వర్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో మేయర్ పారిజాత ప్రచారం

పహాడిషరీఫ్: పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కోరారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మామిడిపల్లి, రంగానాయకుల కాలనీలలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు తదితరులతో కలిసి మేయర్ గడపగడపకూ పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం చేశారు.

జల్‌పల్లిలో మజ్లిస్ నాయకుల ప్రచారం

జలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సందేశ్‌నగర్, అబుబకర్ కాలనీలలో మజ్లిస్ పార్టీ సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఓమర్ బామ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. చేవెళ్లలో రంజిత్‌రెడ్డికి మజ్లిస్ పార్టీ మద్దతు ఇస్తుందని ఓమర్ చెప్పారు. ప్రచారంలో స్థానిక మజ్లిస్ కౌన్సిలర్ జఫర్‌బామ్, నాయకులు, మన్సూర్ బామ్, ఇబ్రహీం, రషీద్, అలీసారి, మొయిజ్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయుడు ఆర్యన్‌రెడ్డి ప్రచారం

ఎల్‌బీనగర్: చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆయన తనకు ఆర్యన్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డితో కలిసి ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో వారి వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజునాయక్, అక్బర్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.


ఎన్‌టీఆర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఆర్యన్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కాలం చెల్లింది: కొండా

విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన పలువురు

హైదరాబాద్ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్‌కు, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి పేర్కొన్నారు. దేశంమొత్తం మోదీ గాలీ నడుస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలో బీజేపీ 12 నుంచి 15 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ మమతాప్రవీణ్ తన అనుచరులతో కలిసి బంజారాహిల్స్‌లోని విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేవెళ్ల నియోజకవర్గం పొల్గుట్ట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ నాయకుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ...కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతోనే తాను చేవెళ్లలో రెండు లక్షల పైచిలుకు ఓట్లతో విజయం సాధించబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు పెండ్యాల నరసింహ, బడంగ్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు నీలా రవి నాయక్, శ్రవణ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్లలో కొండా విజయం తథ్యం: సంగీతారెడ్డి

వికారాబాద్: ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం తథ్యమని ఆయన సతీమణి సంగీతారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మంగళవారం వికారాబాద్ పట్టణంలో మహిళలతో ఆమె సమావేశమయ్యారు. ఎన్నికల్లో అతి ముఖ్యమైన బూత్ ఏజెంట్ల ప్రాముఖ్యత గురించి, మహిళల పాత్ర గురించి ఆమె వారితో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీకి మంచి స్పందన వస్తోందన్న సంగీతారెడ్డి, ఇంటింటికీ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి ఊహించలేనంత మద్దతు లభిస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని, ఢిల్లీలో మరోసారి ప్రధానిగా నరేంద్ర మోదీకి పట్టంగట్టాలని ప్రజలు ఎంతో పట్టుదలతో ఉన్నారన్నారు. మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న విశ్వేశ్వర్‌రెడ్డి అభివృద్ధి కోసం ఎంతో కష్టపడతారనే ప్రజల్లో ఉందని తమకు ప్రచారంలో తెలుస్తోందన్నారు. బీజేపీ మహిళల కోసం మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత, డిజిటల్ ఎడ్యుకేషన్ దిశగా చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటోందని ఆమె పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని, గెలిచిన తరువాత విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలతోనే ఉంటారన్నారు. దేశాన్ని కాపాడుకోవాలన్నా, అభివృద్ధి జరగాలన్నా అది బీజేపీతోనే సాధ్యమని గుర్తించిన ప్రజలు కమలం గుర్తుకు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు యాస్కి శిరీష, సుచరిష, తదితరులు ఉన్నారు.

డాక్టర్ జనువాడ రామస్వామికి సన్మానం

రవీంద్రభారతి, మే 7 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది పుస్తకాలు రచించిన రిటైర్డ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జనువాడ రామస్వామిను ఘనంగా సన్మానించారు. మంగళవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాటల పండుగ శీర్షికన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనువాడ రామస్వామికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ దూరదర్శన్ అనంత పద్మనాభరావు, అసిస్టెంట్ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ తెలంగాణ మినిస్ట్రీ కార్పొరేట్ అఫైర్స్ శ్రీకర్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలంగాణ ఉద్యోగుల సంఘం రిటైర్డ్ అధ్యక్షుడు పద్మాచారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం తదితరులు హాజరై జనువాడ రామస్వామిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 పుస్తకాలు రచించిన జనువాడ రామస్వామిని సత్కరించుకోవడం సంతోషకరమని అన్నారు. సమాజహితం కోరే వారిని గుర్తించి గౌరవించుకోవడం అభినందనీయమని అన్నారు. సభకు ముందు జరిగిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. చక్కటి స్వరాలతో గాయకులు మైమరిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


జనువాడ రామస్వామిని సత్కరిస్తున్న అతిథులు

అక్కినేని నాగేశ్వరరావు ఈతరం యువతకు ఆదర్శప్రాయులు

రవీంద్రభారతి, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు చలన చిత్రరంగంలో చిరస్థాయిగా పేరుప్రఖ్యాతలు సంపాదించిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు ఈతరం యువతకు ఆదర్శప్రాయులని వక్తలు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని సంస్థ ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి, ఆత్రేయ 102వ జయంతి సందర్భంగా అక్కినేని ఆత్రేయ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, రచయిత పి.రాజేంద్రకుమార్‌లకు అక్కినేని ఆత్రేయ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ హైకోర్టు పూర్వన్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనరెడ్డి హాజరై పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్కినేని, ఆత్రేయల జయంతి వేడుకలు నిర్వహించడం ఆనందకరమని అన్నారు. మహనీయులను స్మరించుకుంటూ వారి పేరిట అవార్డులను అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ఎస్వీ రామరావు, లంక లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సుద్దాల అశోక్‌తేజ, రాజేంద్రకుమార్‌లను సత్కరిస్తున్న అతిథులు

కార్మికుల పిల్లల కోసం 'క్రెచ్'

- ప్రారంభించిన క్రెడాయ్ హైదరాబాద్

హైదరాబాద్ సిటీ, మే7 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు క్రెడాయ్ హైదరాబాద్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. క్రెడాయ్ కేర్స్ కార్యక్రమంలో భాగంగా కార్మికుల పిల్లలకు పని ప్రదేశాల్లోనే ఆటవిడుపు కోసం క్రెచ్‌ను ఏర్పాటు చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని పరీరక్షించడానికి అనంత రిహాబ్‌తో కలిసి హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వీ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పన రంగంగా నిర్మాణరంగం ఉందని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు నగరంలో పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్.జైదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ.జగన్నాథరావులతో పాటు క్రెడాయ్ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిపై హాస్టల్ నిర్వాహకుల దాడి

- స్నేహితుడిని తీసుకు రావడంపై ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువకుడు

అమీర్‌పేట, మే 7 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న యువకుడి కోసం వచ్చిన స్నేహితుడిపై హాస్టల్ నిర్వాహకులు బూతులు తిట్టడంతో పాటు ఇద్దరిపై దాడిచేశారు. ఈ ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పల్నాడు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన సయ్యద్ ఆసిఫ్, బీటెక్ పూర్తిచేసి నగరానికి వచ్చాడు. ఎస్ఆర్ నగర్‌లోని శ్రీబాలాజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్నాడు. ఆదివారం ఆసిఫ్ స్వగ్రామం నుంచి అతడి స్నేహితుడు జహీర్ వచ్చి హాస్టల్‌లోకి వెళ్లి ముఖం కడుక్కుని బయటకు వస్తున్నాడు. ఆ సమయంలో హాస్టల్ నిర్వాహకుడు కొత్త వాళ్లను లోపలికి ఎందుకు తీసుకువచ్చావని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తల్లిని సంబోధిస్తూ తీవ్ర పదజాలంతో తిట్టాడు. తల్లిని ఎందుకు తిడుతున్నావని ఆసిఫ్ వారిని ప్రశ్నించగా, ఆగ్రహానికి లోనైన నిర్వాహకుడు, అతడి కుటుంబీకులు మూకుమ్మడిగా ఆసిఫ్‌పై దాడి చేశారు. నడిరోడ్డుపైకి తీసుకువచ్చి అందరి ముందు ఇద్దరు యువకులను చితకబాదారు. ఈ సంఘటన చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బాధితుడు ఆసిఫ్ తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3i1IZ6xలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

పహాడిషరీఫ్ మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేసిందని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) అన్నారు. కౌన్సిలర్ బుధుమల యాదగిరి ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందని 100 మంది బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో షేక్ జహంగీర్, మస్నా రవికుమార్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిన వరద.. స్తంభించిన రాకపోకలు

రాజేంద్రనగర్, మే7(ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతోపాటు జోరు వాన కురువడంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో అత్తాపూర్ నుంచి పీడీపీ చౌరస్తా వెళ్లే మార్గంలో ఉప్పర్‌పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. సుమారు గంటసేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి త్వరితగతిన చర్యలు తీసుకున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.గోపయ్య తెలిపారు. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి తదితరులు

స్నేహితుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాజేంద్రనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం కమిషన్ పంపకాల్లో తేడా రావడంతో కక్ష పెంచుకుని స్నేహితుడిని హత్యచేసిన కేసులో నిందితుడు మహ్మద్ అంజద్‌ఖాన్(40)ను అత్తాపూర్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. అతని నుంచి కత్తి, హోండా యాక్టివా స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఎస్.ఐ శ్రీనివాస్‌లతో కలసి వివరాలను వెల్లడించారు.

హసన్‌నగర్, ఇంద్రానగర్, ఎన్టీఆర్‌నగర్ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ మక్బూల్ అలియాస్ అహ్మద్(60), ఎన్.మనోజ్‌కుమార్, అబ్రార్ షరీఫ్, మహ్మద్ అంజద్‌ఖాన్‌లు స్నేహితులు. వీరు నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఇటీవల విక్రయించిన ఇంటి స్థలాలకు సంబంధించి కమీషన్ పంపకాల్లో తేడా రావడంతో మహ్మద్ అంజద్‌ఖాన్ మిగతా ముగ్గురు స్నేహితులపై కక్షపెంచుకున్నాడు. పంపకాలు సరిగా చేసి డబ్బు ఇవ్వమని అడిగితే చులకన చేసి మాట్లాడడంతో మక్బూల్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 4న ఇంద్రానగర్ బస్‌స్టాప్ వద్ద కాంగ్రెస్ రోడ్‌షో ఉండగా, ఆ ప్రాంతంలో మక్బూల్‌తోపాటు మనోజ్‌కుమార్, అబ్రార్ షరీఫ్ కూర్చుని ఉన్నారు. అంజద్‌ఖాన్ తన వెంట తెచ్చుకున్న కత్తితో మక్బూల్‌పై వెనకనుంచి దాడిచేసి నాలుగు సార్లు కత్తితో పొడిచాడు. అడ్డువచ్చిన మనోజ్‌కుమార్‌ను గాయపరిచి పారిపోయాడు. మక్బూల్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మక్బూల్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం సాయంత్రం మహ్మద్ అంజద్‌ఖాన్‌ను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమిని గెలిపించాలి

● హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమిని గెలిపించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ కోరారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకే కోవకు చెందినవని ఆయన ఆరోపించారు. మోదీ మూడవ సారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడమే కాక రిజర్వేషన్లను రద్దు చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఓటు నీడ్ గ్యారంటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సోగార బేగం ఆధ్వర్యంలో ఇండియా కూటమికి మద్దతు తెలుపుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బీజేపీ భావజాలం గాడ్సే భావజాలమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఎం. నాగరాజు, వీఎన్‌జీవో ఉపాధ్యక్షురాలు స్నేహరెడ్డి, ఏఐఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇస్మాయుద్దీన్, ఆర్ఎస్పీ ప్రధాన కార్యదర్శి జానకిరాములు, వెంకటేష్ ఇంద్రవల్లి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జన్‌సేవా సంఘ్ అధ్యక్షుడు ఆర్. పి. సింగ్

వలస కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి


బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని జన్‌సేవా సంఘ్ డిమాండ్ చేసింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జన్‌సేవా సంఘ్ అధ్యక్షుడు ఆర్.పి. సింగ్, ప్రధాన కార్యదర్శి రాజీవ్‌రంజన్ చౌబే, కోశాధికారి బినిత్ కుమార్‌సింగ్, ఉపాధ్యక్షులు గోవింద్‌తివారి, సలహాదారులు మదన్‌లాల్ రావాల్‌లు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. అవినీతి నిర్మూలించే పార్టీలకే ఓటు వేయాలని కోరారు. తాము చేపట్టే ర్యాలీలకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. ఈ నెల 8న సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి మలకోపేట వరకు ఓటు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

'మనూ'లో ఎంసీజే కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)లో ఎంసీజే కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంసీజే హెచ్‌ఓడీ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ తెలిపారు. ఎంసీజేలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, పబ్లిక్ రిలేషన్స్, డిజిటల్ మీడియా, వీడియో ప్రొడక్షన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెరిట్ బేస్‌లో సీట్ల కేటాయింపు ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ లేదా 9966058101 నంబర్‌పై సంప్రదించాలని కోరారు.

13న జూపార్కుకు సెలవు

మదీన, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13వ తేదీన జూపార్కుకు సెలవు ప్రకటిస్తున్నట్లు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరేమత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న జూపార్కు మూసి ఉంటుందని, మరుసటి రోజు యథావిధిగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో తెరిచి ఉంటుందన్నారు.



జూపార్కు

జీహెచ్ఎంసీకి ట్రైనీ ఐఏఎస్‌లు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో అమలు చేస్తోన్న పథకాల అధ్యయనానికి శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లు మంగళవారం నగరానికి వచ్చారు. గ్రేటర్‌లో అభివృద్ధి పనులు, అమలు చేస్తోన్న పథకాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిషనర్ రోనాల్డ్‌రోస్ వారికి వివరించారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, నిర్మాణ రంగ వ్యర్థాల నిర్వహణ, ఆస్తి పన్ను ఆదాయం తదితర విషయాలను వారికి తెలియజేశారు.

సీఎంఆర్ లెగసీ ఆఫ్ జువెలరీలో అక్షయతృతీయ వేడుకలు

● మే 12 వరకు అద్భుతమైన ఆఫర్లు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ లెగసీ ఆఫ్ జువెలరీ మే 12 వరకు అక్షయ తృతీయ బంగారు వేడుకలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వినియోగదారులకు అద్భుతమైన ఆఫర్లు అందిస్తోంది. ప్లెయిన్ జువెలరీపై తరుగు 3 శాతం నుంచి 9 శాతం (ఇంతకు వించి తరుగు లేదు), యాంటిక్- స్టోన్- రోజ్‌గోల్డ్- విక్టోరియన్ జువెలరీపై ఫ్లాట్ 14శాతం, సాదా వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని సీఎంఆర్ యాజమాన్యం తెలిపింది. డైమండ్ జువెలరీ రూ.49,900 మాత్రమేనని ఈ అవకాశాన్ని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఈ ఆఫర్లు అన్ని బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్నాయని, అక్షయతృతీయ అడ్వాన్స్ బుకింగ్ ద్వారా నచ్చిన బంగారు ఆభరణాలను ముందుగానే బుక్ చేసుకోవచ్చన్నారు. బుక్‌చేసిన రోజు రేటు, లేదా డెలివరీ తీసుకునే రోజు రేట్ ఏది తక్కువ ఉంటే ఆ ధరకు ఆభరణాలు కొనుగోలు చేయవచ్చన్నారు.





వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి ఆదేశం

వర్షాకాల ప్రణాళికలు సిద్ధం చేయాలి

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో తాగునీరు, మురుగునీటి నిర్వహణపై వర్షాకాల ప్రణాళికలు సిద్ధం చేయాలని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ఎంసీసీ ఫిర్యాదులు, చలివేంద్రాల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ట్రిప్పుల సంఖ్య పెంచాలని, ఎంసీసీ ఫిర్యాదులపై దృష్టి సారించాలని అన్నారు. అలాగే వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫిర్యాదులపై ఆరా తీశారు. కలుషిత నీటి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మరోవైపు వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు సమస్యాత్మకమైన ప్రాంతాల్లో రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, అవసరమైతే సంబంధిత ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటనలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, వీఎల్ ప్రవీణ్ కుమార్, స్వామి, రవి కుమార్, సీజీఎంలు, జీఎంలు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్పుపై బీజేపీ సమాధానం చెప్పాలి

● ప్రొఫెసర్ హరగోపాల్

పంజాగుట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు వక్తలు ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేయాలని, ప్రశ్నించే వారి హక్కులు హరించివేయాలని చూస్తుందన్నారు. రాజ్యాంగాన్ని నమ్మని వారు ఆర్ఎస్ఎస్, నక్సలైట్లు, తీవ్రవాదులేనని, హిందూ సమాజాన్ని చీల్చినదే మనువాదులని అన్నారు. అసమ్మతి అనేది లేకపోతే దేశం నియంతృత్వం వైపు పోతుందని అన్నారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ప్రధాన కార్యదర్శి సాధిక్ అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'భారత రాజ్యాంగం-హక్కులు- రిజర్వేషన్లు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉంటుందా లేదా.. అనేది చెప్పాలని అన్నారు. రిజర్వేషన్లపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుందని, 2024 తర్వాత రాజ్యాంగాన్ని రక్షించే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని అన్నారు. ఉద్యమాల ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని అన్నారు. సీనియర్ సంపాదకులు కే.రామచంద్రమూర్తి మాట్లాడుతూ యువతలో మోదీ వ్యామోహం పెరుగుతోందని, అది చాలా ప్రమాదమని అన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను రక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చుతారని, రిజర్వేషన్లు తీసివేస్తారని రాహుల్ గాంధీ... మార్చమని బీజేపీ అంటున్నాయని, ఇందులో ఎవరిది నిజమని ప్రశ్నించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ దేశంలో రిజర్వేషన్లకు పొగబెట్టే పనిచేస్తోందని ఆరోపించారు. సమావేశంలో ప్రొఫెసర్ కాశిం, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, కాంగ్రెస్ నాయకుడు సంగిశెట్టి జగదీష్, వివిధ సంఘాల నాయకులు వి.చిన్న శ్రీశైలంయాదవ్, సొగరా బేగం, మన్నారం నాగరాజు, సినీ దర్శకుడు రఫీ, జర్నలిస్టులు జయసారధి రెడ్డి, వేదిక కోశాధికారి సురేష్, విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

బీజేపీ గెలిచే 400 స్థానాల్లో

హైదరాబాద్ ఉండాలి

అఫ్జల్‌గంజ్, మే7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ గెలిచే 400 స్థానాల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కూడా ఉండాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ ప్రజలను కోరారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా మంగళవారం బేగంబజార్ ఛత్రీ చౌరస్తా నుంచి ఓపెన్ టాప్ జీపులో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బర్తన్‌బజార్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. గోషామహల్ నియోజకవర్గం నుంచి 100శాతం పోలింగ్ జరిగేలా చూడాలని, మాధవీలతను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్, బీజేపీ శాసనసభాపక్ష నాయకులు జి.శంకర్‌యాదవ్, గోషామహల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, అవినాష్‌దేవ్డా, రామకృష్ణ పాల్గొన్నారు.



బేగంబజార్‌లో జరిగిన రోడ్‌షోలో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఎంపీ అభ్యర్థి మాధవీలత తదితరులు

బీసీల డిమాండ్లపై ప్రకటన చేయకుంటే..

ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీసీల డిమాండ్లపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతనే రాష్ట్రానికి రావాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమం చేపట్టి ఎంపీ ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి రాగానే పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, జనగణనలో కులగణన చేస్తామని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పిస్తామని ఇండియా కూటమి ఇచ్చినటువంటి హామీలను ప్రధాని మోదీ కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై స్పష్టత ఇవ్వకుండా ఈనెల 10న హైదరాబాద్‌కు వస్తే ప్రధాని మోదీని బీసీ సంక్షేమ సంఘం పక్షాన అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంలు మాట్లాడుతూ బీసీల డిమాండ్లపై స్పష్టమైన ప్రకటన చేసిన ఇండియా కూటమికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సదస్సులో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, గొరిగె మల్లేష్, సి. రాజేందర్, నర్సింహగౌడ్, రామకృష్ణ, శారదాగౌడ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

మాదిగలను దగా చేస్తున్న మందకృష్ణమాదిగ

● ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): మాదిగలను దగా చేస్తున్న మందకృష్ణమాదిగ, రాజ్యాంగాన్ని రద్దు చేస్తామన్న బీజేపీకి ఎలా మద్దతు ఇస్తారని ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం ప్రశ్నించింది. సెక్యులరిజంను కాపాడడానికి దళితులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్. గాలి వినోద్‌కుమార్, తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్, ఎస్సీ, ఎస్టీ నేషనల్ మేధావుల ఫోరం ఉపాధ్యక్షుడు సి.బి. ప్రసాద్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీహరి, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్. ఆర్. మోహన్ తదితరులు మాట్లాడారు. మోదీ, మందకృష్ణ మాదిగలను మాదిగజాతి నమ్మేస్థితిలో లేదని వారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

మెడలో ముంత కట్టుకుని నిరసన

ఆనాడు దళితులను ఏ విధంగా కించపరిచారో వివరిస్తూ హెచ్.ఆర్. మోహన్ మెడకు ముంత కట్టుకుని చెప్పులు చేతపట్టుకుని పంచకట్టుతో వినూత్న నిరసన తెలిపారు. విలేకరుల సమావేశంలో పాల్గొన్న మోహన్ ఆనాడు దళితులు ఇంటి నుంచి బయటకు వస్తే రోడ్డుపై ఉమ్మివేయవద్దని మనువాదుల ఆంక్షలు ఉండేవని, ప్రస్తుతం మోదీ ప్రభుత్వం మనువాదం వైపు తీసుకెళ్తున్నారని ఆరోపిస్తూ ఈ నిరసన వ్యక్తం చేశారు.

నగరం.. సగం అంధకారం

(5వపేజీ తరువాయి)

తెగిపడటంతో కొద్దిసేపు కరెంట్ నిలిచిపోయింది. కొల్లూర్ గేటు వద్ద నార్సింగ్ ఫీడర్ 33 కేవీ విద్యుత్‌వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. ఈదురుగాలులకు హైదర్‌గూడలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. రోడ్ నంబర్ 12 బంజారాహిల్స్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు విరిగిపడింది. మంగళవారం నుంచి భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా.. దానికి తగినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గంటపాటు కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో 6-7 గంటలు విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, స్థానిక విద్యుత్ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించలేదని పలువురు ఆరోపించారు. 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు వేల సంఖ్యలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.



వర్షంలో పరుగులు పెడుతున్న మహిళలు

ప్రహరీ కూలి.. నలుగురికి గాయాలు

దుండిగల్, మే 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి బాచుపల్లి రేణుక ఎల్లమ్మకాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం ప్రహరీగోడ కూలి నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రహరీగోడ కూలి మట్టిపెల్లలు పడటంతో స్థానికంగా పక్కనే ఉన్న నలుగురు గాయపడ్డారు. గాయాలకు గురైన వారిని స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నేడు జైలులో క్రిశాంక్‌తో కేటీఆర్ ములాఖత్

సైదాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌ను బుధవారం ఉదయం 11 గంటలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించనున్నారు. ఈ మేరకు ములాఖత్ కోసం జైలు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్ మార్ఫింగ్ చేసి వైరల్ చేసిన కేసులో క్రిశాంక్‌ను ఓయూ పోలీసులు ఈ నెల 1న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై మాధవీలత ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధినేత, హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల ఈసీకి ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై ఒవైసీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్‌కు తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ సమర్పించిన అఫిడవిట్‌ను మరోసారి పరిశీలించాలని కోరారు. ఈ మేరకు ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జనార్ధన్ రెడ్డితో కొండా విశ్వేశ్వర్ రెడ్డి భేటీ

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత బి. జనార్ధన్‌రెడ్డితో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో భేటీ అయ్యారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీచేసిన జనార్ధన్‌రెడ్డి 2 లక్షలకు పైగా ఓటు బ్యాంకు సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. 13న జరిగే ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి సహకరించాలని కోరారు. గతంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన అనుభవం తనకు ఎంతో ఉపయోగ పడుతుందని, అన్ని విధాలుగా తనకు సహకరించి గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఆయనను కోరారు. జనార్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. విశ్వేశ్వర్‌రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కూడా ఉన్నారు.

పకడ్బందీగా వీవీ పాట్‌లకు సీల్

ఖైరతాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): కంట్రోల్ యూనిట్‌లతో పాటు వీవీ పాట్ యూనిట్లను పకడ్బందీగా, పారదర్శకంగా సీల్ చేసి ఉన్నతాధికారుల ముందు ఉంచుతున్నారు. గతంలో వీవీ పాట్‌లలో ఈసీఐఎల్‌కు చెందిన నిపుణులు సాఫ్ట్‌వేర్‌ను లోడ్ చేసి వెళ్లేవారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో వీవీ పాట్‌లలో సాఫ్ట్‌వేర్‌లను ఎక్కించి వాటికి సీల్ వేసి పారదర్శక బాక్స్‌లో ఉంచి ఎన్నికల అధికారులకు అప్పగించనున్నారు. ఇప్పటికే సింబల్ లోడింగ్ పూర్తయిన వీవీ పాట్‌లను పార్టీల ఏజెంట్ల ముందు సీల్ వేసి ప్రత్యేక బాక్స్‌లలో ఉంచగా వాటిని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల ఉన్నతాధికారులకు అప్పగించనున్నారు. కాగా, ఈ వీవీ పాట్‌లను ఎన్నికలు పూర్తయిన 40 రోజుల వరకు సురక్షితంగా ఉంచుతామని, ఎలాంటి అనుమానాలు లేకుంటే వాటిలో ఎక్కించిన సాఫ్ట్‌వేర్‌ను ఇంజనీర్ల ద్వారా తొలగింపజేస్తామని అధికారులు తెలిపారు. ఈవీఎం యంత్రాల్లో కమిషనింగ్ పూర్తయిన అనంతరం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఉన్న స్ట్రాంగ్‌రూంను అధికారులు ఈఆర్‌వో సమక్షంలో సీల్ వేశారు. అక్కడ పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టారు.



స్ట్రాంగ్‌రూంకు సీల్ వేస్తున్న సికింద్రాబాద్ ఈఆర్‌వో హేమంత్, అధికారులు

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

హిమాయత్ నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఈ దేశం మనది.. నాయకులను ఎన్నుకునే హక్కు మనది.. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్విసూర్య కోరారు. బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మికి చెందిన వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెట్స్ ఓట్ క్యాంపెయిన్ పేరుతో నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాల మైదానంలో మ్యూజికల్ ప్రోగ్రాం నిర్వహించారు.. ఇందులో తేజస్వి పాల్గొని విద్యార్థుల ను ఉత్సాహ పరిచారు. మోదీ నీ మరోసారి ప్రధానిని చేయడానికి అందరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పటికే మొదలైన వర్షంలోనూ విద్యార్థులు, యువతీ యువకులు కేరింతలు కొడుతూ రెయిన్ డాన్సులతో ఎంజాయ్ చేశారు.



అవగాహనా కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య

దోశలు వేస్తూ.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..

● ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసమే.. ● చిరిపిరెడ్డి రమేష్

చాదర్‌ఘాట్, మే 7(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యల కోసం ఓ యువకుడు నడుం బిగించాడు. వారి సమస్యలు ఏ అధికారి, ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడంతో ఏకంగా అతను పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగాడు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. తన పోటీతోనైనా ఫుట్‌పాత్ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపుతారని ఆశిస్తున్నట్లు చిరిపిరెడ్డి రమేష్ తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ గ్రామానికి చెందిన రమేష్ ప్రస్తుతం చైతన్యపురిలోని రామాలయం వద్ద అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అతను 17ఏళ్ల వయస్సులో ఉండగా తండ్రి చనిపోయాడు. దీంతో ఆర్థిక సమస్యలతో డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్ చదువును అర్థాంతరంగా వదిలేశాడు. నగరానికి వచ్చి చైతన్యపురి బస్టాప్ ఎలో వద్ద టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసి ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. కానిస్టేబుల్, ఎస్ఐ రాత పరీక్షలకు పోటీ పడినా కొద్ది మార్కుల తేడాతో అర్హత సాధించ లేకపోయాడు. ఏడేళ్ల గా టిఫిన్ సెంటర్ నడుపుతున్న అతనికి కొత్త సమస్య ఏర్పడింది. కొత్తపేట పాత ఫ్రూట్‌మార్కెట్‌కు వచ్చే పండ్ల వాహనాల రాకపోకలను నిషేధించడంతోపాటు చైతన్యపురి నుంచి ఎల్‌బీనగర్ వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను నెల రోజుల క్రితం ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా తొలగించారు. ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలను అధికారులుగాని, ప్రజా ప్రతినిధులుగానీ పట్టించుకోలేదు. దీంతో తన లాంటి ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలను ఎలాగైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకురావాలనుకున్నాడు. తాజాగా వచ్చిన పార్లమెంట్ ఎన్నికలను అస్త్రంగా వాడుకోవాలని భావించాడు. ఈ నేపథ్యంలోనే మల్కాజిగిరి నుంచి స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా పోటీకి దిగినట్లు రమేష్ తెలిపాడు. ఫుట్‌పాత్ వ్యాపారుల కుటుంబీకులతోపాటు హోటల్ కార్మికుల, మాస్టర్స్ యూనియన్, ఆటో కార్మికుల యూనియన్ల మద్దతు తనకే ఉందని చెబుతున్నాడు.



దోశలు వేస్తూ..



ప్రచారంలో చిరిపిరెడ్డి రమేష్

తొమ్మిది రోజుల వ్యవధిలో

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

● మొదట తల్లి, కొద్ది రోజుల వ్యవధిలో ఇద్దరు కొడుకుల మృత్యువాత

● శంషాబాద్‌లో విషాదం

శంషాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణ సిద్ధాంతిబస్తీలో తొమ్మిది రోజుల వ్యవధిలో ఒకే కుటుంబానికి ముగ్గురు మృతిచెందారు. దీంతో స్థానికంగా విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. టీఎం టైలర్స్‌గా పేరున్న ఈ కుటుంబంలో టి.పద్మమ్మ(65) ఏప్రిల్ 27న అనారోగ్యంతో చనిపోయింది. ఆమె దశదినకర్మకు ఏర్పాట్లు చేస్తుండగానే పెద్ద కొడుకు టి.మల్లేష్(48) అనారోగ్యానికి గురయ్యాడు. అతడికి ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. ఈనెల 4న గుండెపోటుతో అతను మృతిచెందాడు. కుటుంబంలో చోటుచేసుకున్న ఈ పరిణామంతో దిగ్భ్రాంతికి గురైన పద్మమ్మ మరో కొడుకు శ్రీనివాస్(40) ఈనెల 6న అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబీకులు అతడిని ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. సోమవారం రాత్రి శ్రీనివాస్ కూడా మృతిచెందాడు. ఇలా ఒకే కుటుంబంలో వరుసగా ముగ్గురు మృతిచెందడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



అబ్ కీ బార్?

రిజర్వేషన్లు ఎత్తేస్తామన్న బీజేపీనే ఎత్తేయాలి



ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామన్న బీజేపీనే ఎత్తేయాలి. బీసీలకు రిజర్వేషన్లు పెంచి వారి జీవితాలను మెరుగుపరిచే లక్ష్యంతో కాంగ్రెస్ ఉంటే.. ఉన్న రిజర్వేషన్లు ఎత్తేసి ప్రజలను అంధకారంలోకి నెట్టేందుకు బీజేపీ కుట్రలు చేస్తోంది. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే లీటరు పెట్రోల్ ధర రూ.300కు చేరినా ఆశ్చర్యం లేదు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టే పార్టీలను తరిమికొట్టాలి. లౌకిక స్ఫూర్తి ప్రదర్శించే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలి.

\- నాంపల్లి రోడ్ షోలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

బీఆర్ఎస్ ఓ విఫల పార్టీ!

» కాంగ్రెస్ ఐదు గ్యారెంటీల అమలుకు

ఐదు రాష్ట్రాల బడ్జెట్లు కావాలి: తమిళిసై



హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఒక విఫల పార్టీ అని, కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలు అమలు కావాలంటే ఐదు రాష్ట్రాల బడ్జెట్లు కావాలని తెలంగాణ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఒక బలమైన పార్టీ అని బీఆర్ఎస్‌గా మారాక అది ఓ విఫల పార్టీగా నిలిచిపోయిందని అభిప్రాయపడ్డారు. తాను తెలంగాణ ఆడబిడ్డనని, ఈ రాష్ట్ర ప్రజలతో తన అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో తమిళిసై విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గవర్నర్ వ్యవస్థను అవమానించారని, ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపించారు. తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని వచ్చినా కేసీఆర్ నాడు దూరంగా ఉన్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్య శ్రీ పథకం మెరుగని నాడు కేసీఆర్ వాదించేవారని గుర్తుచేశారు. తమిళనాడులో ఆయుష్మాన్ భారత్ ఎలా విజయవంతమయ్యిందో తాను ఆయనకు వివరించానని చెప్పారు. ఆ తర్వాతే ఆయన తెలంగాణాలో ఆయుష్మాన్ భారత్ అమలుకు ముందుకు వచ్చారని చెప్పారు. అమలుకాని హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. దివంగత నేత, మాజీ ప్రధాని వాజ్‌పేయి కూడా రిజర్వేషన్లను వ్యతిరేకించారని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యను తమిళిసై ఖండించారు. వాజ్‌పేయి 2001 డిసెంబరు 19న చేసిన ప్రసంగంలో రిజర్వేషన్లు కొనసాగించాలని అన్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇంతకుముందు మతాలను విభజించి రాజకీయం చేసిందని, ఇప్పుడు కులాల మధ్య విభజన చిచ్చుపెట్టి రాజకీయం చేస్తోందని తమిళిసై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'పట్టభద్రుల' స్థానానికి మరో 14 నామినేషన్లు

» బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి నామినేషన్

నల్లగొండ, మే 7: వరంగల్ - ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, అలయన్స్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అభ్యర్థిగా ఈద శేషగిరిరావు, యువతరం పార్టీ అభ్యర్థిగా బండారు నాగరాజు, తెలంగాణ సకల జనుల సమ్మె పార్టీ అభ్యర్థిగా నందిపాటి జానయ్య నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఐతగోని రాఘవేంద్ర, పైడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, అల్వాల కనకరాజు, మారం వెంకటరెడ్డి, గుగులోతు బీమా, పెంచల శ్రీనివాస్, కంటె సాయన్న, దైద సోమ సుందరం నామినేషన్లు వేశారు. రేపటితో నామినేషన్ల గడువు ముగియనుంది.

గట్టిగా పనిచేయండి.. నిర్లక్ష్యం వద్దు

ఇవి దేశం దిశ, దశ మార్చే ఎన్నికలు.. ఉత్తరాదిన బీజేపీ పని అయిపోయింది

దక్షిణాదిలోనూ ఆ పార్టీని కట్టడి చేయాలి

ఇండియా కూటమిదే అధికారం

తెలంగాణపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి

పనితీరును బట్టే పదవులు ఉంటాయి

పార్టీ నేతలకు కేసీ వేణుగోపాల్ దిశానిర్దేశనం

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశం దిశ, దశ మార్చే ఈ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గట్టిగా పని చేయాలని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు. బయట ప్రచారం జరుగుతున్నట్లుగా కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ పార్టీకి ఆదరణ పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో ఎంపీ స్థానాల గెలుపుపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయని, దానికి అనుగుణంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పనితీరును బట్టే పదవులు ఉంటాయన్న సంకేతాన్నీ ఇచ్చారు. మంగళవారం పార్టీ ఎంపీ అభ్యర్థులు, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో కేసీ వేణుగోపాల్ ఢిల్లీ నుంచి జూమ్ ద్వారా సమావేశమయ్యారు.



సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. బీజేపీ బలంగా ఉందంటున్న ఉత్తరాది రాష్ట్రాల్లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయని, ఆ పార్టీ పూర్తిగా బలహీనపడిందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఆ పార్టీని పూర్తి స్థాయిలో కట్టడి చేయగలిగితే ఇండియా కూటమిదే అధికారం అని పేర్కొన్నారు. అలసత్వం ప్రదర్శించకుండా పోల్ మేనేజ్‌మెంట్‌పై అందరూ దృష్టి పెట్టాలని, పోలింగ్ బూత్ కేంద్రీకృతంగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ రోజున పార్టీ సానుభూతిపరుల ఓట్లను ముందుగా వేయించాలని, పోలింగ్ శాతం పెరిగేట్లుగా చూసుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన చోట.. గతంలో కంటే ఎక్కువ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలే ఆ బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు.

సమావేశానికి హాజరుకాని నేతలపై ఆరా!

లోక్‌సభ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోని పార్టీ నేతలపై కేసీ వేణుగోపాల్ సీరియస్ అయ్యారు. సమావేశానికి మంత్రి దామోదర రాజనర్సింహ సహా 15 మంది ఎమ్మెల్యేలు, పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జులు హాజరు కాలేదు. అయితే ఇంత కీలకమైన సమావేశానికి చాలా మంది నేతలు హాజరు కాలేదంటే.. ఎన్నికల పట్ల వారు ఎంత సీరియస్‌గా ఉన్నారో అర్థం అవుతోందంటూ వేణుగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు ఇలా జరిగిందంటూ టీపీసీసీ సంస్థాగత కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ప్రశ్నించారు. సమావేశం గురించి ఆలస్యంగా సమాచారం అందడంతో అందరూ పాల్గొనలేకపోయారంటూ మహేష్‌కుమార్‌గౌడ్ వివరణ ఇచ్చారు. దీనిపై తనకు నివేదిక ఇవ్వాలంటూ కేసీ వేణుగోపాల్ ఆయనకు సూచించారు. కొంత మంది ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు కూడా ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని పనిచేయట్లేదంటూ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ప్రచారం పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆయన నియోజకవర్గంలోనే ఉండి.. పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపుపై దృష్టి పెట్టాలని సూచించారు. అయితే తన సిటింగ్ సీటు భువనగిరితో పాటు నల్లగొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ తదితర నియోజకవర్గాలకూ సమయం కేటాయించాల్సి వస్తున్నందున సికింద్రాబాద్‌కు ఎక్కువగా సమయం కేటాయించలేకపోతున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వివరణ ఇచ్చారు.

బీజేపీకి ఓటేస్తే.. రిజర్వేషన్ల రద్దు

» ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆ పార్టీని ఓడించాలి

» బీజేపీకి కేసీఆర్ వత్తాసు సిగ్గుచేటు: భట్టి



హైదరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తొలగించి.. వాళ్లను బానిసలుగా మార్చే ప్రయత్నం బీజేపీ చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో పొరపాటున ఆ పార్టీకి ఓటేస్తే.. ఆయా వర్గాలకు భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా చూసే బాధ్యత 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద వర్గాలపై ఉందన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం భట్టి మీడియాతో మాట్లాడారు. జనగణన చేపట్టి రిజర్వేషన్లతో పాటు వనరులు, సంపద, రాజ్యాధికారంలో ఈ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం వాటా కల్పిస్తామని రాహుల్‌గాంధీ చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయాయని.. బీజేపీకి కేసీఆర్ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 ఎంపీ స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఏడాది మే మొదటి వారంతో పోలిస్తే ఈసారి విద్యుత్తు డిమాండ్ 52.9% పెరిగిందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 47.6% పెరుగుదల నమోదైందని చెప్పారు. విద్యుత్తు కోతలు ఉన్నట్లు ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేయడం తగదన్నారు.

'రైతుభరోసా'కు ఈసీ బ్రేక్!

అప్పటికే దాదాపుగా పూర్తయిన నగదు బదిలీ

రైతుభరోసా అందాల్సింది 2.86%మందికే

వీరంతా ఎక్కువ విస్తీర్ణం భూమిని కలిగి ఉన్నవారు

ఈ రైతులకు 14 నుంచి నగదు బదిలీ చేసే చాన్స్

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతాంగానికి 'రైతుభరోసా' పేరిట నిధులను విడుదల చేయడంపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మంగళవారం ఆంక్షలు విధించింది. 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆ ప్రక్రియ పూర్తయ్యాకే నిధులు విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. కానీ.. ఈసీ ఆదేశాలు వచ్చేసరికే రైతు భరోసా కింద నగదుబదిలీ దాదాపుగా (97 శాతం మేర) పూర్తికావడం గమనార్హం. రైతుభరోసా చెల్లింపులు మే 9లోపు పూర్తిచేస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా చెప్పారని.. ఆయన వ్యాఖ్యలు మీడియాలో కూడా వచ్చాయని పేర్కొంటూ ఎన్. వేణుకుమార్ అనే వ్యక్తి ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్.. రైతు భరోసాకు సంబంధించి గతంలో నిర్దేశించిన షరతులను ఉల్లంఘించినట్లు గుర్తించామని పేర్కొంది. టీపీసీసీ చీఫ్, ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న సీఎం రేవంత్.. రైతు భరోసా పంపిణీపై మాట్లాడి ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లు స్పష్టమైందని పేర్కొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావు బహిరంగంగా మాట్లాడటంతో ఈ నిధుల పంపిణీకి బ్రేక్ పడిన విషయాన్ని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఈసీ ఆదేశాల మేరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అధికారిక గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 29 నాటికి రాష్ట్రంలో 64,75,319 మంది రైతులకు ఈ పథకం కింద సర్కారు రూ.5,574 కోట్లకు పైగా నగదును బదిలీ చేసింది. ఈ నెల ఆరో తేదీన మళ్లీ ఈ పథకం కింద నగదు బదిలీని పునః ప్రారంభించిది. 3,27,505 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.986.42 కోట్ల నగదు జమ చేసింది. మంగళవారం కూడా కొందరు రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యింది. ఈలోగా ఈసీ బ్రేక్ వేసింది. మొత్తంమీద ఇప్పటివరకు 68,02,824 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.6,561.19 కోట్లకు పైగా నగదు జమ అయింది. ఇంకా సుమారు 2 లక్షల మంది రైతులకు (అంటే 2.86 శాతం మందికి) రైతు భరోసా వేయాల్సి ఉంటుంది. వీరంతా ఎక్కువ విస్తీర్ణంలో భూమిని కలిగి ఉన్న కేటగిరీ రైతులు. వీరికి కూడా రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే నిధులు సర్దుబాటు చేసింది. కానీ, ఈసీ ఆంక్షల నేపథ్యంలో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. లేకపోతే బుధవారానికే రైతుభరోసా పంపిణీ పూర్తయ్యేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో.. 14వ తేదీ నుంచి వీరికి రైతుభరోసా నిధులు అందే అవకాశం ఉంది.

కుర్‌కురే బీజేపీ.. కిరికిరి కాంగ్రెస్

» ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలి

» హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని బీజేపీ భావిస్తోంది

» టీవీలో రేవంత్ మాటలను కుటుంబంతో కలిసి చూడలేం

» సికింద్రాబాద్ రోడ్‌షోలో కేటీఆర్



అంబర్‌పేట రోడ్‌షోలో కేటీఆర్

హైదరాబాద్ సిటీ/బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): 'కుర్‌కురే బీజేపీ.. కిరికిరి కాంగ్రెస్ ఓ పక్క.. తెలంగాణ కోసం పేగులు తెగేదాక కొట్లాడిన బీఆర్ఎస్ ఒక పక్క ఉన్నయి. రాష్ట్ర ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్, బీజేపీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌పై పట్టు దొరకని బీజేపీ.. ఎన్నికల తర్వాత నగరాన్ని ఢిల్లీ తరహాలో కేంద్రపాలిత ప్రాంతం చేయాలని చూస్తోందని, దీనిని అడ్డుకోవాలంటే లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలన్నారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి టీ పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలోని తిలక్‌నగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ ప్రసంగించారు. 'ఇవి ప్రధానమంత్రికి సంబంధించిన ఎన్నికలు కదా.. బీఆర్ఎస్ గెలవడం ఎందుకని కొందరంటున్నరు. గతంలో ఐదు మంది ఎంపీలతో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్నే తీసుకొచ్చారు. ఆ విషయం గుర్తుంచుకోవాలి. తెలంగాణకు గులాబీ జెండానే శ్రీరామరక్ష' అని చెప్పారు. ఐదేళ్లలో కిషన్‌రెడ్డి అంబర్‌పేటకు చేసిందేమిటని.. ఒక గుడి కట్టిండా? బడి కట్టిండా? ఆయనకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. టీవీల్లో సీఎం రేవంత్ రెడ్డి మాటలను కుటుంబసభ్యులతో కలిసి చూసే పరిస్థితి లేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ హామీల అమలుపై విమర్శలు గుప్పిస్తూ, రూ.లక్షన్నర నగదు, తులం బంగారం బాకీ ఉన్నవ్.. ఇయ్యకపోతే ఆడపిల్లలు నీ లగ్గం చేస్తారని రేవంత్‌ను హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు 10-12 సీట్లు ఇస్తే.. ఆరు నెలల్లో కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారన్నారు. అంబర్‌పేటలో రోడ్ షో జరుగుతుండగానే వర్షం కురవటంతో వానలోనే ప్రసంగించిన కేటీఆర్.. ఖైరతాబాద్ రోడ్ షోను రద్దు చేసుకున్నారు.

తెలంగాణకు ఏమిచ్చారు..?

ప్రధాని మోదీకి కేటీఆర్ ప్రశ్నల వర్షం

"తెలంగాణకు ఇచ్చిన హామీలను ఎందుకు మరిచారు..? పదేళ్లలో ప్రధానిగా ఈ రాష్ట్రానికి ఏం చేశారో చెప్పి ఓట్లు అడగండి.." అంటూ ప్రధాని మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రధాని రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. "ఒక్క సాగునీటి ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టును ఎందుకు బొందపెట్టారు..? కాంగ్రెస్ సర్కారు పాపానికి నేతన్నలు బలైపోతున్నా.. తెలంగాణ వైపు ఎందుకు కన్నెత్తి చూడటం లేదు..? 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏం చేశారు..? తెలంగాణలో ప్రజా చైతన్యం ఎక్కువ. రెచ్చగొట్టే రాజకీయాలకు ఇక్కడ ఓట్లు పడవు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

అసమర్థులు రాజ్యమేలుతున్నారు

» పాలకులకు అభివృద్ధి చేతకావడం లేదు

» కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే: కేసీఆర్



నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పకోడి తింటున్న కేసీఆర్


కామారెడ్డి/మెదక్/రామాయంపేట, మే7 (ఆంధ్రజ్యోతి): "అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో అసమర్థులు.. తెలివితక్కువ వారు రాజ్యమేలుతున్నారు. మోదీలాంటి అసమర్థుడి పాలన వల్ల అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠ మంటగలిసింది. రూపాయి విలువ తగ్గిపోయింది. పదేళ్ల బీజేపీ పాలనలో అభివృద్ధి లేదు. మోదీ ఇచ్చిన 150 హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అంటూ దేశాన్ని సత్యనాశ్ చేశాడు. రాష్ట్రంలో అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తెలివితక్కువతనంతో సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదు" అని బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన బస్సు యాత్ర కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని చేరుకోగా.. నిజాంసాగర్ చౌరస్తా నుంచి భారీ రోడ్‌షో నిర్వహించారు. జేపీఎన్ చౌరస్తా వద్ద.. రాత్రి మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. "మోదీతో దేశంలో ఎలాంటి అభివృద్ధి లేదు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా అమలుకు నోచుకోలేదు. జన్‌ధన్ యోజనలో పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని.. కామారెడ్డిలో బీజేపీ గెలిస్తే రూ.30 లక్షలు వేస్తానని చెప్పారు. ఆ మొత్తం మీ ఖాతాల్లో వేశారా?" అని ప్రజలను కేసీఆర్ ప్రశ్నించారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టడం, మతరాజకీయం తప్ప.. బీజేపీకి అభివృద్ధి, పేదల సంక్షేమం పట్టదని ఆరోపించారు. "ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఖాయమని మోదీ, బీజేపీ ప్రతినిధులు చెబుతున్నారు. సీట్లేమో కానీ, మోదీ మళ్లీ వస్తే.. పెట్రోల్ ధరలు రూ.400కు పెరగడం గ్యారెంటీ" అని అన్నారు. ఎన్డీయేకు 200 సీట్లు కూడా దాటవని, కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రైతు భరోసాను ఆపించింది కాంగ్రెస్సే

బీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసిందని కేసీఆర్ విమర్శించారు. కరెంటు కోతలు ప్రారంభమయ్యాయని, తాగునీటి సరఫరా బంద్ అయిందని విరుచుకుపడ్డారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ సర్కారు లూటీలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని మిగిలిన రైతులందరికీ రెండురోజుల్లోగా రైతుభరోసా నిధులను జమచేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కుట్రలు చేసి, ఎన్నికల కమిషన్‌కు తమవారితోనే ఫిర్యాదు చేయించి, రైతు భరోసాను ఆపించారని కేసీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రెప్పపాటు కాలం కూడా కరెంటు పోలేదన్నారు. రేవంత్‌రెడ్డి కొత్త జిల్లాలను తొలగిస్తానంటున్నారని, కామారెడ్డి జిల్లా ఉండాలా? వద్దా? అని ప్రజలను కేసీఆర్ ప్రశ్నించారు. మెదక్ కార్నర్ మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. మెదక్ జిల్లానూ రద్దుచేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, కేసీఆర్ కామారెడ్డి నుంచి మెదక్ వెళ్తుండగా.. రామాయంపేటలో స్థానిక బ్రిడ్జి వద్దకు కాన్వాయ్ రాగానే పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డంగా పడుకుని ఆపాలని కోరారు. ఓ నిమిషం పాటు కాన్వాయ్ ఆగినప్పటికీ కేసీఆర్ మాత్రం సమయం లేదంటూ.. బస్సు దిగకుండానే అభివాదంచేస్తూ ముందుకు సాగారు.

నవ్య | చిత్రజ్యోతి

రూ. 8 కోట్లు 12 రోజులు



నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. సంయుక్త, నభానటేశ్ కథానాయికలు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. తాజా షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రబృందం తెరకెక్కిస్తోంది. 12 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్ కోసం చిత్రబృందం రూ. 8 కోట్లు ఖర్చు చేస్తోంది. రెండు భారీ సెట్స్‌ను రూపొందించారు. వియత్నాంకు చెందిన ఫైటర్లతో పాటు 700 మంది ఆర్టిస్టులు ఈ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నిఖిల్ బరిలోకి దిగేముందు ఆసక్తిగా జనాలను గమనిస్తున్న లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

డీమానిటైజేషన్.. వందల కోట్లు



డీమానిటైజేషన్ నేపథ్యంలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'హండ్రెడ్ క్రోర్స్'. రాహుల్, చేతన్, యమీ, సాక్షి చౌదరి కీలక పాత్రలు పోషించారు. విరాట్ చక్రవర్తి దర్శకత్వంలో దివిజా కార్తిక్, సంగీతం దర్శకుడు సాయికార్తిక్ నిర్మాతలు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకులు వీరశంకర్, మల్లిక్ రామ్, నిర్మాతలు హర్షిత్ రెడ్డి, దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సాయికార్తిక్ మాట్లాడుతూ 'డీమానిటైజేషన్‌లో వందలాది కోట్ల రూపాయల చుట్టూ తిరిగే కథ ఇది. సినిమా బాగా వచ్చింది. పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అన్నారు.

బాహుబలి చరిత్రలో కొత్త అధ్యాయం



ఎస్ఎస్ రాజమౌళి

ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన 'బాహుబలి' ఫ్రాంచైజీలో వచ్చిన చిత్రాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు 'బాహుబలి' చిత్రం ఆధారంగా 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' పేరుతో ఓ యానిమేషన్ సిరీస్ రూపుదిద్దుకుంది. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియా వర్క్స్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, రాజమౌళి, శరత్ దేవరాజన్, శోభు యార్లగడ్డ నిర్మించారు. జీవన్ జే కాంగ్, నవీన్ జాన్ దర్శకత్వం వహించారు. ఈ నెల 17 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఈ సిరీస్ స్ట్రీమ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో రాజమౌళి మాట్లాడుతూ "బాహుబలి' ఫ్రాంచైజీకి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. ఈ సిరీస్‌తో బాహుబలి చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ విజయాన్ని కొనసాగించాలని ఉన్నా నా ప్రమేయం లేకుండా బాహుబలి కథ చెప్పడమా అనిపించింది. ఆ సందిగ్ధావస్థలో ఉన్నప్పుడే శరద్ దేవరాజన్ కలిశారు. తన అంకితభావంతో ఈ యానిమేషన్ సిరీస్‌ను అద్భుతంగా మలిచాడు' అని ప్రశంసించారు. శరద్ దేవరాజన్ మాట్లాడుతూ 'రాజమౌళితో పనిచేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. మాహిష్మతి వెనుక ఉన్న కథలు, రహస్యాలు, ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తాయ'న్నారు.

ఆలోచించి ఓటు వేయండి



ఎన్నికల సమయం దగ్గర పడుతోంది. రాజకీయ పార్టీలు ప్రజలను ఆకట్టుకోవడానికి రకరకాల మార్గాలు వెదుకుతున్నాయి. ఓట్లు కొనేసి తర్వాత ప్రజలకు మంచి చేయని రాజకీయ నాయకులను నమ్మవద్దు, గొరిల్లా కాకుండా మనిషిలా ఆలోచించి ఓటు వేయండి అంటూ చెబుతున్నారు 'కమిటీ కుర్రోళ్లు'. నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నుంచి 'గొరిల్లా..' అంటూ సాగే పాటను రాజకీయ ప్రముఖుడు జయప్రకాశ్ నారాయణ విడుదల చేశారు. నాగ్ అర్జున్‌రెడ్డి రాసిన ఈ పాటకు అనుదీప్ దేవ్ స్వరాలు అందించారు. ఈ సినిమాతో యదు వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మాతలు. చక్కని పాట రాసిన గీత రచయితను జయప్రకాశ్ నారాయణ అభినందించారు. భవిష్యత్ గురించి ఆలోచించి ఓటు వేయాలని యువతను ఆయన ఈ సందర్భంగా కోరారు. మంచి ప్రయత్నం చేసిన 'కమిటీ కుర్రోళ్లు' టీమ్‌ను ఆయన అభినందించారు.

'నా పేరు మార్చుకుంటాను' అని సవాల్ చేశా

అల్లు అర్జున్



"ఇడియట్ సినిమా చూసి, 'ఇలాంటి సినిమా మనకు పడుద్దా' అనుకున్నాను. 'ఆర్య' కథ వినగానే 'దిసీజ్ మై ఇడియట్' అనే ఫీలింగ్ కలిగింది. రిలీజయ్యాక నాన్న 'టెన్ వీక్స్ సినిమా' అంటే నేనూ, సుకుమార్ ఉడికిపోయాం. 'ఆర్య' సినిమాకు 125 డేస్ షీల్డ్ తీసుకోకపోతే నా పేరు మార్చుకుంటాను' అని ఆ క్షణమే నాన్నతో సవాల్ చేశా. దాన్ని నిజం చేస్తూ చిరంజీవి గారి చేతుల మీదుగా షీల్డ్ అందుకొని నా మాట నిలబెట్టుకున్నాను' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన 'ఆర్య' చిత్రం విడుదలై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా '20 ఏళ్ల ఆర్య' పేరుతో మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో రీ యూనియన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ మాట్లాడుతూ 'లైఫ్‌లో నాకు ఫస్ట్ సక్సెస్ అంటే ఆర్యనే. మళ్లీ అలాంటి సక్సెస్ నాకు దక్కలేదు. 'గంగోత్రి' సక్సెస్ అయింది. అయినా నేను చూడడానికి అంత గొప్పగా ఏం లేనని హీరోగా అవకాశాలు రాలేదు. అలా ఒక ఏడాది ఖాళీగా కూర్చున్నాను. 'దిల్' చిత్రం ప్రివ్యూకు వెళితే, అక్కడ నన్ను చూసి సుకుమార్ కథ చెప్పారు. నాకు మైండ్ బ్లోయింగ్ అనిపించింది. కొత్తవాళ్లని నమ్మి దిల్‌రాజు గారు డబ్బులు పెట్టి, రిస్క్ చేశారు. ఆయన లేకపోతే మేము ఎవ్వరం లేము. సుకుమార్‌కు దర్శకుడిగా తొలి చిత్రం కావడంతో ఆయన ఈ సినిమాను తీయగలరా? లేదా అనే సందేహం నాన్నకు వచ్చింది. అప్పుడు వివి వినాయక్ గారు 'ఆ కుర్రాడు (సుకుమార్) తీయగలడు. మీరు ముందుకెళ్లండి' అని భరోసా ఇచ్చారు. చిరంజీవి గారు కూడా కథ విని 'బాగుంది' అని సపోర్ట్ చేశారు. ఆయన చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నాను. 'ఆర్య'తో దిల్‌రాజు పెద్ద నిర్మాతగా ఆవిర్భవించారు. ఇండియాలో నంబర్ వన్ డైరెక్టర్ స్థాయిలో సుకుమార్ ఉన్నారు. మమ్మల్ని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు రుణపడి ఉంటాను' అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ "ఆర్య' సినిమాతో ఎంతోమంది జీవితాల్లో అద్భుతం జరిగింది. మరే ఇండస్ట్రీలోనూ ఇలాంటి ఈవెంట్ జరగలేదు. 'ఆర్య' కోసం తొలుత రవితేజ, ప్రభాస్‌ను కలిశాం. చివరకు బన్నీతో కుదిరింది. సుక్కు కథను చెబుతుంటే బన్నీ ఒక్కో సీన్‌ను రాసుకున్నాడు. అరవింద్ గారిని కూడా ఒప్పించాడు. మేకింగ్ విషయంలో సుకుమార్‌తో గొడవ పడేవాణ్ణి. ఓసారి మూడు రోజులు ఇద్దరం మాట్లాడుకోలేదు. మేం అందరం పాన్ ఇండియా స్థాయిలో సక్సెస్ అవుతున్నాం అంటే 'ఆర్య' ఇచ్చిన సక్సెస్ కారణం' అని చెప్పారు. సుకుమార్ మాట్లాడుతూ 'దిల్‌రాజు సినిమా చేద్దామని మాట ఇచ్చారు గానీ అవకాశం ఇస్తారనుకోలేదు. బన్నీకి కథ చెప్పాక నన్ను తన కారులో మా ఆఫీసు దగ్గర దింపాడు. అరవింద్ గారికి మళ్లీ మళ్లీ కథ చెప్పలేక వెనక్కి వెళ్లి మళ్లీ లెక్చరర్‌గా చేరుదాం అనుకున్నాను. అరవింద్ గారు చెబితే చిరంజీవి గారికి కథ చెప్పాను. 20 నిమిషాలు టైమ్ ఇచ్చారు. కానీ 3 గంటలు విన్నారు. 'సినిమా హిట్ ముందుకెళ్లండి' అన్నారు. ఒక్క మాంటేజ్ షూట్ కోసం దిల్‌రాజు కాళ్లు పట్టుకున్నాను. సినిమా బాగా రావడానికి కనీసం మూడుసార్లు అలా చేసి ఉంటాను' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఆర్య' టీం ఇవ్వాళ్టికీ టాప్‌లో ఉంది. ఏదో దైవిక శక్తి ఆ సినిమా విషయంలో అందరినీ ముందుకు నడిపించింది. ఇంత మంచి చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది' అన్నారు.

దళితులంతా ఇండియా కూటమికి మద్దతివ్వాలి

» టీపీసీసీ ఎస్సీ సెల్ నేతలు

రాంనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కొనసాగింపు కోసం ఇండియా కూటమికి రాష్ట్రంలోని దళితులంతా మద్దతివ్వాలని టీపీసీసీ ఎస్సీ సెల్ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ అడిక్‌మెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఎస్సీ సెల్ నేతలు జీ.ఎస్. కేశవ్, గజ్జెల సూర్యనారాయణ, శివప్రసాద్ జగన్, పులిరాజు మాట్లాడారు. రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెబుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని వారు కోరారు. ఇండియా కూటమికి దేశవ్యాప్తంగా ప్రజలు మద్దతిస్తున్నారని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని.. మోత్కుపల్లి నర్సింహులుపై పోలీసులకు ఫిర్యాదు

చాదర్‌ఘాట్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులుపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్‌తో కూడిన బృందం మంగళవారం మలకోపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఫిర్యాదు పత్రాన్ని ఆయన మలక్‌పేట నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, చక్రపాణి, రాహుల్‌సింగ్, ఎండీ షకీల్, షాహిద్‌ఖాన్ మహేష్‌కుమార్‌లతో కలిసి మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు అందజేశారు. ప్రజలు ఎన్నుకొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఏక వచనంతో పిలిచి అనుచిత వ్యాఖ్యలతో అవమానించేలా మాట్లాడడం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని, ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెకొలేకర్ శ్రీనివాస్ ఇన్‌స్పెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయ సలహా తీసుకున్న తర్వాత కేసు నమోదు చేస్తామని మలకోపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ముస్లింల మద్దతు కాంగ్రెస్‌కే

» హైదరాబాద్‌లో మాత్రం మజ్లిస్‌కేనని వెల్లడి

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తారని యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రకటించింది. హైదరాబాద్‌లో మాత్రం మజ్లిస్ గెలుపునకు కృషి చేస్తామని వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లో ముస్లిం ఫోరం అధ్యక్షుడు సాదిక్ మోహిద్దీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో లోకసభ ఎన్నికల్లో ముస్లింలు అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ముస్లింలు రాష్ట్రంలోని 16 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటారని, హైదరాబాద్‌లో మాత్రం మజ్లిస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తారని సాదిక్ మోహిద్దీన్ వెల్లడించారు. ఈ సమావేశంలో యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రతినిధులు మౌలానా అక్బర్ నిజాముద్దీన్, జామలర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ వర్సెస్ తెలంగాణ

అటు మోదీ.. ఈ పక్కన మీ రేవంత్.. ఈ ఫైనల్స్‌లో ఎవరు గెలుస్తారో చూద్దాం

» బిడ్డ బెయిల్ కోసం కేసీఆర్ వరంగల్ సీటును బీజేపీకి తాకట్టు పెట్టారు.. 2 పార్టీలూ ఒక్కటే

» ఢిల్లీ సుల్తాన్లను ఓడించిన పౌరుషాలగడ్డ ఇది

» హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌నూ అభివృద్ధి చేస్తా.. ఎన్నికల ప్రచారంలో రేవంత్



వరంగల్ రోడ్‌షోలో మాట్లాడుతూ రాష్ట్రానికి మోదీ ఇచ్చింది ఇదీ అంటూ గాడిదగుడ్డు బొమ్మను చూపుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య

వరంగల్, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "డిసెంబర్‌లో గెలిచింది సెమీ ఫైనల్సే. ఇప్పుడున్నవి ఫైనల్స్ అసలు కథ ఇప్పుడు మొదలైంది.. తెలంగాణ వర్సెస్ గుజరాత్.. ఎవరు గెలుస్తారో చూద్దాం.. ఫైనల్లో ఆ పక్కన నరేంద్రమోదీ, అమిత్‌షా.. ఈ పక్కన మీ అన్న ఉన్నడు.. రాహుల్‌గాంధీ ఉన్నడు.. మే 13న జరగబోయే దంగల్‌లో.. ఫైనల్‌లో.. గుజరాత్ టీమ్‌ను డకౌట్ చేసి చిత్తు చిత్తుగా ఓడించాల్సిన బాధ్యత మన మీద ఉన్నది" అని టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్వేగభరితంగా వ్యాఖ్యానించారు. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి హనుమకొండ చౌరస్తా, వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగుల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'వాన పడ్డా, ఉరుములు ఉరివినా, పిడుగులు పడ్డా మీ దగ్గరకు ఎందుకు వచ్చినా అంటే.. రేపు జరగబోయేవి ఎన్నికలు కావు.. పోరాటం కాదు.. రేపు జరగబోయేది యుద్ధం. అందులో వరంగల్ బిడ్డలు నా పక్కన నిలబడాలి.. ఈ యుద్ధంలో గెలవాలి.. గుజరాత్‌ను ఓడించాలి.. అప్పుడే కాకతీయుల పౌరుషం మనం చూపించినోళ్లం అయితాం' అని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తాన్లను ఆనాడు కాకతీయ సామ్రాజ్యం తిప్పి కొట్టిందని, వారిపై గెలిచిన పౌరుషం కాకతీయుల బిడ్డలదని.. ఢిల్లీ సుల్తాన్లను ఓడించడానికి, ఎర్రకోట మీద మూడు రంగుల జెండా ఎగరేయడానికి ప్రతి కార్యకర్తా సైనికుడిలా మారాలని రేవంత్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చని బీజేపీకి ఓటెందుకు వేయాలని రేవంత్ ప్రశ్నించారు. వాటిని నెరవేర్చకుండా ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని ఈ ప్రాంతానికి వస్తున్నారని నిలదీశారు. మోదీకి రాష్ట్రమన్నా, దేశమన్నా గుజరాతే అని దుయ్యబట్టారు. బుల్లెట్ ట్రైన్.. సబర్మతీ రివర్ ఫ్రంట్.. టెంపుల్ సిటీ.. అన్నీ గుజరాత్‌కేనని, తెలంగాణకు వచ్చిన పరిశ్రమలనూ మోదీ తన రాష్ట్రానికే తరలించుకుపోతున్నారని.. తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డేనని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదని, అవి ఒక్కటేనని.. కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టేందుకు రెండు పార్టీలూ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. అందుకే.. వరంగల్‌లో బీఆర్ఎస్ నేతనే బీజేపీలోకి పంపించి టికెట్ ఇప్పించారని, బీఆర్ఎస్ నుంచి డమ్మీ అభ్యర్థిని బరిలో దించి బీజేపీని గెలిపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిడ్డ బెయిల్ కోసం వరంగల్ సీటును కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టాడని ఆరోపించారు. కారు రిపేరుకు పోయిందని కేటీఆర్ అంటున్నారు గానీ.. కారు పోయింది తుక్కుకు తూకానికని.. ఇది గ్రహించే కేసీఆర్ బస్సులో తిరుగుతున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. మే 9 నాటికి రైతుభరోసా పూర్తిచేస్తానని తాను కేసీఆర్‌కు సవాల్ చేస్తే.. దాన్ని అడ్డుకోవాలంటూ బీజేపీ, బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు చేశారని నిప్పులు చెరిగారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలప్పుడు.. ఓటర్లు పోలింగ్ బూత్‌లకు పోతుంటే రైతుబంధు నిధులు రైతుల ఖాతాలో జమ చేశారని రేవంత్ గుర్తుచేశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల వేళ రైతుల ఖాతాలో డబ్బులు వేస్తేనేమో బీజేపీ వాళ్లకు సంతోషమైందని, అప్పుడు అడ్డుకోలేదని గుర్తుచేశారు. ఇప్పుడు తాము రైతు భరోసా నిధులు వేయకుండా ఈసీ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. ఈ ద్వంద్వ నీతి, దొంగ నీతి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి చేస్తున్న కుట్ర అనే విషయం తెలంగాణ రైతులకు తెలుసునన్నారు. హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని రేవంత్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



ఖమ్మం రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న హీరో వెంకటేశ్

కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించండి

» ఖమ్మంలో హీరో వెంకటేశ్ రోడ్‌షో

» భారీగా తరలివచ్చిన అభిమానులు

ఖమ్మం, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "భద్రాచలంలో శ్రీరాముడున్నాడు.. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల బరిలో రఘురాముడున్నాడు.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి" అని సినీహీరో వెంకటేశ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, కాంగ్రెస్‌కు 'విక్టరీ' అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా తన వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి నిలవడంతో ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తూ వెంకటేశ్ మంగళవారం ఖమ్మంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, సీపీఎం, సీపీఐ నాయకులతో కలిసి మయూరి సెంటర్ నుంచి వైరా రోడ్డు మీదుగా జడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 6-10గంటలకు ప్రారంభమైన ర్యాలీ రాత్రి 8గంటల వరకు సాగింది. ఈ క్రమంలో జడ్పీసెంటర్ చౌరస్తాలో హీరో వెంకటేశ్ ప్రసంగించారు. రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి లోక్‌సభకు పంపించాలని కోరారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రఘురాంరెడ్డి విజయం కోసం కాంగ్రెస్, వామపక్షాల నేతలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు.



వాకర్స్‌ను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్న కావ్య కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల అభివృద్ధి

» రేవంత్‌కు గాడిద గుడ్డులా కనిపిస్తోంది

» ఏమీ దొరక్క.. ఏదో ఒకటి ప్రచారం: కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్/బర్కత్‌పుర/రాంనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణలో జరిగిన అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డికి కనిపించడం లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డికి ఏమీ దొరక్క ఏదో ఒకటి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన రూ.పది లక్షల కోట్ల అభివృద్ధి రేవంత్‌కు గాడిద గుడ్డులా కనిపిస్తోందని అన్నారు. రేవంత్ స్థాయిని మరచి, దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. భారత్ కీర్తి ప్రతిష్ఠలను తారస్థాయికి తీసుకెళ్లిన ఘనత ప్రధాని మోదీదని చెప్పారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న భారత దేశం వైపు ప్రపంచ దేశాలన్నీ చూస్తున్నాయని అన్నారు. దేశంలో 2014 ముందు వరకు పెద్ద ఎత్తున ఉగ్రదాడులు జరిగేవని.. మోదీ ప్రధాని అయిన తర్వాత ఒక్క దాడికి కూడా ఆస్కారం లేకుండా చేశారని పేర్కొన్నారు. దేశంలో ఐఎస్‌ఐని సమూలంగా నిర్మూలించారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో డబుల్ డిజిట్ స్థానాలు సాధిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

ప్రచారంలో దూసుకుపోతున్న కావ్య కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డి విజయం కోసం ఆయన సతీమణి కావ్య రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాలనీ సంఘాలు, అపార్ట్‌మెంట్ వాసులు, మహిళా పొదుపు సంఘాలు, క్రీడాకారులు, వాకర్లు తదితరులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కావ్యకిషన్‌రెడ్డి ఇప్పటికే సికిందరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి, రెండో విడత ప్రచారాలు ముగించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్మన్‌గా ఉన్న ఆమె.. కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తూ సికిందరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 20 వేల మంది మహిళలు, యువతులకు శిక్షణ ఇప్పించారు. మహిళలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు.

రైతు భరోసా డబ్బులిస్తే అడ్డుకున్నారు:మంత్రి పొన్నం

హైదరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ దుష్ట రాజకీయాలకు రైతులు బలవుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. ఆ పార్టీల స్వార్థ రాజకీయాల కోసం రైతుల నోట్లో మట్టి కొట్టాయని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి పోతే.. రూపాయి రూపాయి కూడబెట్టి రైతు భరోసా నిధులు వేశామని తెలిపారు. డబ్బులు పడుతున్నాయని రైతులు సంతోష పడేలోపే ఈసీని అస్త్రంగా చేసుకుని బీజేపీ నిధులను ఆపే కుట్ర చేయడం బాధాకరమన్నారు. ఈ కుట్రలను అన్నదాతలు అర్థం చేసుకున్నారని, ఆ పార్టీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

మెదక్ సహ ఇన్‌చార్జ్‌గా జగ్గారెడ్డి నియామకం

మెదక్ లోక్‌సభ నియోజక వర్గ సహ ఇన్‌చార్జ్‌గా టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి.. మహబూబ్‌నగర్ నియోజకవర్గ సహ ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నియమించింది. చేవెళ్లకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్‌కు మరో ఎమ్మెల్యే కె. మదన్‌మోహన్‌రావును సహ ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. ఈ మేరకు నియామకాలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మంగళవారం ప్రకటించారు. అయితే ఈ నియామకాలు గత నెల 17నే జరిగాయి. మరో వారంలో పోలింగ్ జరగనుండగా ఈ నియామకాలను ప్రకటించడం గాంధీభవన్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

అవినీతి, ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా?

» కాంగ్రెస్‌కు ఎక్స్‌పైరీ డేట్ వచ్చింది: సంజయ్



భగత్‌నగర్, మే 7: అవినీతి, ఆస్తిపాస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. కరీంనగర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే తనపై కాంగ్రెస్ నాయకులు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని బండి అన్నారు. తన ఆస్తిపాస్తులపై సీబీఐ విచారణ కోరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మీ ఆస్తి, అవినీతి, బినామీ ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. విచారణ కోసం తాను సీబీఐకి లేఖ రాసేందుకు సిద్ధమని, పొన్నం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ నేతలు తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పెద్ద డ్రామా ఆర్టిస్టు అని ఆయన్ను, ఆయన కుటుంబాన్ని అరెస్టు చేయకుండా ఉండేందుకు సీబీఐ రాష్ట్రంలోకి అడుగు పెట్టకుండా ఉత్తర్వులు ఇచ్చి తాను సుద్దపూసనని, మోదీ అరెస్టు చేసేందుకు కుట్ర చేస్తున్నారని చెబుతున్నారన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. అవినీతి, కుంభకోణాలు, వారసత్వ పాలనతో దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌కు ఎక్స్‌పైరీ డేట్ వచ్చిందన్నారు. జాతీయ కాంగ్రెస్ కాస్తా రెండు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు. వేములవాడకు రానున్న మోదీ సభను విజయవంతం చేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 8 గంటలకు వేములవాడ రాజన్న ఆలయానికి చేరుకుని దర్శించుకుంటారన్నారు. వేములవాడ బాలానగర్ కోర్టు వద్ద మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.

కేసీఆర్ తప్పులు చెప్పగలిగింది నేనొక్కణ్నే.. అందుకే గెంటేశారు!

బీఆర్ఎస్ హయాంలో మంత్రులకు గౌరవం లేదు

» మమ్మల్ని మనుషులుగా కూడా గుర్తించేవారు కాదు

» కారు, కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయింది


» 'మీట్ ది ప్రెస్'లో ఈటల

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం కేసీఆర్ చేసింది తప్పు అని చెప్పగలిగిన ఏకైక మంత్రి తానేనని.. అందుకే తనను బయటకు గెంటేశారని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఇక్కడ సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్‌ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అప్పట్లో హౌసింగ్ పాలసీ మీద ఒక కమిటీ వేశారని.. తాను, కడియం శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు తదితర మంత్రులు ఆ కమిటీలో సభ్యులుగా ఉన్నామని.. కానీ, తమ కమిటీ రిపోర్టు ఇవ్వకముందే హౌసింగ్ పాలసీని కేసీఆర్ డిక్లేర్ చేసేశారని ఈటల వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్‌కు మంత్రులంటే ఏ మాత్రం గౌరవం లేదని.. తమను కనీసం మనుషులుగా కూడా గుర్తించేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కేసీఆర్ గుప్పిట్లోనే ఉన్నా.. తన భూముల విషయంలో చేసిన ఆరోపణలు నిజం కాదు కాబట్టే, ఆయన తనను ఏమీ చేయలేకపోయారని ఈటల గుర్తుచేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతో పాటు, కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని.. ప్రజలు బీజేపీనే నమ్ముకున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు గుర్తుపట్టట్లేదని.. వారిద్దరూ తనకసలు పోటీయే కాదని వ్యాఖ్యానించారు. అయితే.. తనను ఎలాగైనా మల్కాజిగిరిలో ఓడించాలని ప్లాన్ చేస్తున్నారని.. కానీ, ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, వారిది అంత సంకుచిత మనస్తత్వం కాదని ఈటల విశ్వాసం వ్యక్తం చేశారు. ఏ సర్వే సంస్థలకూ అందని ఫలితం మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో రాబోతోందని జోస్యం చెప్పారు. ఇక.. ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి తన గత వైఖరి మార్చుకుంటారని భావించామని, కానీ ఆయన ఏమాత్రం మారలేదని.. ఆయన అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకిచ్చిన ఏ హామీనీ సరిగ్గా నెరవేర్చలేదని ఈటల అసంతృప్తి వెలిబుచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అంత హడావుడి చేసి, ఏ చర్యలూ తీసుకోలేదని.. కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నారని.. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కూడా చర్యలు లేవని విమర్శించారు. "కేసీఆర్ విఫలమవడానికి చాలా సమయం పట్టింది. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలలు గడవక ముందే ప్రజల నమ్మకాన్ని కోల్పోయారు" అని వ్యాఖ్యానించారు.



ఫేక్ వీడియోలతో జాగ్రత్త..

తాను మల్కాజిగిరి ప్రజలను తక్కువ చేసి మాట్లాడినట్టుగా ఒక వీడియో సర్క్యులేట్ అవుతోందని ఈటల రాజేందర్ ఆందోళన వెలిబుచ్చారు. కానీ, ఇన్నేళ్లుగా తనను చూస్తున్న ప్రజలు ఆ ఫేక్ వీడియోను నమ్మరని.. కృత్రిమ మేధ సాయంతో ఇలాంటి వీడియోలు సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అలాగే.. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేయబోతోందంటూ కూడా మార్ఫింగ్ వీడియోలతో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాగా.. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఓటర్లు డబ్బులకు లొంగుతారని ఈటల అన్నట్టుగా ఓ ఫేక్ వీడియోను సర్క్యులేట్ చేస్తున్నారంటూ బీజేపీ నేతలు సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి కారకులైన కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

రుణమాఫీ.. రేవంత్ చేసి చూపిస్తారు

ఆయన మాట ఇస్తే తప్పరు.. దుబ్బాక రైతులకు నాదీ గ్యారెంటీ

దుబ్బాక నుంచి 50 వేల మెజార్టీ ఇవ్వండి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

దుబ్బాక, మే 7: రైతులందరికీ ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారని, దైవసాక్షిగా కూడా ప్రమాణం చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. రుణమాఫీ విషయంలో గతంలో కేసీఆర్ రెండుసార్లు మోసం చేశారని, ఇపుడు సీఎం రేవంత్ కచ్చితంగా పంద్రాగస్టులోగా రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుంటారని, తాను కూడా మాటిస్తున్నానని చెప్పారు.సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తా నుంచి దుబ్బాక వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఖజానానంతా కేసీఆర్ ఖతం చేశారని, లేదంటే రుణమాఫీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిపోయేదని చెప్పారు. దుబ్బాక ప్రజలకు తాను మాట ఇస్తున్నానని, రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకుంటారని పేర్కొన్నారు. అధికారికంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అయినా.. అధికారం చెరుకు శ్రీనివాస్‌రెడ్డిదేనని అన్నారు. దుబ్బాక ప్రజలు, వ్యాపారులు ఆలోచించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు 50 వేల మెజార్టీ అందిస్తే, దుబ్బాక అభివృద్ధికి తాను గ్యారెంటీ అని భరోసా ఇచ్చారు. కేసీఆర్‌తో ఇప్పుడు ఏ పనీ కాదని, హరీశ్ రావు, ప్రభాకర్‌రెడ్డిలతోనూ పనులు కావన్నారు. తాను శ్రీనివాస్ రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్తానని, దుబ్బాకకు కావల్సిన పనులన్నీ చేయిస్తానని హామీ ఇచ్చారు.

మోదీని కలిసిన పీవీ కుటుంబ సభ్యులు

పీవీకి భారతరత్నపై కృతజ్ఞతలు

హైదరాబాద్, మే 7: హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోదీని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులు కలిశారు. మంగళవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో వారి భేటీ సుమారు అరగంట పాటు కొనసాగింది. దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నతో పీవీని గౌరవించినందుకు ఆయన కుటుంబ సభ్యులు మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. పీవీ కుమారుడు పీవీ ప్రభాకరరావు, కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి, పీవీ అల్లుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఆర్ నందన్, పీవీ మనవడు, బీజేపీ నాయకుడు ఎన్‌వీ సుభాష్ తదితరులు మోదీని కలిశారు. భేటీ అనంతరం ఆ ఫొటోలను మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. గొప్ప విద్యావేత్త, రాజనీతిజ్ఞుడైన పీవీ కుటుంబ సభ్యులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, దేశ సంస్కృతీ సంప్రదాయాలతో పాటు వివిధ అంశాలపై తాము మాట్లాడుకున్నామని తెలిపారు.





అబ్ కీ బార్?

సీఎం చేతులకు గోర్లతో రక్కిన గాయాలు

ఎన్నికల ప్రచారం సందర్భంగా చేతికి అయిన గాయాలను సీఎం రేవంత్ రెడ్డి చూపారు. ఆయన చేతి మీద గోళ్లతో రక్కిన గాయాలున్నాయి. అభిమానులు, కార్యకర్తలు ఆయనతో కరచాలనం చేసే క్రమంలో ఈ గాయాలు అయ్యాయి. ఎన్ని దెబ్బలు తగిలినా కార్యకర్తల కోసం, పార్టీ కోసం అన్నీ భరిస్తూనే ప్రచారం చేస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు.



దేశ భద్రతకే ముప్పు తెచ్చారు

(మొదటిపేజీ తరువాయి)

పంపిందని, ఇది తెలంగాణ సార్వభౌమాధికారంపై దాడి అని స్పష్టం చేశారు. ఈ పరిణామాన్ని కేసీఆర్ ఖండించాల్సి ఉన్నా ఆయన ఆ పని చేయలేదని తప్పుబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం ఏమీ లేదని, పోటీ కేవలం ఇండియా, ఎన్డీయే కూటముల మధ్యనేనని తెలిపారు. కేసీఆర్‌పై ప్రజల్లో ఇంకా కోపం తగ్గలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో తగిన శాస్తి చేసినా ఇంకా మారలేదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోందని చెప్పారు. పార్టీ తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని గుర్తించడంతోనే బస్సు యాత్ర మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ మంగళవారం నిర్వహించిన బిగ్ డిబేట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం తుది దశకు వచ్చిన నేపథ్యంలో వివిధ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ వివరాలు..

ఆర్కే: ఐదు నెలలు అయిపోయింది. మామూలుగా అయితే ఆరు నెలలపాటు సెలబ్రేషన్స్ ఉంటాయి. కేసీఆర్ చేసిన పనితో ఐదు నెలలకే ఎన్నికలు రావడం చాలెంజ్ అయింది కదా. దీనిని ఎలా చేరదాం అనుకుంటున్నారు!?

ముఖ్యమంత్రి: డిసెంబరులో జరిగిన ఎన్నికలు సెమీ ఫైనల్స్. ఈ ఎన్నికలు మాకు ఫైనల్స్. వీటిలో గెలిస్తేనే చాంపియన్‌షిప్ కొట్టినట్లు. ప్రభుత్వ వంద రోజుల పాలనను దీనికి రెఫరెండంగా పెట్టుకున్నాం. ఎండలు మండిపోతున్నా.. పొయ్యిలో వేసి కాల్చినట్లు ఉన్నా ప్రచారం చేయక తప్పని పరిస్థితి. అనుకూలమైన వాతావరణం ఉంది. చాంపియన్లుగా నిలుస్తాం.

మూడు పార్టీల మధ్య చాలెంజింగ్. అందరికీ జీవన్మరణ సమస్య. ఏదో ఒక పార్టీ లేచిపోవాలి. ఎవరిని ఎవరు లేపుతున్నారు?

ఫ్రాంక్‌గా మాట్లాడితే.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రోల్ ఏమీ లేదు. చెప్పుకోవడానికీ ఏమీ లేదు. ఇండియా, ఎన్డీయే కూటములు కాకుండా మిగిలిన వారిది ప్రేక్షక పాత్రే. ముక్కోణ పోటీ ఉందని ఒకవేళ అనుకున్నా.. బూత్‌లోకి వెళ్లిన తర్వాత జరిగేది ముఖాముఖి ఎన్నికే. అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఓటింగ్ పోలరైజ్ అయింది. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ కనిపించకుండాపోయింది. మునుగోడులోనూ అదే పరిస్థితి. నాగార్జున సాగర్, హుజూర్‌నగర్‌లలో బీజేపీ లేచిపోయి మేం మిగిలాం. అంటే ఈ ఎన్నికల్లో పోటీ ముక్కోణం అనిపించినా.. చివరికి పోలింగ్ ఇద్దరి మధ్యనే జరుగుతుంది.

రెండు కూటములకు మెజారిటీ రాదు. నేను చక్రం తిప్పుతానని కేసీఆర్ అనుకుంటున్నారు. చక్రం రెడీ చేసుకున్నారు. అలాంటి అవకాశం ఉందా..?

ఏమైనా సీట్లు వస్తే ఆయన గురించి చర్చించుకోవాలి. క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం.. మూడు, నాలుగు సీట్లలో రెండో స్థానంలో ఉన్నాడు. మిగిలినచోట్ల మూడో స్థానమే.



ఆయన ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా బీఆర్ఎస్‌కు సీట్లు రావు. ఎన్నికల్లో అణా పైసా కూడా ఖర్చు చేయట్లేదు. ఖర్చులకు కూడా అభ్యర్థులనే పెట్టుకోమంటున్నారు. దాంతో, పదేళ్లపాటు వేల కోట్లు వెనకేసుకుని, ఖర్చులు చేయకుండా ఇప్పుడు తమను ఖర్చు చేయమనడం ఏమిటని అభ్యర్థులు మండిపడుతున్నారు. వాస్తవంగా, ఆరుగురు బీఆర్ఎస్ అభ్యర్థులు నన్ను కలిశారు. నామినేషన్లు వాపస్ తీసుకుంటాం.. మమ్మల్ని పార్టీలో చేర్చుకోండి అన్నారు. నేను అవసరం లేదన్నాను. అందుకే బీఆర్ఎస్ 17 చోట్ల పోటీ చేస్తోంది. లేకపోతే, అక్కడ కూడా అభ్యర్థులు ఉండే వాళ్లు కాదు. చివరికి, విత్ డ్రా సమయంలో కూడా నామినేషన్లు ఉపసంహరించుకుంటామని అన్నారు. కేసీఆర్ ఎంత లూజ్‌గా ఈ ఎన్నికలు చేస్తున్నారనే దానికి ఇదొక ఉదాహరణ. ఆయన బీఫాం ఇచ్చిన వాళ్లు కూడా అంతా అయ్యాక ఉపసంహరించుకుంటామనే పరిస్థితి వచ్చిందంటే రాజకీయంగా కేసీఆర్ విఫలమైనట్లే. ఆయన తప్పిదాలకు పాల్పడుతున్నాడా.. అహంకారంతో వ్యవహరిస్తున్నాడా.. తన ఇష్టారాజ్యంగా ఉంటే ఉండండి పోతే పోండి అనుకుంటున్నారో నాకు అంచనాకు రాలేదు. కానీ.. ఆయన తీరు మాత్రం ఆ పార్టీ మనుగడకు ఉపయోగపడేది కాదు.



సానుభూతి లేకున్నా ఎందుకో కొంత బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందనే అభిప్రాయం వస్తోంది. తద్వారా, మొన్నటి వరకూ ఊపు మీద ఉన్న బీజేపీపై కొంత ప్రభావం పడుతోందని అంటున్నారు. నిజమేనా!?

అవకాశం ఉంది సార్.. బీఆర్ఎస్ పడుకుంటే కాంగ్రెస్ మీద వ్యతిరేకతతో కాంగ్రెసేతర ఓటర్లు బీజేపీకి వెళ్లడానికి అవకాశం ఉంది. ఇది గమనించే.. రాజకీయంగా అనుకూల పరిస్థితి లేకపోయినా మొత్తానికే తుడిచిపెట్టుకపోయే పరిస్థితి ఉంటుందనే భయంతో యాత్ర మొదలు పెట్టాడు. పార్లమెంట్ ఎన్నికలైన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయి. ఓటు బ్యాంకును కాపాడుకోకపోతే రేపు పార్టీ ఉనికే ఉండదని కేసీఆర్ గ్రహించారు. గ్రామాల్లో వదులుకుంటే రేపు పార్టీ ఉండదనే వాస్తవాన్ని గుర్తించారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీకి వలస పోయే ఓట్లను ఆపే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా, ఉన్న ఓటును నిలుపుకోవచ్చు. కొంత పెంచుకోవచ్చు. ఉన్న ఓట్లలో బీఆర్ఎస్ నుంచి వంద ఓట్లు బయటికి పోతుంటే.. 20నో 30నో మాకు వస్తే మిగిలిన 70 ఓట్లు బీజేపీకి పోతాయి. ఆ పార్టీ మనుగడ సాగిస్తుందా లేదా అనేది కాలం నిర్ణయిస్తుంది.

కేసీఆర్ ఆత్మ విశ్వాసం పెరిగింది. నేను బస్సు ఎక్కితే కానీ రైతు బంధు వేయలేదని చెబుతున్నాడు.

2018 వానాకాలానికి మేలో రైతు బంధు డబ్బులు వేయడం మొదలుపెట్టి సెప్టెంబరులో పూర్తి చేశాడు. 2019-20లో జూన్‌లో మొదలుపెట్టి డిసెంబరు వరకు వేశాడు. 2020-21లో జనవరిలో మొదలుపెట్టి అక్టోబరు వరకు వేశారు. మేం డిసెంబరులో మొదలుపెట్టి మే 7వ తేదీకి వంద శాతం పూర్తి చేశాం. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగింపు కాగానే కేసీఆర్ చేసిన అప్పులకు రూ.27 వేల కోట్లు కట్టాల్సి వచ్చింది. ఈ ఐదు నెలల్లో కేసీఆర్ చేసిన అప్పులకు మిత్తి కింద రూ.30 వేల కోట్లు కట్టా.

కానీ, ఎన్నికలయ్యాక మీరు బీజేపీలో చేరతారని ఎందుకు మాట్లాడుతున్నారు!?

నన్ను అనడానికి కేసీఆర్‌కు ఏమీ దొరకలేదు. వంద రోజుల్లో పాస్ మార్కులతో పని చేశానని సమాజం ఆమోదించింది. నిజానికి, పార్టీ బలంగా ఉన్నప్పుడు నన్ను రమ్మంటేనే నేను వెళ్లలేదు. నేను తెలుగుదేశాన్ని వదిలిన రోజుల్లో ఎన్డీయేలో టీడీపీ భాగస్వామి. నిజంగానే ఏదో ఒకటి కావాలనుకుంటే చంద్రబాబు నాయుడు నన్ను అకామిడేట్ చేయగలిగేవాడు. అయినా నేను ఆశించలేదు. కాంగ్రెస్‌లో చేరా. కష్టపడ్డా.. పైకి వచ్చా.. ఇప్పుడు నాకు ఇక్కడ ఏం తక్కువుందని బీజేపీలోకి వెళతాను? కేంద్ర హోం శాఖ నాపై ఫిర్యాదు చేసింది. ఢిల్లీ పోలీసులను పంపించి.. ముఖ్యమంత్రిని పిలిపించే స్థితికి వచ్చింది. తెలంగాణ సార్వభౌమాధికారం మీదనే కేంద్రం దాడి చేస్తోంది. దీనిని కేసీఆర్ ఎందుకు ఖండించడం లేదు? ఇది రేవంత్ రెడ్డి సమస్య కాదు. నోటీసు ఇచ్చింది తెలంగాణ సీఎంకు. ఫిర్యాదుదారుడు ఢిల్లీలో హోం శాఖకు సంబంధించిన వారు.. ఇవాళ వంద, 200 మంది ఢిల్లీ పోలీసులు తెలంగాణలో అన్ని జిల్లాలకు పోయి వ్యవస్థల మీద రాత్రిపూట దాడి చేస్తున్నారు. నన్ను వస్తావా రావా అని కూర్చున్నారు. నేను కుదరదని చెప్పా.

ఎప్పుడు అడిగారు ఢిల్లీ రమ్మని.. అరెస్టు చేస్తామన్నారా..?

మన లాయరు పోతే దురుసుగా ప్రవర్తించారు. అరెస్టు పదం వాడలేదు కానీ ఎలా రప్పించాలో మాకు తెలుసు అని అన్నారు. ఇంతకు ముందు ఒకాయన ఇలాగే చేశాడు. ఫలితం చూస్తున్నాడు. మీరూ అదే ఫార్ములా ఫాలో అవుతామంటే చూద్దాం అనుకున్నా. ఎన్నికలయ్యాక ఢిల్లీ వెళతా. ఎందుకు పిలిచారని పోలీసు స్టేషన్‌కు వెళతా. ఏమవుతుంది. ఉరేస్తారా!? ఎవరో సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఒక పోస్టుకు సీఎంపై కేసు పెడతారా!? అది కూడా దేశ అంతర్గత భద్రతకు ప్రమాదం తీసుకొస్తున్నామని కేసు పెట్టారు. ఇదే అంశంపై అసోంలో అరెస్టులు చేశారు. ఢిల్లీలో అరెస్టు చేశారు. ఆ వీడియో ఒక్క తెలంగాణకే పరిమితం కాలేదు. ఓ రాజకీయ నాయకుడిపై ఇంకో పార్టీ నాయకుడు పోస్టు పెడితే రాజకీయ పార్టీ ఫిర్యాదు చేయాలి. కానీ, కేంద్ర హోం శాఖ ఎందుకు ఫిర్యాదు చేయాలి? హోం శాఖకు, రాజకీయ పోస్టుకు ఏమిటి సంబంధం!? హిందువుల ఆస్తులు గుంజుకుని ముస్లిములకు పంచి పెడతారని, హిందూ మహిళల తాళి బొట్లను గుంజుకుని ముస్లిములకు పంచి పెడతారని మోదీ అన్నారు. ఇది రెండు మతాల మధ్య వైషమ్యాలను సృష్టించడం కాదా!? దీనికంటే రిజర్వేషన్లు రద్దు చేస్తామనేది పెద్ద ఆరోపణ..?

అమిత్ షా మీద మీరూ కేసు పెట్టారు కదా!?

అమిత్ షా మీద మేం కేసు పెట్టలేదు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెట్టారు. రాజకీయ పార్టీగా, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేయదలుచుకోలేదు. బాధ్యతతో ప్రభుత్వం నడపాలనేది నా విధానం. హోం శాఖ కేసు పెట్టి విచారణ అంటే ఇది తెలంగాణ మీద దాడే కదా.. దీనిపై కేసీఆర్ మాట్లాడాలి కదా. ఇదేం పద్ధతి అని ప్రశ్నించాలి కదా. ఓట్లు కావాలంటే మాట్లాడతాడు. ఇవి మాత్రం మాట్లాడడు.

మోదీ, అమిత్ షాలతో పెట్టుకోవాలంటే అంతా గజగజ వణికిపోతున్నారు. ముఖ్యమంత్రులనూ జైల్లో పెట్టారు కదా!

నేను విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చా. స్వాతంత్ర్యానికి ముందు రాజులు ఉన్నప్పుడు, బ్రిటిషర్ల హయాంలో కూడా ప్రజలు తిరుగుబాట్లు చేశారు. సమస్యలు వస్తాయని ఇంట్లోనే ఉండలేం.

కేసులు పెట్టి.. జైల్లో వేసి కేసీఆర్ మిమ్మల్ని సీఎంను చేశారు. వాళ్లు జాతీయ నాయకుడిని చేస్తారేమో..

కేసీఆర్, మోదీ, అమిత్ షాలాంటి వారు ఇలాగే వ్యవహరిస్తే చాలా ప్రమాదం. మాలాంటి వారు కూడా మౌనంగా ఉంటే సమాజానికి ప్రమాదం. శక్తిమంతులమని భావిస్తే ప్రకృతి చూసుకుంటుంది. మేం అన్నింటికీ అతీతులమని అనుకుంటే పరిష్కారం చూపుతుంది. నా అంచనా ప్రకారం.. ఈసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అనుకోవడం లేదు.

ఎన్డీయే కూడా అధికారంలోకి రాదా..?

ఎన్డీయేలో ఎవరు అవుతారో చెప్పలేను. అంతా కలిసి డిమాండ్ పెట్టవచ్చు. ఒక్కరు కూడా ఎన్డీయేలో ఉండకపోవచ్చు. ఇంత నిర్బంధాన్ని, నియంతృత్వాన్ని ఏ రాజకీయ పార్టీ, వ్యక్తి కోరుకోడు. ప్రకృతి తన పని తాను చేస్తుందేమో అని అనుకుంటున్నా. ఇప్పటికే మొదలైందని అనుకుంటున్నా.

బీఆర్ఎస్ వాళ్లే కాకుండా బీజేపీ వాళ్లు కూడా పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో అంతర్గత పోరు వస్తుందని అంటున్నారు. కేసీఆర్ నమ్మకం కూడా ఏమిటంటే.. జగన్ ఏదో ప్రామిస్ చేశారంట. మంత్రులను మేనేజ్ చేసి.. రేవంత్‌ను దించి కేసీఆర్‌ను సీఎం చేస్తానని చెప్పినట్లు ఉన్నారు.. అది నమ్ముకుని మాట్లాడుతున్నాడని వాళ్లలో వాళ్లు చెప్పుకుంటున్నారు.

నా దగ్గర 65 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఒకరే సీఎం అవుతారు. నేను అయ్యా.. నేను కాకపోతే ఇంకో వ్యక్తి అవ్వాలి.. మా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఎవరితో కంఫర్ట్ ఉంటుందో ఎమ్మెల్యేలు తేల్చుకుంటారు కదా. నేను మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోను. వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాను. వారి శాఖలను నేను సమీక్ష చేయడం లేదు. అందరం కలిసి నిర్ణయాలు తీసుకుంటున్నాం. నేను యుద్ధం చేసేటప్పుడు టార్గెట్ చేసి యుద్ధం చేస్తా. నేను వార్‌జోన్‌లో ఉన్నప్పుడు ఎవరు ఏం చెప్పినా వినను. గదిలో ఉన్న సమయంలో ఏం చెప్పినా వింటా. ఎవరు ఎన్ని అన్నా 65 సీట్లు తెచ్చి ఫలితం చూపాం కదా.

జూన్ 4 తర్వాత రాజకీయంగా, ప్రభుత్వపరంగా రేవంత్‌ను సమర్థమైన, బలమైన నాయకుడిగా చూడొచ్చా!?

వంద శాతం చూడవచ్చు. రాజకీయంగా నన్ను లక్ష్యం చేసుకుని మాట్లాడేటప్పుడు నేనూ టెంపర్ చూపాలి. కౌంటర్ చేయాలి. ఎన్నికలు చేయాలి కదా..

చివరికి, రేవంత్ రెడ్డికి హ్యాపీ మ్యారేజ్ డే చెబుతూ బిగ్ డిబేట్‌ను ఆర్కే ముగించారు.

కేసీఆర్ ఏమో నేనే మళ్లీ సీఎం అవుతానని అనుకుంటున్నారు?

తొలి నుంచీ ఆయన ఇలాంటి నమ్మకాలతోనే ఉన్నాడు. జ్యోతిషంతోపాటు తన దగ్గర ఉన్న వాళ్లను నమ్ముతారు. తెలంగాణ రాజకీయాలు మారుతున్నాయి. నా దగ్గర 75 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కేసీఆర్ చేసిన తప్పిదాలపై ఇంకా పని మొదలు పెట్టలేదు. ఆయన అది కూడా మరచిపోతున్నాడు. మేం అనుకుంటే ఏం జరుగుతుందో ఆలోచించుకోవాలి.

ఇంకా మొదలు పెట్టలేదా.? ఫోన్ ట్యాపింగ్ మొదలు పెట్టారు కదా..!

నిజానికి పదవీ విరమణ చేసిన వారికి పదోన్నతులు ఇచ్చి ట్యాపింగ్ పనిని కేసీఆర్ వారికి అప్పగించారు. ఇప్పుడు నాకేం సంబంధం లేదంటే కుదరదు. ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. నిజానికి, డిసెంబరు 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. 4న అక్కడి అధికారులు సర్వర్లు, కంప్యూటర్లు, హార్డ్ డిస్కులను రంపంతో కట్ చేశారు. కొన్ని తగలబెట్టారు. కొన్ని మూసీలో పడేశారు. ఈ క్రమంలో 40 ఏళ్లుగా మావోయిస్టులు, ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని కూడా ధ్వంసం చేశారు. కొత్త అధికారులు వచ్చిన తర్వాత పరిశీలిస్తే.. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు మిస్సయ్యాయి. దాంతో, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తొలుత పంజాగుట్ట పోలీసు స్టేషన్లో కేసు పెట్టారు. వాటిని ఎందుకు మాయం చేశారని ఆరా తీస్తే.. ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. చాలా మంది అనుకున్నట్లు రేవంత్ రాగానే ట్యాపింగ్‌పై విచారణ ప్రారంభించారనేది వాస్తవం కాదు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో దీనిపై లోతుగా మాట్లాడతా.

తెలంగాణలో ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ లేదని చెప్పగలరా..?

పొలిటికల్ ట్యాపింగ్ లేదని వంద శాతం కచ్చితంగా చెప్పగలను. రాజకీయ నాయకులు స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను.

గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై కొంత అసంతృప్తి ఉందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు. వాస్తవం ఉందని నమ్ముతున్నారా..?

అందులో నిజం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో మాకు 39.50 శాతం ఓటింగ్ వచ్చింది. పార్లమెంట్ ఫలితాలు 40 శాతం తక్కువ కాకుండా వస్తుంది. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం. పింఛను ఇస్తున్నాం. ఆసరా వేశాం. రైతు బంధు పూర్తి చేశాం. 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం. 40 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. రూ.500కే సిలిండర్లు ఇచ్చాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇచ్చాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.22,500 కోట్లు కేటాయించాం. బీసీ జనగణనకు ఆదేశాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో ఇక అసంతృప్తికి తావు ఎక్కడిది!? పట్టణ ప్రాంతాల్లో డ్రగ్స్ అనే వాసన లేకుండా తొక్కి పడేశా. దేశానికి సరిపోయే గంజాయి ఏవోబీ నుంచే వస్తోంది. కాలేజీ యాజమాన్యాలను పిలిపించి మాట్లాడా. బార్లు, పబ్‌లలో కౌన్సెలింగ్ చేయించాం. సందీప్ శాండిల్య రూ.40 కోట్లు కావాలంటే రూ.50 కోట్లు ఇచ్చా. అధికారులను ఇచ్చా. నా మార్కు ఉండేలా దీన్ని తయారు చేస్తా.. కౌంటర్ ఇంటెలిజెన్స్ తరహాలో దేశంలో డ్రగ్స్ ఏ మూలన ఉన్నా.. తెలంగాణ యంత్రాంగం పసిగట్టేది అనేలా తయారు చేస్తా.





రాష్ట్రంలో మాదిగల సంఖ్య ఎక్కువ.. కానీ నాయకులు మాలలే ఉన్నారు!!

మాదిగల విషయంలో వాళ్ల వాదనను తప్పు పట్టడం లేదు. వివేక్ వెంకటస్వామి కుటుంబం, మల్లు అనంతరాము కుటుంబం 50 ఏళ్ల నుంచి కాంగ్రెస్ కుటుంబాలు. మాదిగల్లో నాయకత్వ సమస్య వచ్చింది. దానిని సరిదిద్దడానికి సిరిసిల్ల రాజయ్యను చైర్మన్ చేశా, సంపత్‌కుమార్‌కు, దామోదర్ రాజనర్సింహకు అవకాశం ఇచ్చాం. పాల్వాయి రజినీకుమారిని టీఎస్‌పీఎస్సీ మెంబర్‌గా వేశాం. సర్వే సత్యనారాయణ కుమార్తెను సీఎంవో ముఖ్య కార్యదర్శిగా వేశాం. చాలా నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలకు ఐదారు పోస్టులు వేశాం. ఇవి వారిని సంతోష పెట్టలేదు. ఎమ్మెల్సీలు ఉన్నాయి. రాజ్యసభ ఉంది. భవిష్యత్తులో పార్టీ నుంచి చేయగలిగినవి చేస్తాం. మంద కృష్ణ మాదిగా ఇప్పుడు ఎమ్మార్పీఎస్ లీడర్ కాదు. ఆయన బీజేపీ లీడర్. బీజేపీ కోసం పని చేస్తున్నారు.

రైతు రుణమాఫీ పెద్ద సవాలు.. ఆగస్టు 15 అన్నారు.. రాజీనామాకు హరీశ్ సిద్ధమన్నారు. సాధ్యమేనా..?

సాధ్యమే సార్.. 9వ తేదీలోపు రైతుబంధు వేస్తా అన్నా.. 6వ తేదీలోపే వేశాం.. నేను సాధ్యాసాధ్యాలు చూసుకుని పని చేస్తా. ఆగస్టు 15 లోపల చేసి తీరుతాం. రాష్ట్ర రాజకీయాల్లో ఎక్కువ కాలం ఉండాలి కాబట్టి.. హరీశ్ చూసుకుని మాట్లాడాలి.. నేను ఆయన మామలా కాదు కదా.. జాగ్రత్తగా మాట్లాడితే మంచిది.

సీఎం అయినా రేవంత్ భాష మారలేదని కేసీఆర్ అంటున్నారు

కేసీఆర్ చాలా అన్నాడు. అందుకే నేను తిరగబడి మాట్లాడుతున్నా. తెలంగాణలో ఇలాంటి భాషా ప్రయోగానికి కేసీఆరే పితామహుడు. నేను మాట్లాడతా.. నన్ను అనొద్దు అంటే నా దగ్గర కుదరదు. చిల్లర వేషాలు, చిల్లర మాటలు మాట్లాడితే సహించను.

మొన్న నా షోలో మీ మిత్రుడు ఒక సలహా ఇచ్చారు. సీఎంను లోన్లు రీషెడ్యూల్ చేయించమనండి.. అప్పుడే తెలంగాణ బతుకుతుందని..

దీనిపై తొలిసారి ప్రధాన మంత్రిని కలిసినప్పుడే నేను ఒక ప్రతిపాదన ఇచ్చాను. నిర్మలా సీతారామన్ కేంద్ర, రాష్ట్ర అధికారులను, బ్యాంకర్లను పిలిపించి మాట్లాడారు. కేసీఆర్ 9 నుంచి 12 శాతం వరకూ మిత్తి మీద అప్పులు తెచ్చాడు. నిజానికి, 4 శాతం మిత్తికే ఇచ్చే సంస్థలు కోకొల్లలు ఉన్నాయి. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామరాజన్‌ను కలిసి ఆర్థిక సలహాదారుగా పెట్టుకోవాలని ఆయనతో చర్చించాం. ఆయన హైదరాబాద్ వచ్చి మాతో చర్చించారు. "రుణాలు రీ షెడ్యూల్ చేసుకో. దుబారా తగ్గించుకో. దీనివల్ల 10-12 శాతం ఆదాయం పెరుగుతుంది. ఆ పెరిగే దాన్ని ప్లాన్ చేసుకుంటే మీ సంక్షేమ పథకాలకు ఇబ్బంది లేకుండా చూసుకోవచ్చు" అని సూచించారు. మేం కూడా ప్రధానిని, ఆర్థిక మంత్రిని కలిసి అప్పులపై ఎలాంటి పరిష్కారం కావాలనే దానిపై చర్చించాం.

ఎన్నికల ప్రక్రియకు ముందు మీరు మోదీని పెద్దన్న అన్నారు. ఇప్పుడు విమర్శించుకోవడంలో ఇద్దరూ పోటీ పడుతున్నారు. రీ షెడ్యూల్‌కు కేంద్రం ఒప్పుకుంటుందా..?

నా వంద రోజుల పాలనలో పదేళ్లలో కేసీఆర్ సాధించలేనివి నేను సాధించా. కంటోన్మెంట్‌లో 194 ఎకరాల భూమి బదలాయించారు. రాష్ట్రంలో నేవీ రాడార్ వంటి సమస్యలు తక్షణమే పరిష్కరించాం. కేసీఆర్ అహంకారంతో వ్యవహరించాడు. కానీ, వంద రోజుల పాలనలో నాకు కేంద్రం నుంచి ఎటువంటి ఇబ్బందులు రాలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రధాన మంత్రిగా ఆయన గౌరవానికి ఇబ్బంది లేకుండా వ్యవహరించా. ఎన్నికలు వచ్చినప్పుడు పీసీసీ అధ్యక్షుడిని. బీజేపీ వాళ్లు నేరుగా మోదీ పేరుతోనే ఓట్లు అడుగుతున్నారు. నేను ఆయనతోనే కొట్లాడాలి కదా!?



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం మీనాజీపేటలో ధాన్యం కల్లంలో నిలిచిన వాననీరు



ప్రాంతం	వర్షపాతం (సెం.మీ)
మియాపూర్	13.3
కేపీహెచ్‌బీ	11.2
చందానగర్	10.7
సికింద్రాబాద్	10.4
లింగంపల్లి	9.9
గచ్చిబౌలి	9.5
యూసుఫ్‌గూడ	9.4
ఆర్సీపురం	8.8
బాలాజీనగర్	8.2
సెస్	7.7
ఎంసీహెచ్‌ఆర్‌డీ	7.5



అమీర్‌పేట్ ప్రధాన రహదారిపై వర్షపు నీటిలో అవస్థలు

జోరువానకు జామ్‌జాటం!

హైదరాబాద్‌లో 2 గంటల పాటు కుండపోత.. రోడ్లపై మోకాలిలోతు నీళ్లు.. ట్రాఫిక్ జామ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మండే ఎండలతో చెమట, ఉక్కబోత మధ్య ఊరటనిచ్చింది చినుకు! కొన్నిచోట్ల ఆ ఊరట స్థాయిని దాటించేసి ఉక్కిరిబిక్కిరి చేసింది. వేసవి మధ్యలో మండే ఎండల మధ్య వడగళ్లతో కూడిన జోరువాన వర్షాకాలాన్ని, ఈదురు గాలుల తీవ్రత శీతాకాలాన్ని గుర్తుకుతెచ్చి జనాలను వణికించాయి. రైతుకైతే మరోమారు గుండెకోతే విఁగిలింది. ఉరుములేని పిడుగులా విరుచుకుపడ్డ వానకు కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయి.. వరదలో కొట్టుకుపోయింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట వాలిపోయింది. తోటల్లోని మామిడి కాయలు నేల రాలడంతో మామిడి రైతుల లాభాల ఆశలన్నీ రాలిపోయాయి. పలుచోట్ల చెట్లు కూలాయి. స్తంభాలు పడిపోయాయి. గాలిదుమారానికి ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. హైదరాబాద్, కరీంనగర్, ఆసిఫాబాద్, ములుగు, హుజూరాబాద్, పెద్దపల్లి, ఖమ్మం, మెదక్, నల్లగొండ, యాదాద్రి, వరంగల్ జిల్లాల్లో పలుచోట్ల మంగళవారం సాయంత్రం భారీ వర్షం పడింది. హైదరాబాద్‌లో కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. మంగళవారం సాయంత్రం దాకా చెమటలు కక్కించిన ఎండ.. ఆ తర్వాత వణికించిన వాన! నిప్పులు చిమ్మే ఎండల మధ్యలో సాయంత్రం 4:30 గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మబ్బులు పట్టి చల్ల గాలులు వీచాయి. ఆ ఆశ్చర్యంలోంచి తేరుకునేలోపే సాయంత్రం 5:30 నుంచి ఉరుములు.. మెరుపులు తీవ్రమైన గాలులతో ఆకాశానికి చిల్లులు పడ్డాయా? అన్నట్లు వర్షం పడింది. రెండేరెండు గంటల్లో... మియాపూర్‌లో 13.3 సెం.మీ, కూకట్‌పల్లిలో 11.2 సెం.మీ, చందానగర్‌లో 10.7 సెం.మీ, యూసుఫ్‌గూడలో 9.4 సెం.మీ, ఆర్సీపురం 8.8సెం.మీ వర్షపాతం నమోదైంది. పొద్దున మండే ఎండలో కార్యాలయాలకు వెళ్లిన ఉద్యోగులు, సాయంత్రం ఇళ్లకు వెళుతూ వర్ష బీభత్సానికి ఉక్కిరిబిక్కిరయ్యారు. జోరువానకు క్షణాల్లో రోడ్ల మీద మోకాలిలోతులో నీళ్లు చేరాయి. రాజ్‌భవన్ రోడ్డు, సచివాలయం ఎదుట, బేగంపేట నుంచి ఖైరతాబాద్ ముద్రణాలయం వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. వాహనాలు ముందుకు కదలకపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ప్రత్యేకించి ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. భారీగా చేరిన వరద నీరు, పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోళ్ల మధ్య పూర్తిగా తడిసిపోయిన స్థితిలో రోడ్లపై ముందుకూ వెనక్కు వెళ్లలేక గోస పడ్డారు. వరద ఉధృతికి బాచుపల్లిలో పార్కింగ్ చేసిన కార్లు మునిగిపోయాయి. వర్షానికి బీభత్సమైన గాలి తోడవడంతో చెట్లు కూలి రోడ్ల మీదపడ్డాయి. అమీర్‌పేట, సికింద్రాబాద్, పంజాగుట్ట, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, బాలానగర్ తదితర చోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఎప్పుడో సాయంత్రం ఐదింటికి ఇళ్లకు చేరాల్సిన వాహనదారుల్లో ఎక్కువ మంది 9 గంటలకు ఇళ్లకు చేరారంటే ట్రాఫిక్ ఏ స్థాయిలో నిలిచిపోయిందో అర్థం చేసుకోవచ్చు. పలుచోట్ల 4గంటల పాటు విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. గాలివాన మెట్రోనూ వణికించింది. అధికారుల ఆదేశాల మేరకు 20-30 నిమిషాల పాటు మెట్రో రైళ్లను నిలిపివేశారు. మంగళవారం కొంత మేర ఉష్ణోగ్రతలు తగ్గినా వనపర్తి జిల్లా కేతేపల్లిలో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నేడు, రేపు వర్షాలు

రాష్ట్రంలో బుధ, గురు వారాల్లో కూడా వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో 30-40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ, వరంగల్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది.



అమీర్‌పేట్‌లో మ్యాన్‌హోల్‌ను తెరిచేందుకు ప్రయత్నిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రైతన్నకు ఎంత కష్టం!

యాదాద్రి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో 145 మంది రైతులకు చెందిన ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరింది. కాంటాలు వేసిన 2,150 సంచుల ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ఉంచిన ధాన్యం తడిసిపోవడంతో వ్యాపారుల నిర్లక్ష్యమే కారణం అంటూ రైతులు ఆందోళన చేశారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో వెయ్యి క్వింటాళ్ల మేర ధాన్యం తడిసిపోయినట్లు భావిస్తున్నారు. ములుగు జిల్లా ములుగు, మంగపేటలో కోతకు సిద్ధంగా ఉన్న 300 ఎకరాల్లోని వరి పంట తీవ్రంగా దెబ్బతింది. యాదగిరిగుట్ట క్షేత్రంలో ఈదురుగాలులకు చలువపందిళ్లు కూలి ద్విచక్రవాహనాలపై పడ్డాయి. హనుమకొండ జిల్లా పరకాల బస్టాండ్ కూడలి వద్ద ఈద్గా మసీదు ప్రహరీ కూలిపోయింది. నల్లగొండ జిల్లా అన్నెపర్తిలోమామిడి కాయలు నేల రాలాయి. నిమ్మచెట్లు వాలిపోయాయి. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో తోటల్లోని మామిడి కాయలు నేలరాలాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 300 కుపైగా విద్యుత్తు స్తంభాలు, 50కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు.. జనగామ జిల్లాలో 146 విద్యుత్తు స్తంభాలు, 8 ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 4వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం జరిగింది.



భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి తోట

ప్రజలు ఇబ్బంది పడకూడదు..

» తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి :సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను భారీ వర్షం ముంచెత్తిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకూడదని, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షం, ఈదురుగాలుల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమవడం, ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడి నుంచే జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వి, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని పోలీసు శాఖను ఆదేశించారు. కాగా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ప్రచార సభలకు అంతరాయం

మంగళవారం జోరువాన, ఎన్నికల ప్రచార సభలకు అంతరాయం కలిగించింది. కరీంనగర్‌లో సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరగాల్సిన సభలో భారీ వర్షం కారణంగా టెంట్లు కూలాయి. ఫలితంగా సభను రద్దు చేశారు. కోదాడలో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ నిర్వహించిన ప్రచారసభ అర్ధంతరంగా ముగిసింది. సభమొదలవ్వగానే వర్షమూ మొదలవ్వడంతో ఏడు నిమిషాల్లో సభ ముగిసింది. సిరిసిల్ల జిల్లా వేములవాడలో బుధవారం ప్రధాని మోదీ హాజరుకానున్న సభ కోసం చేస్తున్న ఏర్పాట్లకు వర్షం కారణంగా అంతరాయం కలిగింది.



కరీంనగర్‌లో వర్షం కారణంగా సభా ప్రాంగణం వద్ద కూలిపోయిన టెంట్లు

వడదెబ్బకు, పిడుగుపాట్లకు రాలిన ప్రాణాలు

మంగళవారం మధ్యాహ్నం ఎండ, సాయంత్రానికి పిడుగుపాట్లు కొన్ని కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి (టి)కి చెందిన ఉపాధిహామీ కూలీ మస్కాపూర్ ఇస్తారి (35), సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కార్మికుడు బేతి భిక్షయ్య (70), వనపర్తి జిల్లా పీర్ల మసీదు వద్ద బుడకల మౌలాలీ (56) అనే భిక్షకుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా మోత్కూరులో రావుల మణెమ్మ (95), మిర్యాలగూడ మండలం రాంనగర్‌బంధం కాలనీలో జిగిడి సత్యం (52) వడదెబ్బతో మృతిచెందారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో పిడుగుపాటుకు కుమ్మరి మల్లేశం (33) అనే వ్యక్తి మృతిచెందాడు. హైదరాబాద్ బహదూర్‌పురలో వర్షంలో నడుచుకుంటూ వెళుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి, విద్యుత్తు స్తంభానికి తగిలి.. విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాలలో చెట్టు కూలి మీద పడటంతో ఆబర్ల దయాకర్ (20) అనే యువకుడు మృతిచెందాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం నాగులపల్లిలో పౌల్ట్రీఫామ్ గోడకూలి శిథిలాలు మీద పడటంతో అక్కడ పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం (38), నాగు (35) అనే వ్యక్తులు మృతిచెందారు. వనపర్తి జిల్లా పెద్దమందడిలో పిడుగు పడటంతో 50 గొర్రెలు మృతిచెందాయి. ఆసిఫాబాద్ జిల్లా నాగవెల్లిలో పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందింది.

తడిసిన ధాన్యమూ కొంటాం: డీఎస్ చౌహాన్

మంగళవారం కురిసిన భారీ వర్షానికి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఓ ప్రకటన విడుదలచేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని ఆయన ప్రకటించారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

నన్ను కడపలో ఇంటికొచ్చి కలవొచ్చు
అవినాశ్‌ను కలవాలంటే జైలుకెళ్లాలి

» కమలాపురం ప్రచారంలో షర్మిల



కడప, మే 8(ఆంధ్రజ్యోతి): "కడప ఎంపీగా నన్ను గెలిపిస్తే ఇదే జిల్లాలో మీరు నన్ను నా ఇంటికి వచ్చి కలవచ్చు. అదే అవినాశ్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే.. ఆయనను జైలులో వెళ్లి కలవాల్సి ఉంటుంది" అని పీసీసీ చీఫ్, కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం ఆమె కమలాపురం నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ "వివేకా హత్య జరిగిన తర్వాత అక్కడ సాక్ష్యాలు తుడిచేస్తున్నప్పుడు అవినాశ్‌రెడ్డి పక్కనే ఉన్నాడంట. నిలబడి చూస్తున్నాడంట. ఒక ఎంపీ అయి ఉండి హత్య జరిగిన స్థలంలో సాక్ష్యాలు తుడిచేస్తుంటే పోలీసులకు చెప్పాల్సిన బాధ్యత ఆయనకు లేదా? మా మేనమామ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అవినాశ్‌కు ఒక సర్టిఫికెట్ ఇస్తారు.. చూస్తున్నట్లు. సీఎం జగన్ మరో సర్టిఫికెట్ ఇస్తారు... చిన్న పిల్లోడు అని.. ఈయన చిన్న పిల్లోడు కాదు... అమాయకుడు కాదు.. వివేకా హత్య కేసులో కాల్ రికార్డ్స్, గూగుల్ మ్యాప్స్ అన్నీ అవినాశ్ వైపు చూపిస్తున్నాయి. అన్ని ఆధారాలు ఉన్నా హంతకులకు శిక్ష పడలేదు. అరెస్టు చేయాలని చూస్తే ఏకంగా సీఎం అడ్డుపడ్డారు. వైసీపీ మూకలను పెట్టి అరెస్టు కాకుండా చూశారు." అన్నారు.

బాబు బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): స్కిల్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు మరోసారి వాయిదా వేసింది. 10 వారాల తర్వాతే విచారణ చేపడతామని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు వేసవి సెలవుల తర్వాత వెంటనే చేపట్టాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. స్కిల్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కేసు విచారణను 10 వారాల పాటు వాయిదా వేసింది. తదుపరి విచారణ కోర్టుకు వేసవి సెలవుల తర్వాతే జరుగనుంది.

పవన్‌ను గెలిపించండి

గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయండి.. పిఠాపురం ప్రజలకు చిరంజీవి విన్నపం

» ఇలాంటి నాయకుడు కావాలని ఆంకాంక్ష
» తమ్ముడి గెలుపు కోసం వీడియో సందేశం
» పవన్‌కు ఓకేరోజు ఐదుగురు హీరోల మద్దతు
» సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన
» రామ్‌చరణ్, నాని, రాజ్ తరుణ్, తేజ సజ్జా

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రోజురోజుకూ ఊహించని మద్దతు దక్కుతోంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణాన.. కూటమికి ముఖ్యంగా పవన్ కల్యాణ్‌కు ఆయన పెద్దన్నయ్య, సినీ హీరో చిరంజీవి సహా ఒకే రోజు ఐదుగురు హీరోలు మద్దతు ప్రకటించారు. పిఠాపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పవన్‌ను గెలిపించాలని కోరుతూ.. మెగాస్టార్ చిరంజీవి ఒక వీడియో విడుదల చేయగా.. ఆయన కుమారుడు రామ్‌చరణ్, హీరోలు నాని, రాజ్ తరుణ్, తేజ సజ్జా కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం జనసైనికుల్లో జోష్ నింపింది.

ఇలాంటి నాయకుడు కదా కావాల్సింది..

నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని రాజకీయాలకు అంకితం చేసిన శక్తిశాలి పవన్ కల్యాణ్ అని, ఈ ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని చిరంజీవి పిఠాపురం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో తన తమ్ముడు పవన్ కల్యాణ్ విజయాన్ని కోరుతూ మంగళవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. పిఠాపురం ప్రజలందరూ గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి పవన్ ను గెలిపించాలని అందులో కోరారు. "పవన్ కల్యాణ్.. అమ్మ కడుపున ఆఖరివాడిగా పుట్టినప్పటికీ.. అందరికీ మంచి చేయాలి, మేలు జరగాలనే విషయంలో ముందుంటాడు. తన గురించి కంటే జనం గురించి ఎక్కువగా ఆలోచించే మనస్తత్వం నా తమ్ముడు కల్యాణ్ బాబుది. ఎవరైనా అధికారంలోకి వచ్చాక ప్రజలకి ఏదైనా చేయాలనుకుంటారు. కానీ, కల్యాణ్ తన సొంత సంపాదనని కౌలు రైతులకు కన్నీళ్లు తుడిచేందుకు ఖర్చు పెట్టడం.. సరిహద్దు దగ్గర ప్రాణాలొడ్డి పోరాడే జవానులో కోసం అందించడం, మత్స్యకారులతో పాటు ఎంతో మందికి సాయం చేయడం.. చూస్తుంటే ఇలాంటి నాయకుడు కదా జనాలకి కావాల్సింది అనిపిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే సినిమాల్లోకి తను బలవంతంగానే వచ్చాడు. రాజకీయాల్లోకి మాత్రం ఇష్టంతోనే వచ్చాడు. ఏ తల్లికైనా తన కొడుకు కష్టపడుతుంటే గుండె తరుక్కుపోతుంది. అలా బాధపడుతున్న నా తల్లికి.. 'నీ కొడుకు ఎంతో మంది తల్లుల కోసం, వారి బిడ్డల భవిష్యత్తు కోసం చేసే యుద్ధం అమ్మా ఇది. మన బాధ కంటే అది ఎంతో గొప్పది' అని చెప్పాను. బలంగా నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని రాజకీయాలకు అంకితం చేసిన శక్తిశాలి పవన్. ప్రజల కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆ శక్తిని వినియోగించాలంటే చట్టసభల్లో అతని గొంతు మనం వినాలి. జనమే జయం అని నమ్మే జనసేనాని ఏమి చేయగలడో చూడాలంటే పిఠాపురం ప్రజలు కల్యాణ్‌ను గెలిపించాలి. మీకు సేవకుడిగా, సైనికుడిగా అండగా నిలబడతాడు. పిఠాపురం వాస్తవ్యులకు మీ చిరంజీవి విన్నపం. గాజు గ్లాసుపై ఓటు వేసి పవన్ కల్యాణ్‌ను గెలిపించండి... జైహింద్" అంటూ చిరంజీవి ముగించారు. చిరంజీవి ఈ వీడియో పెట్టిన వెంటనే ఆయన కుమారుడు రామ్‌చరణ్ దాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేసి.. "మీ భవిష్యత్తు కోసం పాటుపడే నాయకుడు పవన్ కల్యాణ్‌ని గెలిపించండి" అంటూ బాబాయికి మద్దతు పలికారు.



ప్రచారంలో మెగా హీరోలు

జనసేన అధినేతకు మద్దతుగా మెగా హీరోలు వైష్ణవ్ తేజ్, సాయి దుర్గ తేజ్, వరుణ్ తేజ్ కూడా పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. పవన్ గెలుపు కోసం కృషి చేస్తున్నారు. మరో పక్క కమెడియన్ పృథ్వీ, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, నటుడు సాగర్, జబర్దస్త్ కమెడియన్లు ఆది, సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను, రామ్‌ప్రసాద్ తదితరులు కూడా పిఠాపురంలో పర్యటించారు.

టాలీవుడ్ మీ వెంటే ఉంటుంది

రాజకీయాల గురించి మాట్లాడడం అలవాటు లేని హీరో నాని కూడా పవన్ కల్యాణ్‌కు మద్దతుగా ఓ వీడియో విడుదల చేశారు. మీరు రాజకీయ కురుక్షేత్రంలో పెద్ద యుద్ధాన్నే ఎదుర్కొనబోతున్నారు. మీ ఆకాంక్షలన్నీ నెరవేరాలని కోరుకుంటున్నాను. ఎల్లప్పుడూ ప్రజా శ్రేయస్సు కోరే మీకు ఈ పోరులో తోటి నటుడిగా నా పూర్తి మద్దతు ఉంటుంది. అలాగే టాలీవుడ్ అంతా మీ వెంటే ఉంటుందని నమ్ముతున్నాను. ఈ ప్రయాణంలో మీకు అంతా మంచే జరగాలి. ఆల్ ది బెస్ట్" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. యువ యువ కథానాయకుడు రాజ్ తరుణ్ కూడా పవన్‌కు మద్దతు పలికారు. 'ఆంధ్రప్రదేశ్ పట్ల మీకున్న విజన్, కష్టపడుతున్న తీరును నేను మొదటి నుంచి గమనిస్తూనే ఉన్నాను. రాష్ట్రంలో కోట్ల మంది ప్రజలు.. మీరు సుపరిపాలనతో ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తారని, మార్పును తీసుకొస్తారని ఆశిస్తున్నారు. అందులో నేనూ ఒకడిని. ఇప్పుడు జనాలకి మీరు కావాలి" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. 'హను-మాన్' హీరో తేజ సజ్జా కూడా పవన్‌కు మద్దతు పలికారు. ఎన్నికలు జరిగే బిగ్ డే నాడు మమ్మల్నందరినీ గర్వపడేలా చేయాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● బుధవారం 8 మే 2024



శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీలో ప్రోగ్రామ్‌లు

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ- సంప్రదాయ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. శాస్త్రీ (బీఏ), ఆచార్య (ఎంఏ), డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులకు సంస్కృత భాషలో పరిజ్ఞానం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలతోపాటు వస్త్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తారు.

ప్రోగ్రామ్‌లు-అర్హత వివరాలు

శాస్త్రీ(బీఏ): రుగ్వేదం, కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం(కాణ్వ/మాధ్యందిన), అధర్వణ వేదం (శౌనక), సామవేదం(రహస్యాంతం-కౌథుమ/రాణాయనీయ) విభాగాలు సహా వీటి భాష్యాలకు సంబంధిత వేదంలో మూలాంత అధ్యయనం(సంహిత+బ్రాహ్మణం+అరణ్యకం+ఉపనిషత్తులు) పూర్తిచేసి ఉండాలి.

- వైఖానసాగమ, పాంచరాత్రాగమ, శైవాగమ విభాగాలకు సంబంధిత ఆగమంలో బ్రహ్మోత్సవాంత అధ్యయనం పూర్తిచేసి ఉండాలి.
- అశ్వలాయన పౌరోహిత్యం, ఆపస్తంబ పౌరోహిత్యం, వైఖానస పౌరోహిత్యం, పారస్కర పౌరోహిత్యం విభాగాలకు సంబంధిత సూత్రంలో ఉపనయానాంత అధ్యయనం పూర్తిచేసి ఉండాలి.
- కల్పం(శ్రౌతం), మీమాంస కోర్సులకు ఏ వేదంలోనైనా మూలాంత అధ్యయనం చేసి ఉండాలి. మీమాంస కోర్సుకు సంస్కృతం ఒక సబ్జెక్టుగా ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అభ్యర్థి వయసు 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ఆచార్య(ఎంఏ): రుగ్వేద, కృష్ణయజుర్వేద, శుక్లయజుర్వేద(కణ్వ/మాధ్యందిన) విభాగాలకు సంబంధిత వేదంలో క్రమాంతం లేదా శాస్త్రీ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులై ఉండాలి.


- సామవేదం(కౌథుమ/రాణాయనీయ) విభాగానికి సామవేదంలో రహస్యాంత అధ్యయనం పూర్తి చేసి ఉండాలి.
- అధర్వణ వేదానికి సంబంధిత పద పదాంతం పూర్తిచేసి ఉండాలి.
- ఆగమం(వైఖానస/పాంచరాత్ర/శైవ) విభాగానికి శాస్త్రీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత ఆగమంలో ప్రతిష్ఠాంతం అధ్యయనం చేసి ఉండాలి.
- పౌరోహిత్యం(అశ్వలాయన/ఆపస్తంబ/పారస్కర/వైఖానస) విభాగానికి శాస్త్రీ కోర్సు లేదా సంబంధిత సూత్రంలో షోడశ సంస్కారాంతం పూర్తి చేసి ఉండాలి. వైఖానస పౌరోహిత్యానికి మాత్రం అష్టాదశ సంస్కారాంతం ఉత్తీర్ణులై ఉండాలి.
- రుగ్వేదం, కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం (కాణ్వ/మాధ్యందిన), సామవేదం, అధర్వణ వేదం విభాగాల్లో వేదబాష్యం కోర్సుకు శాస్త్రీ(బీఏ)/సంబంధిత వేదశాఖల మూలాంత అధ్యయనం పూర్తిచేసి ఉండాలి.
- కల్పం(శ్రౌతం), మీమాంస కోర్సులకు శాస్త్రీ/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థి వయసు 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

అభిజ్ఞ కోర్సు: ఆగమ అభిజ్ఞ(వైఖానస/పాంచరాత్ర/శైవ), పౌరోహిత్య అభిజ(అశ్వలాయన/ఆపస్తంబ/పారస్కర/వైఖానస) విభాగాలకు సంబంధిత సూత్రంలో అహ్నిక విద్యాంత అధ్యయనం పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థి వయసు కనీసం 15 ఏళ్లు ఉండాలి.

డిప్లొమా: టెంపుల్ మేనేజ్‌మెంట్, జ్యోతిషం, వాస్తు, మాన్యుస్క్రిప్టాలజీ విభాగాలకు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం తప్పనిసరి. అభ్యర్థి వయసు కనీసం 20 ఏళ్లు ఉండాలి.

సర్టిఫికెట్ కోర్సులు: అతీంద్రియ విజ్ఞానం విభాగానికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థి వయసు కనీసం 20 ఏళ్లు ఉండాలి.

- గృహరచనం ఆన్ పురాణిక్ లైన్స్, ఫండమెంటల్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, ఇంట్రడక్షన్ టు ఆగమాస్, ఇంట్రడక్షన్ టు వేదిక్ సైన్సెస్, పురాణోక్త కర్మకాండ, పౌరాణిక శిక్షణ విభాగాలకు ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం ఉండాలి. అభ్యర్థి వయసు కనీసం 18 ఏళ్లు ఉండాలి.
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 30
- **ఫోన్ నెంబరు:** 0877-2264404
- **సెల్ నెంబరు:** 9701001777
- **వెబ్‌సైట్:** www.svvedicuniversity.ac.in



పుణె ఐఐఐటీలో పీహెచ్‌డీ

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీపీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, స్పాన్సర్డ్, విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ఫెలోషిప్ అందిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ-మెయిల్ ద్వారా అప్లయ్ చేసుకోవచ్చు.

విభాగాలు - స్పెషలైజేషన్‌లు

సీఎస్ఈ: డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా అనలిటిక్స్, డీప్ లెర్నింగ్, సాఫ్ట్ కంప్యూటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, డేటా మైనింగ్, ఫార్మల్ మెథడ్స్, బయోమెట్రిక్స్, ప్రైవసీ అండ్ సెక్యూరిటీ, ఐఓటీ, హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ, మొబైల్ అండ్ వైర్‌లెస్ సెన్సర్ నెట్‌వర్క్స్.

ఈసీఈ: వీఎల్ఎస్ఐ, కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఆర్ఎఫ్ అండ్ మైక్రోవేవ్, ఐఓటీ.

అప్లయిడ్ మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్: డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఆల్జీబ్రా, ఆప్టిమైజేషన్, గ్రాఫ్ థియరీ, డిస్క్రీట్ మేథమెటిక్స్, లాటిస్ థియరీ, కంప్యూటేషనల్ మెకానిక్స్.

అర్హత వివరాలు: సీఎస్ఈ విభాగానికి కనీసం 65 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ఐటీ)/ఎంసీఏ లేదా 60 శాతం మార్కులతో (ఎంఈ/ఎంటెక్) (సీఎస్ఈ/ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఈసీఈ విభాగానికి 65 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఈసీఈ/ఈఈ) లేదా 60 శాతం మార్కులతో (ఎంఈ/ఎంటెక్)(ఈసీఈ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. అప్లయిడ్ మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి కనీసం 55 శాతం మార్కులతో పీజీ (మేథమెటిక్స్/ స్టాటిస్టిక్స్)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విభాగాన్ని అనుసరించి గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్ లేదా డీఆర్‌డీఓ/ఏఐసీటీఈ ఫెలోషిప్ అర్హత ఉండాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు పీజీతోపాటు ఏడాది అనుభవం లేదా గ్రాడ్యుయేషన్‌తోపాటు మూడేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో సంబంధిత విభాగం నుంచి గేట్/నెట్ సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. విభాగానికి నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.590; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.295
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 25
- **ఈ-మెయిల్:** academics@iiitp.ac.in
- **వెబ్‌సైట్:** www.iiitp.ac.in

ఏబీవీ ఐఐఐటీఎంలో ఎంబీఏ



గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఏబీవీ ఐఐఐటీఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ&సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. మొదటి ఏడాదికి 55 క్రెడిట్లు, రెండో ఏడాదికి 54 క్రెడిట్లు చొప్పున ప్రోగ్రామ్ మొత్తానికి 109 క్రెడిట్లు నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు/రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తు కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డ్, ఫొటోలు, క్యాట్ స్కోర్ కార్డ్(2023) తోపాటు సంస్థకు చెందిన ఎండీపీ సెంటర్లో సెలెక్షన్ ప్రాసెస్‌కు హాజరు కావాలి. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ, రైటింగ్ కాంప్రహెన్షన్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 11
- **సెలెక్షన్ ప్రాసెస్:** మే 14
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 17
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 21
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం, గ్వాలియర్-474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in

ఐఐటీ మద్రాస్

వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ-మొబిలిటీలో ఎంటెక్

మద్రాస్ ఐఐటీ తాజాగా ఈ-మొబిలిటీలో ఎంటెక్ కోర్సును వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఆరంభించింది. వెబ్ ఎనేబుల్డ్ ఎంటెక్ ఇన్ ఈ-మొబిలిటీ(డబ్ల్యుఎంఈఎం)గా దీనిని పేర్కొంది. అటు ఇండస్ట్రీ, ఇటు అకడమిక్ ఇన్‌పుట్స్ కలిపి కోర్సును తీర్చిదిద్దారు. ఐఐటీకి చెందిన సెంటర్ ఫర్ ఔట్‌రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్(కోడ్) ఈ కోర్సు డిజైనింగ్‌లో కీలకపాత్ర పోషించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్ కోర్సు సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. ఏడు అకడమిక్ టెర్మ్స్‌గా ఈ రెండేళ్ల కోర్సును మలిచారు. ఒక ఏడాదిలో కనీసం మూడు అకడమిక్ టెర్మ్స్ ఉండేలా చూస్తున్నారు. టెస్ట్ ఆన్ ఫండమెంటల్ మేథ్స్, ఫిజిక్స్ ప్రిన్సిపల్స్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. ఈ నెల 26లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది సెప్టెంబర్లో క్లాసులు ఆరంభమవుతాయి.

వెబ్‌సైట్: https://code.iitm.ac.in/assets/wbmt/Brochure.pdf. https://code.iitm.ac.in/emobility.



నీకెవరు చెప్పారు?




అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యంలో ఒక రాక్షస కొండ ఉండేది. దాని పేరు రాక్షస కొండ అని పిలుచుకునేవాళ్లు. ఎందుకంటే అక్కడ మృగాలు సంచరించేవి. దారి దొంగలు ఉండేవాళ్లు. ఎక్కువగా హత్యలు జరిగేవి. దాని దగ్గర ఒక చిన్న ఊరు ఉంది. ఆ ఊరిలో రాములమ్మ అనే ఆమె కూరగాయల వ్యాపారం చేసేది. ప్రతి రోజూ దగ్గరలోని పెద్ద ఊరుకు నడిచి వెళ్లేది. ఆమె కష్టాలకు కొదువలేదు. అయినా ఓపిగ్గా వ్యాపారం చేసుకుంటూ బతికేది.

ఆమె కొండ దాటి వెళ్లి పది కిలోమీటర్ల దూరంలో ఉండే పెద్ద ఊరికి వెళ్లేది. ఏనాడూ ఆమె ఇబ్బంది పడలేదు. పైగా నూకలు ఉన్నన్నాళ్లు ఇక్కడ ఉంటామనే తత్వం ఆమెది. అందుకే ఆమె భయాన్ని లెక్కచేసేది కాదు. ఆ పెద్ద ఊరులో ఓ గుర్రపు రౌతు ఉండేవాడు. అతను పన్నులు వసూలు చేసే వ్యక్తి. అతనికి శిస్తు కట్టించటం తెలుసుకానీ.. ఇతరుల పట్ల అభిమానంగా ఉండటం రాదు. కరుకు మనిషి. పేరు శివాజీ. అతను గుర్రంమీద వెళ్తున్నప్పుడు దారిలో ఏమైనా విలువైన వస్తువులు కనపడితే.. రాజుగారి పేరు చెప్పి దర్జాగా తీసుకుని వెళ్లేవాడు. ఇసుమంతైనా సిగ్గు ఉండేది కాదు అతనికి.

ఒక రోజు కూరగాయలు అమ్ముకుని.. ఇంటి వంటకు సరిపడ వస్తువులను కొని సంచిలో సర్ది తన ఊరికి వెళ్తోంది రాములమ్మ. బరువు మోయలేకపోతోంది. కిందపడే పరిస్థితి. పైగా ఎండ. గుర్రం మీద వచ్చే రౌతును చూసి 'అయ్యా.. ఈ సంచిని తీసుకెళ్లండి. మా ఊరిలో ఫలానా కొలిమి దగ్గర ఉండే రామయ్య ఇంటి దగ్గర ఉంచండి. తీసుకుంటా' అన్నది. ఆ రౌతు కోపంగా చూసి.. 'ఇదేమైనా మీ నాయన సొమ్మా? ఈ గుర్రం నాది. పైగా రాజుగారి సేవకుడిని. రాజుగారి మనిషితో నువ్వు పని చేయించుకోవటం నేరం. అంటరాని దానవు' అంటూ తిట్టి గుర్రాన్ని పరిగెత్తించాడు. సాయం చేయకపోగా తిట్టిన ఆ రౌతును చూసి రాములమ్మ కోప్పడింది. బాధతో సంచిని మోస్తూ బయలుదేరింది.

అరకిలోమీటరు వెళ్లాక రౌతుకు ఒక అనుమానం వచ్చింది. కొంపదీసి సంచిలో విలువైన వస్తువులు ఉన్నాయా? అనుకున్నాడు. వెంటనే గుర్రాన్ని వెనక్కి తిప్పి ఆ ముసలామె దగ్గరకు వెళ్లాడు. 'ఈ సంచిని నువ్వు మోయలేవు. నాకు ఇవ్వు నేను తీసుకెళతా' అన్నాడు. 'నేను ఇప్పుడు ఇవ్వను' అన్నది రాములమ్మ. నేను తీసుకెళతా అన్నాడు ఆ రౌతు. కుదరదు అన్నది. 'ఇంతలో ఇవ్వకూడదు అని నీకెవ్వరు చెప్పారు?' అని అడిగాడు. 'ఇంతలో నీకెందుకు నా సంచి మీద అభిమానం కలిగింది. నీకెవ్వరు చెప్పారు?' అంటూ గట్టిగా అరిచింది. దగ్గరలో కొందరు ఊరి జనాలు కనపడ్డారు. దీంతో గుర్రాన్ని పరిగెత్తించాడు రౌతు.

సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 301

		3		8				7
	8		6		3		9	
2				4				
		5	4					1
	7		3	6	5		2	
9					8	4		
				5				8
	5		7		4		1	
4				3		9		

సుడోకు - 300 సమాధానం

6	3	5	2	1	8	9	4	7
7	1	2	4	6	9	5	8	3
4	8	9	3	7	5	1	2	6
5	2	1	8	9	6	3	7	4
3	7	6	1	5	4	8	9	2
8	9	4	7	3	2	6	1	5
9	5	8	6	2	7	4	3	1
1	4	7	5	8	3	2	6	9
2	6	3	9	4	1	7	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.